

'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 197

శనివారం 7-10-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



డైనమిక్ ప్రొఫెసర్‌కు డచ్ నోబెల్ -IIలో



కార్ డిజైనర్ థార్ డిజైనర్ -IIలో

పురస్కారం

డైనమిక్ ప్రొఫెసర్‌కు డచ్ నోబెల్

ఆర్థికశాస్త్రం చదువుకున్నవారి ఆసక్తి గణాంకాలకే పరిమితమని, న్యాయశాస్త్రం చదువుకున్న వారి ఆసక్తి ఆ శాస్త్రానికి సంబంధించిన అంశాలపైనే ఉంటుందనేది ఒక సాధారణ భావన.

'విభిన్న విద్యానేపథ్యం ఉన్న మేధావి'గా గుర్తింపు పొందిన జ్యోయితా గుప్తా ఆర్థికశాస్త్రం నుంచి న్యాయశాస్త్రం వరకు ఎన్నో శాస్త్రాలు చదివింది. అయితే ఆమె ప్రయాణంలో ఆ శాస్త్రాలేవీ వేటికవే అన్నట్లుగా ఉండిపోలేదు. వాతావరణ మార్పులపై తాను చేసిన శాస్త్రీయ పరిశోధనకు మరింత విస్తృతిని ఇచ్చాయి.

నెదర్‌లాండ్స్‌లోని యూనివర్శిటీ ఆఫ్ ఆమ్‌స్టర్‌డమ్‌లో ఎన్విరాన్‌మెంట్ అండ్ డెవలప్‌మెంట్ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న జ్యోయితా గుప్తా డచ్ రిసెర్చి కౌన్సిల్ నుంచి 'డచ్ నోబెల్'గా పేరొందిన ప్రతిష్ఠాత్మకమైన స్పినోజా ప్రైజ్‌ను ది హేగ్‌లో అందుకుంది...


జ్యోయితా గుప్తా

ఢిల్లీలో పుట్టి పెరిగింది జ్యోయితా గుప్తా. లోరెటో కాన్వెంట్ స్కూల్లో చదువుకుంది. ఢిల్లీ యూనివర్శిటీలో ఎకనామిక్స్, గుజరాత్ యూనివర్శిటీలో న్యాయశాస్త్రం, హార్వర్డ్ లా స్కూల్‌లో ఇంటర్నేషనల్ లా చదివింది.

'అభివృద్ధి చెందుతున్న దేశాల్లో వాతావరణ మార్పులు' అనే అంశంపై ఆమ్‌స్టర్ డామ్‌లోని వ్రిజే యూనివర్శిటీలో డాక్టరేట్ చేసింది. 2013లో ఈ యూనివర్శిటీలో ఫ్యాకల్టీగా చేరింది. వాతావరణ మార్పుల వల్ల సమాజంపై కలుగుతున్న ప్రభావం, ఉత్పన్నమవుతున్న సామాజిక అశాంతి... మొదలైన అంశాలపై లోతైన పరిశోధనలు చేసింది.

2016లో ఐక్యరాజ్య సమితి ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రామ్ గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్ ఔట్‌లుక్ (జీఈవో)కు కో– చైర్‌పర్సన్‌గా నియమితురాలైంది.

యూనివర్శిటీ ఆఫ్ ఆమ్‌స్టర్‌డమ్‌లో ఎన్విరాన్‌మెంట్ అండ్ డెవలప్‌మెంట్ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న జ్యోయితా గుప్తా 'ఆమ్‌స్టర్‌డామ్ గ్లోబల్ చేంజ్ ఇన్‌స్టిట్యూట్' సభ్యులలో ఒకరు.

పరిశోధనలకే పరిమితం కాకుండా పర్యావరణ సంబంధిత అంశాలపై విలువైన పుస్తకాలు రాసింది జ్యోయిత. 'ది హిస్టరీ ఆఫ్ గ్లోబల్ క్లైమెట్ గవర్నెన్స్' 'ది క్లైమెట్ ఛేంజ్ కన్వెన్షన్ అండ్ డెవలపింగ్ కంట్రీస్' 'టాక్సిక్ టెర్రరిజమ్: డంపింగ్ హజడస్ వేస్ట్' 'అవర్ సిమరింగ్ ప్లానెట్' 'ఆన్ బిహాఫ్ ఆఫ్ మై డెలిగేషన్: ఏ సర్వైవల్ గైడ్ ఫర్ డెవలపింగ్ కంట్రీ క్లైమెట్ నెగోషియేటర్స్' 'మెయిన్ స్ట్రీమింగ్ క్లైమేట్ చేంజ్ ఇన్ డెవలప్‌మెంట్ కో ఆపరేషన్'... మొదలైన పుస్తకాలు రాసింది.

అమెరికా పరిశ్రమల చెత్త ఏ దేశాలకు చేరుతుంది? ఎంత విషతుల్యం అవుతుందో 1990లోనే 'టాక్సిక్ టెర్రరిజమ్: డంపింగ్ హాజడస్ వేస్ట్' పుస్తకంలో కళ్లకు కట్టినట్లు వివరించింది. పాశ్చాత్య దేశాల పరిశ్రమలు ఉత్పత్తి చేసే విషపూరిత వ్యర్థాలు మరోవైపు విదేశీ మారకద్రవ్యం కోసం పరితపిస్తూ పర్యావరణాన్ని పట్టించుకోని దేశాల గురించి లోతైన విశ్లేషణ చేసింది జ్యోయిత.


ది హేగ్‌లో జరిగిన బహుమతి ప్రదాన కార్యక్రమంలో జ్యోయిత (చివరి వ్యక్తి)

సాధారణంగానైతే పర్యావరణ అంశాలకు సంబంధించిన చర్చ, విశ్లేషణ ఒక పరిధిని దాటి బయటికి రాదు. అయితే జ్యోయిత విశ్లేషణ మాత్రం ఎన్నో కోణాలను ఆవిష్కరించింది. వాతావరణంలోని మార్పులు ప్రభుత్వ పాలనపై చూపే ప్రభావం, ధనిక, పేద సమాజాల మధ్య తలెత్తే వైరుధ్యాల గురించి చెప్పడం ఇందుకు ఒక ఉదాహరణ.

'ప్రపంచవ్యాప్తంగా తగినన్ని ఆర్థిక వనరులు ఉన్నాయి. అందరి జీవితాలను బాగు చేయడానికి ఆ వనరులను ఎలా ఉపయోగించాలనేదే సమస్య. ప్రపంచవ్యాప్తంగా సంపన్నులు, నిరుపేదల మధ్య అసమానతలు ఉన్నాయి. భారత్ లాంటి దేశాల్లో కూడా ఇదొక పెద్ద సవాలు' అంటుంది జ్యోయిత.

ఆమె విశ్లేషణలో విమర్శ మాత్రమే కనిపించదు. సందర్భాన్ని బట్టి పరిష్కారాలు కూడా కనిపిస్తాయి.

'విస్తృతమైన, విలువైన పరిశోధన' అంటూ స్పినోజా ప్రైజ్ జ్యూరీ గుప్తాను కొనియాడింది. కొత్త తరం పరిశోధకులకు ఆమె మార్గదర్శకత్వం విలువైనదిగా ప్రశంసించింది.

తనకు లభించిన బహుమతి మొత్తాన్ని (1.5 మిలియన్ యూరోలు) శాస్త్రపరిశోధన కార్యక్రమాలపై ఖర్చు చేయాలని నిర్ణయం తీసుకుంది జ్యోయితా గుప్తా.

అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణకు, పర్యావరణ సంరక్షణకు చట్టాలతో కూడిన ప్రపంచ రాజ్యాంగం కోసం జ్యోయితా గుప్తా గట్టి కృషి చేస్తోంది.


టిప్
ఆరోగ్యాన్ని నమలండి

చేదుగా ఉన్నప్పటికీ వేపలో అనేక ఆరోగ్యసుగుణాలు ఉన్నాయని తెలిసిందే. అయితే రోజూ వేపను మన జీవన శైలిలో భాగం చేసుకుంటే మరిన్ని ప్రయోజనాలు చేకూరతాయి. అవేంటో చూద్దాం... ● పరగడుపున నాలుగు వేపాకులను నమిలితే నోటి ఆరోగ్యం మెరుగుపడుతుంది. నోటినుంచి వచ్చే దుర్వాసన, పంటినొప్పి వంటి సమస్యలు తగ్గుముఖం పడతాయి. ● పొట్టలోని హానికర సూక్ష్మ జీవుల్ని చంపడంలో వేపాకు చక్కగా పనిచేస్తోంది. వేపాకును కొద్దిగా నమిలి మింగితే వాంతులు అవ్వవు ● రోజూ క్రమం తప్పకుండా వేపాకుల్ని నమలడం వల్ల జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగుపడుతుంది. ఫలితంగా జీర్ణక్రియ సక్రమంగా జరిగి,మలబద్ధకం సమస్య తగ్గుతుంది. ● వేప పేస్టుని వాపుపై పెడితే వాపు తగ్గుతుంది. ● క్రమం తప్పకుండా వేపాకులు నమిలితే చర్మం కాంతిమంతమవడంతోపాటు, శరీరం అలసట తగ్గి, చురుకుగా మారుతుంది.



మహీంద్రా థార్‌ను చూసి భలే ఉందే అనుకున్నారా?
దానిని డిజైన్ చేసింది ఒక స్త్రీ అని చాలామంది అనుకోరు.
ఎందుకంటే ఆటోమొబైల్ ఇండస్ట్రీలో మగవారి ప్రాబల్యం ఎక్కువ.
కాని క్రిపా అనంతన్ గొప్ప కార్ డిజైనర్‌గా
ఈ రంగంలో తన ప్రభావం చూపుతోంది.
మహీంద్రాలో హిట్ అయిన అనేక ఎస్‌యువీలను ఆమే డిజైన్ చేసింది.
ఇపుడు ఓలాకు డిజైన్ హెడ్‌గా పని చేస్తూ ఉంది.

కార్ డిజైనర్ థార్ డిజైనర్



క్రిపా అనంతన్

మహీంద్రా సంస్థకు గొప్ప పేరు తెచ్చిన 'థార్'ను క్రిపా అనంతన్ డిజైన్ చేసింది. ఆమె వయసు 53. పూర్తి పేరు రామ్‌క్రిపా అనంతన్ అయితే అందరూ క్రిపా అని పిలుస్తారు. 'ఆటోమొబైల్ డిజైనర్ కూడా చిత్రకారుడే. కాకపోతే చిత్రకారుడు కాగితం మీద రంగులతో గీస్తే మేము లోహాలకు రూపం ఇస్తాం... శక్తి కూడా ఇచ్చి కదలిక తెస్తాం' అంటుంది క్రిపా.

బిట్స్ పిలానీలో మెకానికల్ ఇంజినీరింగ్ చేసిన క్రిపా ఆ తర్వాత ఐ.ఐ.టి ముంబైలో ఇండస్ట్రియల్ డిజైన్ చదివి 1997లో మహీంద్రాలో ఇంటీరియర్ డిజైనర్‌గా చేరింది. ఆ సమయంలో తయారైన వాహనాలు– బొలెరో, స్కార్పియోలకు ఇంటీరియర్ డిజైన్ పర్యవేక్షించింది. ఆమె ప్రతిభను గుర్తించిన సంస్థ కొత్త ఎస్‌యువిని తేదలిచి దాని డిజైనింగ్ బాధ్యతలు అప్పజెప్పింది. సాధారణంగా ప్రయాణాలంటే ఇష్టపడే క్రిపా తన టూ వీలర్– బజాజ్ అవెంజర్ మీద మనాలి నుంచి శ్రీనగర్ వరకూ ఒక్కతే ప్రయాణిస్తూ వాహనం ఎలా ఉండాలో ఆలోచించింది. అంతేకాదు దాదాపు 1500 మందిని సర్వే చేయించి ఎస్‌యువి ఎలా ఉంటే బాగుంటుందో సూచనలు తీసుకుంది. 'మహీంద్రా ఏ బండి తయారు చేసినా దాని రూపం ఘనంగా ఉండాలి. చిన్నబండి అయినా తన ముద్ర వేయాలి. నేను సాధారణంగా ప్రకృతి నుంచి అటవీ జంతువుల నుంచి వాహనాల డిజైన్లు చూసి ఇన్‌స్పైర్ అవుతాను. చీటాను దృష్టిలో పెట్టుకుని నేను అనుకున్న డిజైన్ తయారు చేశాను' అందామె. ఆ విధంగా ఆమె పూర్తి స్థాయి డిజైన్‌తో మహీంద్రా ఎస్‌యువి 500 మార్కెట్‌లోకి వచ్చింది. పెద్ద హిట్ అయ్యింది. దాంతో ఆటోమొబైల్ ఇండస్ట్రీలో మహిళా డిజైనర్‌గా క్రిపా సంచలనం సృష్టించింది. ఆ తర్వాత ఇతర వాహనాల డిజైన్ల బాధ్యత కూడా ఆమెకే అప్పజెప్పారు. 'ప్రతి మనిషికీ ఒక కథ ఉన్నట్టే ప్రతి వాహనానికీ ఒక కథ ఉండాలి. అప్పుడే జనానికి కనెక్ట్ అవుతుంది' అంటుంది క్రిపా.

ఆమె తయారు చేసిన 'ఎస్‌యువి 300' మరో మంచి డిజైన్‌గా ఆదరణ పొందింది. ఇక 'థార్' అయితే అందరూ ఆశపడే బండి అయ్యింది. ఇప్పుడు థార్ అమ్మకాలు భారీగా ఉన్నాయి. మహీంద్రా సంస్థ ఎలక్ట్రిక్ వాహనాల తయారీకి ఉపక్రమిస్తుండగా 2021లో తన సొంత ఆటోమొబైల్ డిజైన్ స్టూడియో ఏర్పాటు కోసం సంస్థ నుంచి బయటకు వచ్చింది క్రిపా. అయితే ఇప్పుడు ఓలా గ్రూప్‌కు డిజైన్‌హెడ్‌గా పని చేస్తోంది. అంటే ఇకపై ఓలా గ్రూప్ నుంచి వెలువడే వాహనాలు ఆమె రూపకల్పన చేసేవన్న మాట.

> ప్రతి మనిషికీ ఒక కథ ఉన్నట్టే ప్రతి వాహనానికీ ఒక కథ ఉండాలి. అప్పుడే జనానికి కనెక్ట్ అవుతుంది.
> – క్రిపా అరంతన్

ఇరవైమంది డిజైనర్లతో కొత్త ఆలోచనలకు పదును పెట్టే క్రిపా తన బృందంలో కనీసం 5గురు మహిళలు ఉండేలా చూసుకుంటుంది. మహిళల ప్రతిభకు ఎప్పుడూ చోటు కల్పించాలనేది ఆమె నియమం. క్రిపాకు ఏ మాత్రం సమయం దొరికినా పారిస్‌కో లండన్‌కో వెళ్లిపోతుంది. అక్కడ ఏదైనా కేఫ్‌లో కూచుని రోడ్డు మీద వెళ్లే స్పోర్ట్స్ కార్లను పరిశీలిస్తూ ఉండటం ఆమెకు సరదా.

'2050 నాటికి ఆటోమొబైల్ ఇండస్ట్రీ ఎలా ఉంటుందో ఊహించుకుంటూ ఇవాళ్టి నుంచి మన పనిని తీర్చిదిద్దుకోవాలి' అంటుందామె.

ఇంత దార్శనికత ఉన్న డిజైనర్ కనుక విజయం ఆమెకు డోర్ తెరిచి నిలబడుతోంది. ●

లైఫ్@360

సర్దుకు పోవద్దు.. సర్దుకుందాం ఇలా

కిచెన్‌ను శుభ్రంగా ఉంచుకోవడంలో మొదటి మెట్టు... వంట పూర్తి కాగానే.. కిచెన్ ప్లాట్‌ఫామ్, స్టౌను వెంటనే శుభ్రం చేసేసుకోవడం. స్టవ్ మీద, ప్లాట్‌ఫామ్ మీదా మనం వండిన వంటలోని చిందులు, నూనె మరకలు పడటం సహజం. అలాంటి వాటిని వంట అవగానే వెంటనే తుడిచేయాలి. గోరువెచ్చటి నీళ్లలో వెనిగర్ కలిపి శుభ్రం చేస్తే.. క్రిములు తొలగిపోతాయి. స్టౌ మీద పడిన నూనె మరకలను తొలగించడానికి, కిచెన్ ప్లాట్‌ఫామ్ శుభ్రం చేయడానికి యాంటీ బ్యాక్టీరియల్ వైప్స్‌ని ఉపయోగించచ్చు. అవి కాసింత ఖరీదైనవి కావడం వల్ల చాలామంది కిచెన్ టవల్స్‌నే వాడతారు.

ఒకోసారి కిచెన్‌లో నూనె ఒలికిపోతుంటుంది. వెంటనే ఆ నూనె మీద గోధుమ పిండి లేదా బియ్యప్పిండిని చల్లి కాసేపటి తరువాత పేపర్‌తో తుడిస్తే జిడ్డులేకుండా శుభ్రపడుతుంది.



వంట చేయాలంటే మంచి వాతావరణం ఉండాలి. అంటే కిచెన్ క్లీన్‌గా ఉండాలి. చాలా మంది ఇది పెద్ద పనిలా అనుకుంటారు. కానీ, కొన్ని చిట్కాలు పాటిస్తే కిచెన్ ఈజీగా క్లీన్ అవుతుంది. దీంతో వంట చేయాలనే ఉత్సాహం వస్తుంది.
కిచెన్‌ని ఎలా క్లీన్ చేస్తే త్వరగా పని పూర్తవుతుంది, వంట గదిని పరిశుభ్రంగా ఉంచుకోవడం ఎలాగో వివరించే కొన్ని చిట్కాలను పాటించడం వల్ల వంటగది ఎలా ఉన్నా సరే, సర్దుకుపోదాం అనే ధోరణిలో కాకుండా ఇలా ఉంటే సులువుగా సర్దుకోవచ్చు.

■ **కిచెన్ ప్లాట్‌ఫామ్‌పై మరకలు ఉంటే..**

వంటసోడా వేసిన నీళ్లతో కిచెన్ ప్లాట్‌ఫామ్ తుడిస్తే చాలు. అంతేకానీ బ్లీచింగ్, అమోనియా లాంటివి వాడటం వల్ల క్యాబినెట్‌కున్న రంగులు, టైల్స్ దెబ్బతింటాయి.

కూరగాయలు తరగడం పూర్తయిన వెంటనే ఆ ప్రదేశాన్ని శుభ్రం చేయకపోతే అక్కడున్న తేమ, కాయగూరల అవశేషాలు వాతావరణంలో ఉన్న బ్యాక్టీరియా, వైరస్, ఇతర క్రిముల్ని త్వరగా ఆకర్షిస్తాయి. తరిగేటప్పుడే ఓ డబ్బా పెట్టుకొని, తొక్కలు, తొడిమల్లాంటివి దాంట్లో వేసి తర్వాత చెత్తడబ్బాలో పడేస్తే.. శుభ్రంగా ఉంటుంది.

■ **కిచెన్ టవల్స్‌ను కూడా...**

కిచెన్ ప్లాట్‌ఫామ్‌ని, స్టవ్‌నీ క్లీన్ చేసేందుకు ఉపయోగించే కిచెన్ టవల్‌ని సరిగా శుభ్రం చేయకపోతే దానికి ఉండే బ్యాక్టీరియా వల్ల అంతవరకు మనం చేసినదంతా నిరర్థకమవుతుంది. కిచెన్ టవల్స్ జిడ్డుగా ఉంటే గోరువెచ్చని నీటిలో సర్ఫ్, వాషింగ్ లిక్విడ్ వేసి కాసేపు నానబెట్టిన తర్వాత బట్టలుతికే బ్రష్‌తో క్లీన్ చేస్తే క్లీన్ అయిపోతాయి.



■ **కిచెన్ క్యాబినెట్**

కిచెన్ ప్లాట్‌ఫామ్ కింద లేదా పైన సామాన్లు పెట్టుకోవడం కోసం ఉంచిన ర్యాక్స్, క్యాబినెట్ పుల్స్, హ్యాండిల్స్‌పై కూడా సూక్ష్మక్రిములు ఉంటాయి. వాటిని క్రిమిసంహారక వైప్‌తో క్లీన్ చేస్తే మంచిది. వెనిగర్‌ని క్లాత్‌పై స్ప్రే చేసి వాడండి. దీనివల్ల వేలిముద్రలు, నీటి గుర్తులు పోయి తెల్లగా మెరుస్తాయి.

■ **ఫ్రిజ్ క్లీన్‌గా..**

ఫ్రిజ్‌లో మనం చాలా స్టఫ్ పెడుతుంటాం. కానీ, దానిని ఎప్పుడో ఓసారి క్లీన్ చేస్తుంటాం. అలా కాకుండా దీనిని కూడా మరకలు లేకుండా శుభ్రంగా తుడవడం మంచిది. ఫ్రిజ్ కింద, డోర్స్, లోపల గ్లాసెస్.. ఇలా అన్నింటిని తడిగుడ్డతో తుడిస్తే త్వరగా క్లీన్ అవుతుంది. ఇక మిగిలిపోయిన ప్రతిదానిని ఫ్రిజ్‌లో తోసేయకుండా ఎప్పటికప్పుడు క్లీన్ చేయడం చాలా మంచిది.

■ **సింక్ క్లీన్..**

కిచెన్ క్లీన్ చేయాలంటే ముందుగా సింక్‌ని క్లీన్ చేయాలి. సింక్ బేసిన్ నీట్‌గా ఉందో లేదో చూసుకోండి. కౌంటర్ చుట్టూ ఎప్పటికప్పుడు క్లీన్ చేయడం వల్ల వైరస్, బ్యాక్టీరియా వంటివి దూరమవుతాయి. అందుకే, ముందు దీనిని క్లీన్ చేయండి. సింక్ సరిగ్గా లేకపోతే అందులో నుంచే ఎక్కువ బొద్దింకలు, వాటి ద్వారా వ్యాధులు వస్తాయి. కొద్దిగా బ్లీచింగ్ పౌడర్, డిష్‌వాష్, బేకింగ్ సోడాతో క్లీన్ చేస్తే సరి. సింక్‌లో మాంసాహారం కడిగిన తర్వాత దాన్ని సోప్ వాటర్‌తో శుభ్రం చేసేస్తే సింక్ దుర్వాసన రాకుండా ఉంటుంది.

కాస్త తీరిక దొరికినప్పుడు ఓ క్లాత్ తీసుకుని వాటర్ స్ప్రే చేస్తూ కిచెన్ గోడలు, కౌంటర్స్‌ని క్లీన్ చేయండి. ఇందుకోసం మార్కెట్లో దొరికే స్ప్రేలను కూడా ఉపయోగించవచ్చు.. ఇప్పుడు డోర్ ఫ్రేమ్స్‌ని క్లీన్ చేయండి.

వంటగదిని అన్ని వస్తువులు సులభంగా దొరికేలా సర్దుకుంటే వంట చేయడం ఈజీ అవుతుంది. ఎలాగో చూద్దాం...

■ **ట్రాన్స్‌పరెంట్ డబ్బాలు**

వంట చేసుకునేప్పుడు ఏ డబ్బాలో ఏముందా? అని వెతుక్కోవడానికే సమయం వృథా అవుతుంది. అలా కాకుండా షెల్ఫుల్లో ట్రాన్స్‌పరెంట్‌గా ఉండే ప్లాస్టిక్ డబ్బాలు లేదా స్టీల్ డబ్బాలూ గాజు సీసాలూ అందుబాటులో ఉంటాయి. వాటిని ప్రయత్నించి చూడండి. పని సులభం అవుతుంది.



■ **సరుకులనూ వేరు చేయడం**

వంట గదిలో షెల్ఫులలో అన్ని సరుకుల్ని అన్ని షెల్ఫుల్లో సర్దేయకుండా ఎక్కువగా వంటకు వాడే వాటిని ఒకచోట, తక్కువగా వాడే పదార్థాల్ని వేరే షెల్ఫులో, బేకింగ్ సామగ్రిని మరో దగ్గర పెట్టుకోవడం వల్ల చాలా సమయం ఆదా అవుతుంది.



పిల్లల ఎముకలు బలంగా పెరగాలంటే..

పిల్లల ఎదుగుదల విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ఎందుకంటే పెద్దవారితో పోల్చితే పిల్లల ఎముకలు బలహీనంగా ఉంటాయి. దీనివల్ల చిన్న చిన్న దెబ్బలు తాకినా తొందరగా విరిగిపోయే ప్రమాదం ఉంటుంది. బాల్యంలోని బలమైన ఎముకలు వారి జీవితకాల ఆరోగ్యానికి అద్భుతమైన పునాదిని అందిస్తాయి. అందువల్ల వారి ఎముకలు దృఢంగా ఉండేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలు, పాటించవలసిన ఆహార నియమాలపై అవగాహన కోసం...

కాల్షియం

గుండెను ఆరోగ్యంగా ఉంచడానికి, కండరాలను బలోపేతం చేయడానికి, ఎముకలను అభివృద్ధి చేయడానికి కాల్షియం అవసరం అని తెలుసు కాబట్టి పిల్లలు రోజుకు కనీసం రెండు గ్లాసుల పాలను తాగేట్టు చూడాలి. అలాగే ఆహారంలో బచ్చలికూర, పాలకూర వంటి ఆకుకూరలు, బెండ, పొట్ల వంటి కూరగాయలు ఉండేట్టు చూడండి. అలాగే రోజుకు ఒకసారైనా పెరుగును తినేట్టు చూడండి. సోయా పాలు, సోయా పెరుగు వంటి సోయాబీన్ ఉత్పత్తుల్లో కూడా కాల్షియం పుష్కలంగా ఉంటుంది.



విటమిన్ డి

శరీరానికి కావలసిన కాల్షియంను గ్రహించేందుకు విటమిన్ డి సహాయపడుతుంది. విటమిన్ డి సూర్యరశ్మి ద్వారా, కొన్ని రకాల ఆహారాల ద్వారా పొందవచ్చు. పిల్లల ఆహారంలో తగినంత విటమిన్ డి లేకపోతే విటమిన్ డి సప్లిమెంట్‌ను తీసుకోవాలి. నవజాత శిశువులకు కూడా విటమిన్ డి సప్లిమెంట్స్ అవసరం. కానీ డాక్టర్లను సంప్రదించిన తర్వాతే ఇవ్వాలి.

మెగ్నీషియం, విటమిన్ కె

శరీరంలో విటమిన్ కె, మెగ్నీషియం స్థాయిలు ఎక్కువగా ఉంటే ఎముకలు బలంగా ఉంటాయి. అలాగే రికెట్స్, బోలు ఎముకల వ్యాధితో సహా ఎన్నో ఎముకల సమస్యలను తగ్గించడానికి ఇవి సహాయపడతాయి. కాల్షియంతో పాటుగా ఈ విటమిన్లు కూడా మీ పిల్లల ఎముకలను బలోపేతం చేయడానికి సహాయపడతాయి. బచ్చలికూర, క్యాబేజీ, మొలకలు వంటి వాటిల్లో విటమిన్ కె, మెగ్నీషియం పుష్కలంగా ఉంటాయి. పిల్లలకు తృణధాన్యాలను పెట్టండి.

కార్బోనేటెడ్ పానీయాలు వద్దే వద్దు

కార్బొనేటెడ్ పానీయాలలో సాధారణంగా కొన్ని ఫాస్ఫోరిక్ ఆమ్లాలు ఉంటాయి. ఇది శరీరం కాల్షియాన్ని గ్రహించకుండా నిరోధిస్తుంది. ఈ ఆమ్లం ఎముకల ఆరోగ్యానికి అస్సలు మంచిది కాదు. కార్బొనేటెడ్ పానీయాలకు బదులుగా నారింజ రసం వంటి హెల్తీ పానీయాలను తాగించండి.

ఎముకలను బలోపేతం చేసేవాటిలో ముఖ్యమైనది శారీరక శ్రమ. అందుకే పిల్లలు బాగా ఆటలు ఆడేలా చూడండి. వీలైతే చిన్న చిన్న వ్యాయామాలను చేయించండి.



40లలో ఉన్నారా?
జీవన సరళిలో మార్పులు అవసరం



మనిషి జీవితం 40 ఏళ్లకి ముందు ఒకలా, ఆ తరువాత మరొకలా ఉంటుంది. బాధ్యతలు పెరగటం వల్ల, శరీర మార్పుల వల్ల, రకరకాల శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలతో సతమతం కావడం మొదలవుతుంది. అందుకే ఆ వయసుకి రాగానే మన జీవన సరళిలో మార్పులు చేయాలి. ఆ మార్పులేమిటో తెలుసుకుని వాటిని ఆచరించే ప్రయత్నం చేద్దాం.

● నాలుగు పదుల వయసు వచ్చేసరికి కండరాల్లో సాంద్రత తగ్గుతూ ఉంటుంది. రక్త సరఫరా కూడా నెమ్మదిస్తుంటుంది కాబట్టి, దినచర్యలో వ్యాయామం తప్పనిసరి చేసుకోవాలి. మలబద్ధకం, జీర్ణ సమస్యలు రాకుండా ఆహారంలో పీచు పదార్థాలు ఎక్కువ ఉండేలా చూసుకోవాలి. అన్నం పరిమాణాన్ని తగ్గించాలి. తాజాఫలాలు ఎక్కువ తీసుకోవాలి. ● కాల్షియం లెవెల్స్ తీసుకోవడం పెంచండి. ● కంటిచూపు మందగించకుండా విటమిన్ ఎ, సి ఉండే పదార్థాలు తినాలి. ● మొబైల్స్, ల్యాప్ టాప్ వాడకం తగ్గించాలి. ● ఎప్పుడు హైడ్రేటెడ్‌గా ఉండాలి. అంటే నీళ్ళు బాగా తాగాలి. ● వయసు, బరువు, ఎత్తు, బాడీ మాస్ ఇండెక్స్ చూసుకోండి. ఫ్యాట్ ఉంటే కరిగించండి. ● బలహీనంగా ఉంటే బరువు పెంచండి. ● విటమిన్ ఎ, సి, యాంటీ ఆక్సిడెంట్స్ ఉండే ఆహారం తీసుకోవాలి. ● రోగనిరోధకశక్తి పెంచుకోవాలి. ● మెంటల్ హెల్త్ బాగుండాలంటే ప్రశాంతంగా ఉంటూ తగినంత నిద్ర పోవడం అవసరం.

సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 197

శనివారం 7-10-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ నాటికి సొంత ఇల్లు కలిగి ఉండేటట్లు చూడటం ప్రభుత్వాల కనీస బాధ్యత'



హాకీలో పసిడి వెలుగులు

ఆసియా క్రీడల్లో భారత పురుషుల హాకీ జట్టు స్వర్ణ పతకంతో మెరిసింది. ఫైనల్లో భారత్ 5–1తో జపాన్ జట్టును ఓడించి వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్ క్రీడలకు అర్హత సాధించింది. ఓవరాల్‌గా 13వ రోజు భారత్ ఖాతాలో తొమ్మిది పతకాలు చేరాయి. ప్రస్తుతం భారత్ 95 పతకాలతో నాలుగో స్థానంలో ఉంది.

- వివరాలు 12లో



టీచర్ల బదిలీలపై హైకోర్టు స్టే

ఉపాధ్యాయ బదిలీలపై హైకోర్టు స్టే విధించింది. తదుపరి విచారణ వరకు బదిలీల నిలిపివేతపై మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది.

- వివరాలు 5లో



గ్రూప్‌-4 తుది కీ విడుదల

గ్రూప్‌–4 కొలువుల భర్తీలో భాగంగా జూలై 1న నిర్వహించిన అర్హత పరీక్ష తుది కీని వెబ్‌సైట్‌లో ఉంచినట్లు టీఎస్‌పీఎస్సీ తెలిపింది.

- వివరాలు 14లో

శుక్రవారం రంగారెడ్డి జిల్లా రావిర్యాల ప్రభుత్వ పాఠశాలలో ముఖ్యమంత్రి ఉపాహార పథకాన్ని ప్రారంభించి విద్యార్థులకు స్వయంగా తినిపిస్తున్న మంత్రులు సబిత, హరీశ్‌. హైదరాబాద్‌ ఈస్ట్‌ మారేడ్‌పల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో కలిసి అల్పాహారం చేస్తున్న మంత్రి కేటీఆర్‌





స్కిల్‌ కార్పొరేషన్‌కు, టీడీపీకి ఒకరే ఆడిటర్‌

- ప్రజాధనం కొల్లగొట్టేందుకే ఈ ఎత్తుగడ: సీఐడీ
- వాటిపై విచారణకు చంద్రబాబును మరోసారి కస్టడీకివ్వాలి

- 2లో

ప్రతి పథకం వెనుక మానవీయత

- విద్యార్థులకు అల్పాహారంతో ఆరోగ్యం, చదువు మెరుగుపడతాయి: మంత్రి హరీశ్‌
- పేద పిల్లల ఆకలిని తీర్చాలనే కొత్త పథకం అమల్లోకి తెచ్చినట్టు వెల్లడి
- రంగారెడ్డి జిల్లా రావిర్యాలలో మంత్రి సబితతో కలసి అల్పాహారం పథకం ప్రారంభించిన హరీశ్‌

14లో

టిఫినీలు చేసి.. చదివేసి

విద్యార్థులకు అవసరమైన పౌష్టికాహారం అందించడం, బడిపై పిల్లల్లో ఆసక్తి పెంచడం లక్ష్యంగా శుక్రవారం నుంచి ప్రారంభమైన 'ముఖ్యమంత్రి అల్పాహార పథకం'పై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

- 14లో

హక్కుల పోరుకు నోబెల్‌ శాంతి



- ఇరాన్‌లో మహిళల అణచివేత, మానవ హక్కులపై పోరాడుతున్న నర్గిస్‌ మొహమ్మదికి ప్రతిష్టాత్మక పురస్కారం
- ప్రస్తుతం టెహ్రాన్‌ జైల్లో ఉన్న యోధురాలు..
- మహిళల కోసం జీవితాన్ని ధారపోసినందుకు ఆమెను ఎంపిక చేశామన్న నోబెల్‌ కమిటీ
- పురస్కారం కింద దాదాపుగా 10 లక్షల డాలర్ల నగదు, 18 కేరట్ల బంగారు పతకం

- వివరాలు 6లో

క్లుప్తంగా...

క్లియరెన్స్ రాక సాగర్ నీటి విడుదలకు బ్రేక్

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ ఎడమకాల్వకు శుక్రవారం నుంచి సాగునీటిని విడుదల చేయాలని నిర్ణయించినప్పటికీ అది సాధ్యపడలేదు. ఎడమకాల్వకు పలుచోట్ల బుంగలు పడటంతో వాటికి రెండు వారాల నుంచి మరమ్మతులు చేస్తున్నారు. ఆ పనులు పూర్తికాకపోవడం వల్ల నీటిని విడుదల చేయలేదు. శుక్రవారం సాయంత్రం వరకు పనులు పూర్తికానున్నట్లుగా ఎడమకాల్వకు సంబంధించిన ఇంజనీర్లు తెలిపారు. శనివారం ఉదయం 11 గంటలకు నీటిని విడుదల చేయనున్నట్లు డ్యాం ఇంజనీర్లు తెలిపారు. ఉన్నతాధికారులు తెలిపిన సమాచారం మేరకు 500 క్యూసెక్కులతో ప్రారంభించి.. గంటకు వెయ్యి చొప్పున పెంచుతూ రోజుకు 5వేల క్యూసెక్కులను మొదటగా విడుదల చేయనున్నట్లు సమా చారం.

పశుసంవర్ధక శాఖ డైరెక్టర్‌గా రాంచందర్

రెగ్యులర్ పోస్టులో నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర పశుసంవర్ధక శాఖ డైరెక్టర్‌గా డాక్టర్. ఎస్. రాంచందర్ నియమితులయ్యారు. ప్రస్తుతం గొర్రెలు, మేకల అభివృద్ధి కార్పొ రేషన్ మేనేజింగ్ డైరెక్టర్ పోస్టులో ఉన్న ఆయన పశుసంవర్ధక శాఖ డైరెక్టర్‌గా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన్ను డైరెక్టర్‌గా రెగ్యు లర్ పోస్టులో నియ మిస్తూ ప్రభుత్వం శుక్ర వారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పశు సంవర్ధక శాఖ ముఖ్య కార్యదర్శి అధర్ సిన్హా ఉత్తర్వులిచ్చారు.

13 నుంచి దసరా సెలవులు

కళాశాలలకు 19 నుంచి..

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పాఠశాలలకు ఈ నెల 13 నుంచి 25వ తేదీ వరకూ దసరా సెలవులు ఇస్తున్నట్టు విద్యాశాఖ ప్రకటించింది. జూనియర్ కళాశాలలకు ఈ నెల 19 నుంచి 25 వరకూ సెలవులు ఉంటాయని ఇంటర్ బోర్డు ప్రకటించింది. అన్ని విద్యా సంస్థలు 26వ తేదీన పునఃప్రారంభమవుతాయి.

'మహిళలను కించపరచడం సిగ్గుచేటు'



సాక్షి, అమరావతి: ఏపీలో మహిళలను కించపరుస్తూ ప్రతిపక్ష నేతలు దిగజారుడు వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని నటి రాధిక విమర్శించారు. టీడీపీ నేత, మాజీ మంత్రి బండారు సత్యనారాయణ సభ్యతను మరిచి మంత్రి రోజా వ్యక్తిత్వంపై దాడి చేయడం దుర్మార్గమన్నారు. మంత్రికి మద్దతుగా రాధిక శుక్రవారం 'ఎక్స్'లో ఓ వీడియో పోస్టు చేశారు. ఈ వీడియోలో రాధిక మాట్లాడుతూ.. 'రోజాపై చేసిన వ్యాఖ్యలను తలచుకుంటే గుండె రగులుతోంది. తెలుగుదేశం పార్టీ సభ్యులు మహిళలకు ఎలాంటి గౌరవం ఇస్తున్నారో అర్థమవుతోంది.' అని మండిపడ్డారు. బండారుకు వ్యక్తిత్వముంటే మంత్రి రోజాకు క్షమాపణ చెప్పాలని హితవుపలికారు. ఈ ఘటనపై ప్రధాని మోదీ స్పందించాలని, పార్లమెంట్, అసెంబ్లీల్లో ఖండించాలని కోరారు.

బండారును శిక్షించేంత వరకూ పోరాడతా: కుష్బూ



నగరి(చిత్తూరు జిల్లా): ఏపీ మంత్రి రోజాపై టీడీపీ మాజీ మంత్రి బండారు సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు, జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు, సినీ నటి కుష్బు తీవ్ర బాధను, ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. శుక్రవారం ఈ అంశంపై ఆమె స్పందిస్తూ సామాజిక మాధ్యమాల్లో ఓ వీడియోను విడుదల చేశారు. అందులో ఆమె మాట్లాడుతూ ఒక మహిళ గురించి ఇంత అసభ్యకరంగా మాట్లాడటం క్షమించరాని నేరమన్నారు. మంత్రి రోజాకు బహిరంగ క్షమాపణ చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. లేకుంటే బండారును శిక్షించేంత వరకూ పోరాడుతానని కుష్బు హెచ్చరించారు.



'దళిత బంధు' పండుగ



రామానుజవరంలో సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే సండ్ర ఫొటోలకు పూలాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

దళితబంధు పథకాన్ని వర్తింపజేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గం తల్లాడ మండలం రామానుజవరంలో సంబురాలు నిర్వహించారు. నియోజకవర్గం దళితులందరికీ దళితబంధు పథకం వర్తింపజేస్తామని ఇటీవలి పర్యటనలో మంత్రి కేటీఆర్ ప్రకటించారు. ఈ మేరకు ప్రభుత్వం జీవో జారీ చేయగా, ప్రత్యేకాధికారులు శుక్రవారం నుంచి సర్వే చేపట్టారు. సాగర్ ఆయకట్టు నీరు కూడా విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆధ్వర్యంలో శుక్రవారం రామానుజవరంలో సంబురాలు నిర్వహించారు. సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే సండ్ర భారీ చిత్రపటాలకు పూలాభిషేకం చేశారు. తొలుత గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. – తల్లాడ

త్వరలో 'వందే సాధారణ్' రైళ్లు

జనవరి నాటికి నాన్ ఏసీ వందేభారత్ రైళ్లు

- అల్పాదాయ వర్గాలకు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు
- సంప్రదాయ రైళ్ల కంటే సౌకర్యవంతంగా, ఆధునికంగా కోచ్‌లు
- వందేభారత్ తరహాలో పుష్‌పుల్ పద్ధతిలో లోకోమోటివ్ వ్యవస్థ



చెన్నై ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీలో సిద్ధమవుతున్న నమూనా రైలు

వందే సాధారణ్ ప్రత్యేకతలు ఇవే..

- సంప్రదాయ నాన్ ఏసీ రైళ్లకు ఇవి కొంత భిన్నంగా ఉంటాయి. వందేభారత్ తరహాలో పుష్‌పుల్ పద్ధతిలో ముందు, వెనక ఇంజిన్లు ఉంటాయి.
- గరిష్టంగా 24 చొప్పున లింక్ హాఫ్‌మాన్ బుష్ (ఎల్‌హెచ్‌బీ) కోచ్‌లు ఉంటాయి.
- సంప్రదాయ రైళ్లలోని సీట్లతో పోలిస్తే వీటిల్లో మెరుగ్గా ఉంటాయి. ప్రతి బెర్త్ వద్ద చార్జింగ్ పాయింట్లు కూడా ఉంటాయి.
- వందేభారత్ రైళ్లలో ఉన్నట్టుగానే ప్రయాణికులకు కోచ్‌లలో అనౌన్స్‌మెంట్ స్క్రీన్లు, ఆడియో వ్యవస్థ ఉంటాయి.
- ప్రయాణికుల భద్రత కోసం సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేస్తారు. వందేభారత్ రైళ్లలో ఉన్నట్టు ఆటోమేటిక్ డోర్లు ఉంటాయి.
- శుభ్రంగా ఉండేలా చూడటంతోపాటు చెడు వాసన రాకుండా బయో వాక్యూమ్ టాయిలెట్లు ఏర్పాటు చేస్తారు.

సాక్షి, హైదరాబాద్: వందేభారత్ రైళ్లు విజయవంతం కావడంతో రైల్వే శాఖ సాధారణ ప్రజలకు కూడా వీటిని అందుబాటులోకి తీసుకు రావడానికి సన్నాహాలు చేస్తోంది. కాచిగూడ నుంచి బెంగళూరుకు కేవలం ఎనిమిదిన్నర గంటల్లోనే చేరుకునే పూర్తి ఏసీతో ఉండే వందేభారత్ రైలు ఎక్కాలని సామాన్య జనానికి కోరిక ఉన్నా, రూ.1,600 టికెట్ ధర చూసి వారు వెనకడుగు వేస్తున్నా రు. మరింత సౌకర్యవంతంగా ఉండే ఎగ్జిక్యూటివ్ కోచ్ టికెట్ ధర ఏకంగా రూ.2,550 ఉండటంతో మామూలు ప్రయాణికులు అటు వైపు చూసే పరిస్థితి కూడా లేదు. ఈ నేపథ్యంలో ఇప్పుడు అతి సాధారణ జనానికి కూడా కొంతమేర వందేభారత్ రైలు అనుభూతిని కలిగించేందుకు రైల్వే శాఖ వేగంగా ఏర్పాట్లు చేస్తోంది. మరో మూడు నెలల్లో నాన్ ఏసీ రైళ్లు పట్టాలెక్కే అవకాశం ఉందని రైల్వే వర్గాలు చెపుతున్నాయి. 'వందే సాధారణ్'నాన్ ఏసీ రైలు కోచ్‌లను రైల్వే శాఖ వేగంగా సిద్ధం చేస్తోంది.

జనవరి నాటికి తొలి రైలు..

వందేభారత్ రైళ్లు విజయవంతం కావటంతో వాటిని మరింత అప్‌గ్రేడ్ చేసే పనులు ప్రారంభించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ రైళ్లు ఉదయం బయలుదేరి, మళ్లీ రాత్రి 12 వరకు తిరిగి వస్తున్నాయి. తాజాగా దూరప్రాంతాలకు కూడా తిరిగేలా స్లీపర్ వందేభారత్ రైళ్ల తయారీ ప్రారంభించిన రైల్వే, సమాంతరంగా నాన్ ఏసీ సాధారణ రైళ్లను కూడా తయారు చేస్తోంది. చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్)లో వచ్చే జనవరి నాటికి తొలి రైలు సిద్ధమవుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

మామూలు రైళ్లు తెరమరుగు..

శతాబ్ది రైళ్లను క్రమంగా తొలగించి వాటి స్థానంలో వందేభారత్ రైళ్లు నడుపుతారని సమాచారం. అలాగే కొత్తగా వచ్చే స్లీపర్ వందేభారత్ రైళ్లు రాజధాని రైళ్ల స్థానాన్ని ఆక్రమిస్తాయి. ఇక సాధారణ సంప్రదాయ రైళ్లను దశలవారీగా తొలగిస్తూ వాటి స్థానంలో వందే సాధారణ్ రైళ్లను తిప్పే అవకాశం ఉందని చెపుతున్నారు.

వ్యవసాయానికి రూ.4.50 లక్షల కోట్లు ఖర్చు చేశాం

- పదేళ్ల తెలంగాణ వ్యవసాయ ప్రగతి నివేదిక విడుదల చేసిన మంత్రి నిరంజన్‌రెడ్డి
- ధాన్యం ఉత్పత్తి 2022–23లో రికార్డు స్థాయిలో 3 కోట్ల టన్నులకు చేరిక



సాక్షి, హైదరాబాద్: ఈ పదేళ్లలో వ్యవసాయరంగానికి రూ.4.50 లక్షల కోట్లు ఖర్చు చేసినట్టు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి వెల్లడించారు. శుక్రవారం రాత్రి ఆయన 'పదేళ్ల తెలంగాణ వ్యవసాయ ప్రగతి'నివేదిక విడుదల చేశారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడారు. దేశానికి రోల్‌మోడల్‌గా తెలంగాణ వ్యవసాయ పథకాలున్నాయన్నారు. డాక్టర్ స్వామినాథన్ కన్న కలల వైపు తెలంగాణ పయనిస్తుందని చెప్పారు. ఐక్యరాజ్యసమితి సంస్థ ఎఫ్ఏఓ గుర్తించిన ప్రపంచ 20 ఉత్తమ పథకాలలో రైతుబంధు, రైతుబీమా నిలవడం తెలంగాణకు గర్వకారణమని తెలిపారు. పత్తిని ప్రోత్సహించడం వల్ల రాష్ట్రంలో జిన్నింగ్ మిల్లులు 400కు పెరిగాయన్నారు. వరి ఉత్పత్తి పెరగడంతో వేల సంఖ్యలో రైస్ మిల్లులు ఏర్పడ్డాయని చెప్పారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ ప ల్లా రాజేశ్వర్‌రెడ్డి, వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్ రావు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు కొండూరు రవీందర్ రావు, రజనీ సాయిచంద్, రామకృష్ణారెడ్డి, విజయసింహారెడ్డి, మార గంగారెడ్డి, కొండబాల కోటేశ్వర్‌రావు, రాజవర ప్రసాద్‌రావు, ఉద్యానశాఖ డైరెక్టర్ హన్మంతరావు, వీసీ నీరజా ప్రభాకర్, మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయి, ప్రభుత్వ ఉద్యాన సలహాదారు డాక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వ్యవసాయ నివేదికలో కొన్ని ముఖ్యాంశాలు

- 2014లో సాగువిస్తీర్ణం 1.31 కోట్ల ఎకరాలు కాగా, 2022–23 నాటికి 2.38 కోట్ల ఎకరాలకు పెరిగింది.
- 2014–15 నాటికి ధాన్యం ఉత్పత్తి 68 లక్షల టన్నులుండగా, 2022–23 నాటికి 3 కోట్ల టన్నులకు చేరుకుంది. రాష్ట్ర ఏర్పాటు నుంచి ఇప్పటివరకు రూ.1.33 లక్షల కోట్లతో 722.92 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించగా, రూ. 11,439.06 కోట్లతో ఇతర పంటల కొనుగోలు.
- రైతుబంధు పథకం ద్వారా ఎకరానికి ఏడాదికి రూ.10 వేల చొప్పున 11 విడతల్లో రూ. 72,815 కోట్ల ఖర్చు. రైతుబీమా పథకం ద్వారా ఇప్పటివరకు 1,11,320 మంది రైతు కుటుంబాలకు రూ. 5,566 కోట్ల బీమా పరిహారం చెల్లింపు.
- 2014 నుంచి రెండు విడతల్లో కలిపి ఇప్పటివరకు 58.29 లక్షల రైతులకు రూ. 29,144.61 కోట్ల రుణమాఫీ జరిగింది.

రాష్ట్ర న్యాయమూర్తుల సంఘం అధ్యక్షుడిగా ప్రభాకర్‌రావు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర న్యాయమూర్తుల సంఘం అధ్యక్షులుగా మంచిర్యాల జిల్లా ప్రధాన న్యాయమూర్తి కాశ్లారి ప్రభాకర్‌రావు, ఉపాధ్యక్షులుగా కరీంనగర్ జిల్లా మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.శ్రీవాణి ఎన్నికయ్యారు. మూడేళ్లుగా సంఘ ఉపాధ్యక్షులుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ప్రభాకర్‌రావు.. తాజాగా అధ్యక్షులుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పనిచేస్తున్న న్యాయమూర్తుల సంక్షేమం కోసం ఈ సంఘం కృషి చేస్తుందని అన్నారు. తాజాగా బాధ్యతలు చేపట్టిన ప్రభాకర్‌రావు, శ్రీవాణిలకు గత అధ్యక్షులు నందికొండ నర్సింగ్‌రావు, ప్రస్తుత న్యాయమూర్తుల సంఘ ప్రధాన కార్యదర్శి కె.మురళి మోహన్, ఉపాధ్యక్షులు జి.సుదర్శన్, సహాయ కార్యదర్శులు కె.దశరథరామయ్య, జాబిశెట్టి ఉపేందర్‌రావు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు సీనియర్ సివిల్ జడ్జి మండ వెంకటేశ్వరరావు, అబ్దుల్ జలీల్, ముదిగొండ రాజు, బి.సౌజన్య అభినందనలు తెలిపారు.

'రంగినేని' పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్ల కల్చరల్: రంగినేని ట్రస్టు అధ్యక్షుడు మోహన్‌రావు మాతృమూర్తి ఎల్లమ్మ పేరిట ఏటా ఇచ్చే స్మారక సాహిత్య పురస్కారం కోసం కవులు, రచయితలు తమ ఎంట్రీలను పంపించాలని పురస్కార కమిటీ సమన్వయకర్త మద్దికుంట లక్ష్మణ్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఏటా జాతీయ స్థాయిలో అందజేస్తున్న ఈ పురస్కారం కోసం 2021, 2022, 2023 సంవత్సరాల్లో ప్రచురించిన కవితా సంపుటాల ప్రతులను ఐదేసి చొప్పున నవంబర్ 15లోపు ట్రస్టు కార్యాలయానికి పంపించాలని పేర్కొన్నారు. ఎంపికైన కవికి రూ.25 వేల నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేస్తామని తెలిపారు. ఆసక్తి గల కవులు తమ ఎంట్రీలను రంగినేని ట్రస్టు, బాలాజీనగర్, సిరిసిల్ల 505301 చిరునామాకు పంపించాలని సూచించారు.

2 కోట్ల ఉద్యోగాల హామీ ఏమైంది?

ప్రధాని మోదీని ప్రశ్నించిన శ్రీనివాస్‌గౌడ్



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు. ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన హామీ ఏమైందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రశ్నించారు. మహబూబ్‌నగర్ జిల్లాకు జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల మంజూరు చేసినందుకు సీఎం కేసీఆర్, మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌లకు కృతజ్ఞతలు తెలుపుతూ బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ అందరూ బ్యాంక్ ఖాతాలు తెరిస్తే విదేశాల నుంచి నల్లధనం తెచ్చి జమ చేస్తామని ప్రజలను మోదీ మభ్యపెట్టారని విమర్శించారు. కులం, మతం పేరిట యువతను రెచ్చగొట్టేందుకు బీజేపీ నేతలు కుట్రలు చేస్తారని, పొరపాటున కూడా వారి మాయలో పడొద్దన్నారు. గూగుల్, ఆపిల్ లాంటి ప్రముఖ కంపెనీలను తెలంగాణకు తెచ్చి రాష్ట్ర యువతకు లక్షల సంఖ్యలో ఉద్యోగాలు కల్పిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం సీఎం కేసీఆర్ చిత్రపటానికి విద్యార్థులతో కలిసి మంత్రి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి మంత్రి నృత్యం చేశారు. కార్యక్రమంలో వాగ్దేవి కళాశాల కరస్పాండెంట్ విజేత వెంకట్‌రెడ్డి, సుదీప్, శివ, నాని, సత్యపాల్, నమీష్ తదితరులు పాల్గొన్నారు.

'చిట్‌ఫండ్స్'పై రెండో రోజూ ఐటీ దాడులు

సాక్షి, హైదరాబాద్: పన్ను చెల్లింపుల్లో అవకతవకలపై ఆదాయపన్ను శాఖ అధికారులు రెండోరోజు కూడా కొరడా ఝుళిపించారు. హైద రాబాద్‌లోని అమీర్‌పేట, శంషాబాద్, కూకట్‌పల్లి సహా పలు ప్రాంతాల్లో ఉన్న చిట్‌ఫండ్ కంపెనీల కార్యాలయాల్లో శుక్రవారం సోదాలు చేశారు. అమీర్‌పేటలోని పూజాకృష్ణ చిట్‌ఫండ్స్ డైరెక్టర్ సోంపల్లి నాగరాజేశ్వరి, పూజాలక్ష్మి చిట్‌ఫండ్స్ మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణప్రసాద్ ఇళ్లపై సైతం దాడులు చేశారు. శంషాబాద్‌లోని ఓ చిట్‌ఫండ్ కంపెనీ యజమాని రఘువీర్ ఇల్లు, కార్యాలయాలు, కూకట్‌పల్లిలోని హిందూ ఫార్మసీలోనూ సోదాలు నిర్వహించినట్టు సమాచారం. ఈ సందర్భంగా ఆయా చిట్‌ఫండ్స్, ఫైనాన్స్ సంస్థల్లోని కీలకపత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. ఐటీ అధికారులు వంద బృందాలుగా విడిపోయి గురువారం తెల్లవారుజాము నుంచి సోదాలు చేపట్టిన విషయం తెలిసిందే. ఓ చిట్‌ఫండ్ కంపెనీ యజమాని అరికెపూడి కోటేశ్వరరావు, రైల్వే కాంట్రాక్టర్ వరప్రసాద్ నివాసాలతోపాటు వ్యాపారులు ప్రసాద్, కోటేశ్వరరావు, మాగంటి వజ్రనాథ్ ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలు చేశారు. తనిఖీల అనంతరం సదరు కంపెనీలు, సంస్థల యజమానులకు ఐటీ అధికారులు నోటీసులు జారీ చేసినట్టు తెలిసింది.

మిత్రుడి కోసం కేటీఆర్ నన్ను బలి చేశారు

- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్
- బీఆర్ఎస్‌కు రాజీనామా



ఖానాపూర్: తెలంగాణ ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ తన మిత్రుడైన జాన్సన్ నాయక్ కోసం గిరిజన మహిళను అయిన నన్ను బలి చేశారని నిర్మల్ జిల్లా ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ ఆరోపించారు. శుక్రవారం ఖానాపూర్‌లోని తన నివాసంలో ఆమె మాట్లాడారు. బీఆర్ఎస్ ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన జాన్సన్ నాయక్ వందశాతం ఎస్టీ కాదని ఆరోపించారు. ఆయన బీసీ(సీ) అని, ఎమ్మెల్యే టికెట్ కోసం ఇటు హిందువులను అటు క్రిస్టియన్లను మోసం చేస్తున్నారని విమర్శించారు. తనకు టికెట్ కేటాయించకుండా అన్యాయం చేసినందుకు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ఆమె ప్రకటించారు. తాను రాజీ నామా చేసినప్పటికీ కచ్చితంగా బరిలో ఉంటానని, జాన్సన్‌నాయక్‌ను ఓడిస్తానని హెచ్చరించారు. ఏ పార్టీ నుంచి పోటీ చేసేది త్వరలో ప్రకటిస్తానని తెలిపారు.

అభివృద్ధిని అడ్డుకున్నారు..

మంత్రి కేటీఆర్ తన మిత్రుడి కోసం 9 ఏళ్లుగా ఖానాపూర్ అభివృద్ధిని అడ్డుకున్నారని రేఖా నాయక్ ఆరోపించారు. ఈ విషయాన్ని ఇటీవల నిర్వహించిన నిర్మల్ సభలో కేటీఆర్ స్వయంగా అంగీకరించారని తెలిపారు. ఖానాపూర్‌లో సదర్మాట్ బ్యారేజీ నుంచి ప్రత్యేక కాలువ నిర్మిస్తానని ఖానాపూర్ సభలో ప్రకటించడంతోపాటు ఇక్కడే కుర్చీ వేసుకుని కూర్చుని అభివృద్ధి పనులు చేస్తానని గత ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ హామీ ఇచ్చి విస్మరించారన్నారు. ఇప్పుడు ప్రత్యేక కాలువ నిర్మించమంటే అటవీ అనుమతులు లేవంటూ దాటవేస్తున్నారని పేర్కొన్నారు. తాను ఎలాంటి భూకబ్జాలు చేయలేదని, స్కాంలు చేయలేదని, తప్పు చేయకున్నా తనకు శిక్ష వేశారని ఆరోపించారు. కేటీఆర్ చేసిన అన్యాయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తానన్నారు.

గుట్టలెక్కి.. వాగులు దాటి



వైద్యం అందించడానికి పదహారు కిలోమీటర్లు నడిచారు. గుట్టలెక్కి దిగారు. మూడు వాగులు దాటారు. ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని పెనుగోలు గ్రామ పరిధి కొంగాల గ్రామం గుట్టలపై ఉంటుంది. ఆ గ్రామస్తులకు వైద్యం అందించాలంటే మార్గమధ్యలోని మూడు వాగులను దాటాలి. శుక్రవారం వాజేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర హెల్త్ అసిస్టెంట్ చిన్న వెంకటేశ్వర్లు, ల్యాబ్ టెక్నీషియన్ లఖాన్ పెనుగోలుకు చెందిన ముద్దయ్యతో కలిసి 16 కిలోమీటర్ల రాళ్ల దారిలో నడుచుకుంటూ వెళ్లారు. మార్గమధ్యలోని మూడు చోట్ల వాగును దాటి గ్రామానికి చేరుకుని దోమల మందు పిచికారీ చేశారు. అందరినీ పరీక్షించి మందులను ఇచ్చారు. గ్రామంలో ఇద్దరికి మామూలు జ్వరాలుండగా, వారి నుంచి రక్త నమూనాలను సేకరించారు. – వాజేడు

గన్‌మన్‌ను చెంపదెబ్బ కొట్టిన హోం మంత్రి

- హోంమంత్రిపై కేసు నమోదు చేయాలని ఎమ్మెల్యే రాజాసింగ్ డిమాండ్
- మహమూద్ అలీ తీరుపై అంతర్గతంగా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్న పోలీస్ సిబ్బంది



గన్‌మన్‌ను చెంపదెబ్బ కొడుతున్న మహమూద్ అలీ. చిత్రంలో తలసాని తదితరులు

సాక్షి, హైదరాబాద్: బొకే అందివ్వడంలో ఆలస్యమైనందుకు హోంమంత్రి మహమూద్ అలీ, తన గన్‌మన్‌ను చెంపదెబ్బ కొట్టిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. నెటిజన్లు హోం మంత్రి ప్రవర్తనపై తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. శుక్రవారం అమీర్‌పేట్ డివిజన్‌లో ముఖ్యమంత్రి అల్పాహార పథకం ప్రారంభ కార్యక్రమంలో మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్‌లు పాల్గొన్నారు. మంత్రి తలసానికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన సందర్భంగా పుష్పగుచ్ఛం ఇవ్వాలని హోంమంత్రి భావించారు. అయితే సమయానికి పుష్పగుచ్ఛం తన చేతికి అందించడంలో ఆలస్యం చేయడంపై తీవ్ర ఆగ్రహానికి లోనైన మహమూద్ అలీ తన గన్‌మన్ చెంప ఛెళ్లుమనిపించారు. ఈ ఘటన పోలీస్ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. తన రక్షణ విధుల్లో ఉన్న పోలీస్‌ను పబ్లిక్‌లో కొట్టడంపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కేసు నమోదు చేయాలి: రాజాసింగ్ డిమాండ్

మహమూద్ అలీ తన సెక్యూరిటీ సిబ్బందిని చెంపదెబ్బ కొట్టడం సిగ్గుచేటని, హోంమంత్రిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ వీడియో విడుదల చేశారు. 'బొకే ఇవ్వడంలో ఒక్క సెకన్ లేట్ అయిందని హోంమంత్రి తన గన్‌మన్‌ను చెంపదెబ్బ కొట్టారు. సామాన్యులు ఎవరైనా పోలీసులపై చెయ్యి వేస్తే జైలులో వేస్తారు.. మరి డ్యూటీలో ఉన్న పోలీస్ అధికారిని కొట్టిన హోంమంత్రిపై ఎఫ్ఐఆర్ నమోదు చేస్తారా లేదా? అని నేను సీఎం కేసీఆర్ ప్రశ్నిస్తున్నా. హోం మంత్రిపై డీజీపీ ఏం చర్య తీసుకుంటారో చూద్దాం' అని ఆ వీడియోలో పేర్కొన్నారు.

తెలంగాణ వచ్చాకే కొత్తగా 44 ఫైర్‌స్టేషన్లు

ఉప్పల్‌లో లాంఛనంగా ప్రారంభించిన మంత్రి మహమూద్ అలీ

ఉప్పల్ (హైదరాబాద్): రాష్ట్రం ఏర్పడిన తర్వాతే తక్కువ సమయంలోనే 44 అగ్నిమాపక కేంద్రాలను ఏర్పాటు చేశామని హోంమంత్రి మహ మూద్ అలీ అన్నారు. ఉప్పల్ భగాయత్‌లో ఎల్‌బీ నగర్ అగ్నిమాపక కేంద్రం, స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఫైర్ సర్వీస్ డిపార్ట్‌మెంట్ (ఎస్‌డీ ఆర్‌ఎఫ్)ను ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డితో కలిసి శుక్రవారం మంత్రి ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా మరో 17 ఫైర్ స్టేషన్లకు వర్చువల్ పద్ధతిన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మహమూద్ అలీ మాట్లాడుతూ మహానగరంలో ఎన్నో బహుళ అంతస్తుల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని, ప్రజల ఆస్తులు, ప్రాణాలు కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. విపత్తులు ఎదురైనప్పుడు తమప్రాణాలు లెక్క చేయకుండా అగ్నిమాపక సిబ్బంది తెగించి ముందుకెళ్తారని చెప్పారు. ఉప్పల్ ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ పోలీస్ శాఖను దేశంలో నంబర్‌వన్‌గా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌కు దక్కిందన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, అడిషనల్ డైరెక్టర్ సీవీ.నారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయానికి ప్రతిపక్షాలు రావొద్దని బోర్డు పెట్టుకోండి

కాంగ్రెస్ ఎమ్మెల్యే సీతక్క విమర్శ



సాక్షి, హైదరాబాద్: సచివాలయానికి ప్రతిపక్షాలు రావొద్దని బోర్డు పెట్టుకోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే సీతక్క హితవు పలికారు. సెక్రటేరియట్ బీఆర్ఎస్ వాళ్లకేనా అని నిలదీశారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆమె విలేకరులతో మాట్లాడుతూ, వివిధ శాఖలకు సంబంధించిన పనులపై సచివాల యానికి వస్తే అనుమతి లేదంటూ అక్కడి పోలీసు సిబ్బంది అడ్డుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు నియంతృత్వంగా వ్యవహరిస్తోందని ప్రశ్నించారు. ఇది అవమానమని, నేను రచ్చ చేయాలనుకుంటే చేయగలనని, కానీ, ప్రజా సమస్యలపై వచ్చానని వెల్లడించారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తే అసెంబ్లీలో మా గొంతు నొక్కుతున్నారని, కనీసం సచివాలయానికి వెళ్లి చెబుతామంటే అక్కడా అడ్డుకుంటున్నారని తెలిపారు. హోంమంత్రి మహమూద్ అలీ గన్‌మెన్‌పై చేయిచేసుకోవడం దారుణమన్నారు. ఆయన తక్షణమే గన్‌మెన్‌కు క్షమాపణ చెప్పాలని సీతక్క డిమాండ్ చేశారు.

ఓబీసీ మహిళా రిజర్వేషన్ల కోసం పోరాడుతాం

అంబేడ్కర్ దూరదృష్టి వల్లే రాష్ట్ర ఏర్పాటు: ఎమ్మెల్సీ కవిత



లండన్‌లోని అంబేడ్కర్ మ్యూజియంలో ఎమ్మెల్సీ కవిత

సాక్షి, హైదరాబాద్: మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఓబీసీ మహిళా రిజర్వేషన్ల కోసం తమ పోరాటం కొనసాగుతుందని ప్రకటించారు. లండన్ పర్యటనలో ఉన్న కవిత శుక్రవారం అంబేడ్కర్ మ్యూజియాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో లబ్ధి పొందాలనే ప్రయత్నంలో భాగంగానే కేంద్ర ప్రభుత్వం మహిళా బిల్లు తెరమీదకు తీసుకొచ్చిందని అనుమానం వ్యక్తం చేశారు. జనగణన, నియోజకవర్గాల పునర్విభజనతో మహిళా రిజర్వేషన్ల అమలును ముడిపెట్టడమే దీనికి నిదర్శనమన్నారు. మహిళా రిజర్వేషన్ల అమలు తేదీ లేని పోస్ట్‌డేటెడ్ చెక్కులా ఉండటంతో రిజర్వేషన్ల అమలు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకొని మహిళా రిజర్వేషన్ల కోసం తాను ఉద్యమించిన విషయాన్ని గుర్తు చేశారు. ఆయన దూరదృష్టితో రూపకల్పన చేసిన రాజ్యాంగం వల్లే తెలంగాణ ఏర్పాటు సాధ్యమైందన్నారు. మ్యూజియం సందర్శనకు వెళ్లిన కవితకు ఫెడరేషన్ ఆఫ్ అంబేడ్కర్ అండ్ బుద్ధిస్ట్ అసోసియేషన్ యూకే సంయుక్తకార్యదర్శి శామ్యుకుమార్ స్వాగతం పలికారు.

'రెరా'లో రిజిస్టర్ కావడం సామాజిక బాధ్యత

రియల్ ఎస్టేట్ ఏజెంట్లకు చైర్మన్ సత్యనారాయణ సూచన



సాక్షి, హైదరాబాద్: రియల్ ఎస్టేట్ ఏజెంట్లు విధిగా రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ(రెరా)లో రిజిస్టర్ కావాలని ఆ సంస్థ చైర్మన్ ఎన్.సత్యనారాయణ పిలుపునిచ్చారు. 'రెరా'లో రిజిస్టర్ చేయించుకోవడం సామాజిక బాధ్యతగా భావించాలన్నారు. శుక్రవారం హైదరాబాద్ రియల్టర్స్ అసోసియేషన్(హెచ్ఆర్ఏ), రెరా సంయుక్తంగా సీడీఎంఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 'రెరా' రిజిస్టర్డ్ ఏజెంట్ల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ రంగానికి సంబంధించిన సమాచారం ఏజెంట్ల ద్వారా ప్రతి గడపకూ చేరుతుందని, సరైన సమాచారాన్ని సొసైటీకి అందించి కొనుగోలుదారులు మోసాలకు గురికాకుండా చూడాలని సూచించారు. కొనుగోలుదారులకు స్థిరాస్తిపై రక్షణ ఉంటేనే నిర్మాణ రంగం అభివృద్ధి చెందుతుందన్నారు. త్రైమాసిక, వార్షిక నివేదికలు సమర్పించని ప్రాజెక్టులకు ఇటీవల షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. సభ్యులు కె.శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఏజెంట్లను బలోపేతం చేయడం ద్వారా రియల్ ఎస్టేట్ రంగంలో పారదర్శకత సాధించవచ్చన్నారు. కాగా, నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (నరెడ్కో) తెలంగాణ శాఖ నగరంలోని హైటెక్స్‌లో ఏర్పాటు చేసిన రియల్ ఎస్టేట్ ప్రాపర్టీ షోను శుక్రవారం ఆయన ఎమ్మెల్సీ భాను ప్రసాద్‌రావుతో కలిసి సందర్శించారు. రియల్ ఎస్టేట్ సంస్థలు, రెరా ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించి నిర్వాహకులను అభినందించారు.


'ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ నాటికి సొంత ఇల్లు కలిగి ఉండేటట్లు చూడటం ప్రభుత్వాల కనీస బాధ్యత'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 197

శనివారం 7-10-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




పాక్ శుభారంభం

నెదర్లాండ్స్‌తో జరిగిన ప్రపంచకప్ మ్యాచ్‌లో 81 పరుగులతో గెలుపు. - 12లో



ధరల కట్టడే ధ్యేయం..

6.5% రెపో కొనసాగింపునకు ఆర్‌బీఐ పాలసీ కమిటీ ఏకగ్రీవ ఓటు - 13లో



అవిశ్వాసం పిటిషన్ల కొట్టివేత

మున్సిపల్ కౌన్సిలర్లు ఇచ్చిన అవిశ్వాస తీర్మానాలను ఆపాలంటూ దాఖలైన 28 పిటిషన్లను హైకోర్టు కొట్టేసింది.

- వివరాలు 5లో



'కేనెస్' పెట్టుబడి 2,800 కోట్లు

రాష్ట్రంలో రూ. 2,800 కోట్లతో నూతన తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు కేనెస్ టెక్నాలజీ ముందుకొచ్చింది.

- వివరాలు 14లో

వచ్చేది హంగ్.. మనదే పవర్!

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ భేటీలో బీఎల్ సంతోష్.. ఏ పార్టీకీ 60 సీట్లు వచ్చే పరిస్థితి లేదు

- సోషల్ మీడియాలో ప్రచారాన్ని నమ్మొద్దు.. వాటి ఉచ్చులో పడొద్దు
- ఎప్పటినుంచో పని చేస్తున్నాం టికెట్ ఇవ్వాలి అంటే కుదరదు
- స్థానిక బలం ఆధారంగానే టికెట్.. అక్కడే నిర్ణయం
- వచ్చే 60 రోజులు టార్గెట్‌గా పెట్టుకొని గట్టిగా కృషి చేయాలి

సాక్షి, హైదరాబాద్: 'తెలంగాణలో హంగ్ తప్పదు.. అయినా అధికారం మనదే'అని బీజేపీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ అన్నారు. 'బీజేపీ నిర్వహించిన సర్వేలు, అధ్యయనాలను పరిశీలిస్తే ఏ పార్టీకి 60 సీట్లు వచ్చే పరిస్థితి లేదు. సోషల్ మీడియాలో జరిగే ప్రచారాన్ని విశ్వసించొద్దు. వాటి ఉచ్చులో పడొద్దు..'అని చెప్పారు. శుక్రవారం ఘట్‌కేసర్ సమీపంలోని ఓ కాలేజీలో జరిగిన బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎన్నికల దిశానిర్దేశం చేశారు.

మొత్తం 43 మంది అగ్రనేతల సభలు

'వచ్చే 60 రోజులు టార్గెట్‌గా పెట్టుకొని గట్టిగా కృషి చేయాలి. రాత్రి, పగలు కష్టపడాలి. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మొత్తం 43 మంది అగ్ర నేతలు, ముఖ్య నాయకుల సభలు నిర్వహిస్తాం. ఎప్పటినుంచో పని చేస్తున్నాం.. టికెట్ ఇవ్వాలి అంటే కుదరదు. 119 స్థానాల కోసం 2 వేల మంది అడుగుతున్నారు. స్థానిక బలం ఆధారంగానే టికెట్ ఇస్తాం. టికెట్‌లు ఢిల్లీలోనో, హైదరాబాద్‌లోనో డిసైడ్ కావు. నియోజకవర్గాల్లో చేసే పని ఆధారంగా స్థానికంగానే నిర్ణయిస్తాం. ముఖ్యమంత్రి ఎవరు అనేది జాతీయ నాయకత్వం చూసుకుంటుంది. ఎవరూ నేను ముఖ్యమంత్రి అని ప్రచారం చేసుకోవద్దు. అధికారంలోకి వస్తే అందరికీ పదవులు వస్తాయి..'అని సంతోష్ చెప్పినట్టు తెలిసింది.

మనం ఓడిపోలేదు.. బలపడ్డాం

'మనం సరిగ్గా పనిచేయాలి. మనలో మనం గొడవలు పడొద్దు. ఎవరూ లూజ్ టాక్ చేయవద్దు. అందరూ కలిసి పని చేయండి. మునుగోడులో ఓడిపోయాం అని మీరు మిగతా 5వ పేజీలో ▶



శుక్రవారం బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశానికి హాజరైన జేపీ నడ్డా. చిత్రంలో తరుణ్ ఛుగ్, సునీల్ బన్సల్, బీఎల్ సంతోష్, కె. లక్ష్మణ్, బండి సంజయ్, కిషన్‌రెడ్డి, డీకే అరుణ, ప్రకాశ్ జవదేకర్, ఈటల, మురళీధర్‌రావు, జితేందర్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి తదితరులు (కుడి నుంచి)

కేసీఆర్‌కు ఛాతీలో ఇన్ఫెక్షన్

- వైరల్ జ్వరం తర్వాత సెకండరీ ఇన్ఫెక్షన్ సోకింది
- అందుకే కోలుకునేందుకు ఎక్కువ సమయం పడుతోంది
- ముఖ్యమంత్రి అనారోగ్యంపై మంత్రి కేటీఆర్ వెల్లడి - 5లో

15 నుంచి కాంగ్రెస్ బస్సుయాత్ర!

- త్వరలోనే షెడ్యూల్, రూట్ మ్యాప్ ఖరారు
- పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో తుది నిర్ణయం తీసుకునే చాన్స్
- ప్రారంభించనున్న ప్రియాంక.. హాజరుకానున్న రాహుల్, ఖర్గే
- మంచి రోజులు లేక అభ్యర్థుల జాబితా ఆలస్యం
- ఈ నెల 14న అమావాస్య తర్వాత విడుదల చేసే అవకాశం ఉందన్న పార్టీ నేతలు - 5లో

ఆ 811 టీఎంసీలు ఏపీ, తెలంగాణ మధ్య పంపిణీ

- కృష్ణా ట్రిబ్యునల్–1 ఉమ్మడి ఏపీకి కేటాయించిన నీరే ఇరు రాష్ట్రాలకు... అదనంగా 'పోలవరం తరలింపు' ఖాతాలోని 45 టీఎంసీల పంపకం
- గెజిట్ నోటిఫికేషన్‌తో కృష్ణా ట్రిబ్యునల్–2కు అదనపు విధివిధానాలు జారీ చేసిన కేంద్రం
- 'ప్రాజెక్టుల వారీగా'అనే పదానికి విస్తృత నిర్వచనం
- ఇరు రాష్ట్రాల్లో నిర్మాణం పూర్తయిన, నిర్మాణంలోని, ప్రతిపాదన దశలోని ప్రాజెక్టులకూ కేటాయింపులు

2 లో

తెలంగాణకు 35, ఏపీకి 45 టీఎంసీలు

- 2024 మే చివరి వరకు అవసరాలకు కృష్ణా జలాల కేటాయింపులు
- కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశంలో నిర్ణయం - 2లో

ఆ 811 టీఎంసీలు.. ఏపీ, తెలంగాణ మధ్య పంపిణీ

- కృష్ణా ట్రిబ్యునల్–1 ఉమ్మడి ఏపీకి కేటాయించిన నీరే ఇరు రాష్ట్రాలకు..
- అదనంగా 'పోలవరం తరలింపు' ఖాతాలోని 45 టీఎంసీల పంపకం
- గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసిన కేంద్ర జలశక్తి శాఖ
- 'ప్రాజెక్టుల వారీగా'అనే పదానికి విస్తృత అర్థాన్ని ఇచ్చిన కేంద్రం
- ఇరు రాష్ట్రాల్లో నిర్మాణం పూర్తయిన, నిర్మాణంలోని, ప్రతిపాదన దశలోని ప్రాజెక్టులకూ కేటాయింపులు
- ఈ మేరకు కృష్ణా ట్రిబ్యునల్–2కు అదనపు విధివిధానాలు జారీ

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కృష్ణా ట్రిబ్యునల్–1 (బచావత్ ట్రిబ్యునల్) గంపగుత్తగా కేటాయించిన 811 టీఎంసీలను.. తిరిగి ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య పంచేందుకు కేంద్రం రంగం సిద్ధం చేసింది. తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు అంతర్రాష్ట్ర నదీ వివాదాల చట్టం (ఐఎస్‌ఆర్‌డీఏ)–1956లోని సెక్షన్ 3, సెక్షన్ 5(1), 12ల కింద జస్టిస్ బ్రిజేశ్‌కుమార్ నేతృత్వంలోని కృష్ణా ట్రిబ్యునల్–2కు మరిన్ని విధి విధానాలను జారీ చేస్తూ శుక్రవారం కేంద్ర జలశక్తి శాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. పోలవరం ప్రాజెక్టు ద్వారా 80 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు తరలిస్తే, దానికి ప్రతిగా నాగార్జునసాగర్ ఎగువన ఉన్న రాష్ట్రాలు 80 టీఎంసీల కృష్ణా జలాలను వాడుకోవడానికి గతంలో బచావత్ ట్రిబ్యునల్ వెసులుబాటు కల్పించింది. ప్రస్తుతం ఈ నీటిని సైతం రెండు రాష్ట్రాల మధ్య పంపిణీ చేయాలని కేంద్రం తాజా విధివిధానాల్లో స్పష్టం చేసింది. ఈ క్రమంలో 80 టీఎంసీల్లో ఏ రాష్ట్రం వాడుకోని 45 టీఎంసీలను కృష్ణా ట్రిబ్యునల్–2 కొత్తగా రెండు రాష్ట్రాలకు పంపిణీ చేయనుంది. దీంతో మొత్తంగా 856 టీఎంసీల కృష్ణా జలాలు ఉభయ రాష్ట్రాల మధ్య పంపిణీ కానున్నాయి. రెండు రాష్ట్రాలకు నీటి పంపకాలపై తుది నివేదిక సమర్పించడానికి గతంలో కృష్ణా ట్రిబ్యునల్–2కు ఉన్న గడువును 2024 మార్చి 31 వరకు కేంద్రం పొడిగించింది. ఇప్పుడు అదనపు విధివిధానాలను ప్రకటించినా.. గడువు పొడిగింపు ఏదీ వెల్లడించలేదు. దీనితో వచ్చే ఏడాది మార్చి 31లోగా ట్రిబ్యునల్ తుది నివేదిక ఇవ్వాల్సి ఉండనుంది.

ఇక ప్రాజెక్టులన్నింటికీ కేటాయింపులు

తెలంగాణ రాష్ట్ర విజ్ఞప్తి మేరకు.. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో నిర్మాణం పూర్తైన ప్రాజెక్టులతోపాటు నిర్మాణంలో ఉన్న, ప్రతిపాదన దశలోని ప్రాజెక్టులకు సైతం ప్రాజెక్టుల వారీగా కృష్ణా జలాలను పంపిణీ చేయాలని తాజాగా కృష్ణా ట్రిబ్యునల్–2కు కేంద్రం ఆదేశించింది. రాష్ట్ర పునర్విభజన చట్టంలోని సెక్షన్ 89లోని క్లాజులు 89(ఏ), 89(బీ)లోని 'ప్రాజెక్టుల వారీగా' అనే పదానికి ఈ మేరకు విస్తృత అర్థాన్నిస్తూ తాజా గెజిట్ నోటిఫికేషన్‌లో నిబంధన చేర్చింది. దీంతో తెలంగాణలో నిర్మిస్తున్న పాలమూరు–రంగారెడ్డి, డిండి, ఎస్‌ఎల్‌బీసీ వంటి ప్రాజెక్టులకు సైతం ట్రిబ్యునల్ నీటి కేటాయింపులు జరిపే అవకాశం ఉంది.

తెలంగాణకు 35, ఏపీకి 45 టీఎంసీలు

- 2024 మే చివరి వరకు అవసరాలకు కృష్ణా జలాల కేటాయింపులు
- కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశంలో నిర్ణయం
- 66:34 నిష్పత్తిలోనే కేటాయింపులు జరిపిన త్రిసభ్య కమిటీ
- సుదీర్ఘ చర్చ అనంతరం అంగీకారం తెలిపిన ఉభయ రాష్ట్రాలు
- శ్రీశైలం, సాగర్ కనీస మట్టాలకు దిగువ నుంచి నీళ్లను తీసుకెళ్లాలని నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి జలాశయాలైన శ్రీశైలం, నాగార్జునసాగర్‌ల నుంచి తెలంగాణకు 35 టీఎంసీలు, ఏపీకి 45 టీఎంసీల నీటిని కేటాయిస్తూ.. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ) ఆధ్వర్యంలోని త్రిసభ్య కమిటీ నిర్ణయించింది. ప్రస్తుత నీటి సంవత్సరం ముగిసే వరకు.. అంటే వచ్చే ఏడాది మే వరకు అవసరాల నిమిత్తం ఇరు రాష్ట్రాలకు నీటి విడుదలపై తీర్మానించింది. కృష్ణా బోర్డు సభ్య కార్యదర్శి డీఎం రాయిపురే కన్వీనర్‌గా, తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ సి.మురళీధర్, ఏపీ జలవనరుల శాఖ ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి సభ్యులుగా ఏర్పాటైన త్రిసభ్య కమిటీ.. శుక్రవారం హైదరాబాద్‌లోని జలసౌధలో సమావేశమై ఈ నిర్ణయాలు తీసుకుంది. ఉదయం 11.30 నుంచి రాత్రి 7.40 గంటల వరకు సుదీర్ఘంగా చర్చించిన అనంతరం.. ఇరు రాష్ట్రాల ఈఎన్‌సీలు కేటాయింపులపై తమ సమ్మతి తెలుపుతూ సంతకాలు చేశారు.

ఏపీకి 66 శాతం.. తెలంగాణకు 34 శాతం..

2023–24 వాటర్ ఇయర్‌కు సంబంధించి ఏపీ, తెలంగాణ మధ్య ఏ దామాషా ప్రకారం కృష్ణా జలాలను పంపిణీ చేయాలన్న అంశంపై గతంలో కృష్ణా బోర్డు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఇరు రాష్ట్రాల అవసరాలను పరిగణనలోకి తీసుకుని కేటాయింపులు జరిపే బాధ్యతను త్రిసభ్య కమిటీకి అప్పగించింది. తాత్కాలిక సర్దుబాటు ప్రకారం ఏపీకి 66 శాతం, తెలంగాణకు 34 శాతం నిష్పత్తిలో పంపకాలు జరపాలని ఏపీ కోరుతుండగా.. 50:50 నిష్పత్తిలో జరపాలని తెలంగాణ డిమాండ్ చేస్తూ వస్తోంది. అయితే ఇప్పటివరకు కొనసాగుతున్నట్టుగానే ప్రస్తుతం కూడా 66:34 నిష్పత్తిలోనే త్రిసభ్య నీటి కేటాయింపులు చేసింది.

ఉన్న 80 టీఎంసీల్లోనే..

శ్రీశైలం, నాగార్జునసాగర్‌లలో ప్రస్తుతం 82.788 టీఎంసీలు మాత్రమే లభ్యత నిల్వగా ఉన్నాయి. ఇందులో 2024 మే నాటికి 80 టీఎంసీలను వినియోగించుకోవాలని, మిగతా 2.788 టీఎంసీలను తాగునీటి అవసరాల కోసం సంరక్షించాలని రెండు రాష్ట్రాలు త్రిసభ్య కమిటీ భేటీలో నిర్ణయానికి వచ్చాయి. రెండు జలాశయాల నుంచి కలిపి 50 టీఎంసీలు ఇవ్వాలని తెలంగాణ కోరగా.. శ్రీశైలం నుంచి 30 టీఎంసీలు, నాగార్జునసాగర్ నుంచి 15 టీఎంసీలు కలిపి 45టీఎంసీలు కేటాయించాలని ఏపీ కోరింది. తాగునీటి అవసరాల కోసం ఎన్ని నీళ్లనైనా తీసుకెళ్లవచ్చని.. సాగునీటి అవసరాల కోసం మాత్రం ఏపీ, తెలంగాణ మధ్య తాత్కాలిక కోటా అయిన 66:34 నిష్పత్తిలో కేటాయింపులు జరపాలని పట్టుబట్టింది. ఈ నిష్పత్తిలోనే తెలంగాణకు 35 టీఎంసీలను కేటాయించేందుకు సమావేశంలో అంగీకారం కుదిరింది. సాగర్ నుంచి 30.7 టీఎంసీలు, శ్రీశైలం నుంచి 4.3 టీఎంసీలు కలిపి మొత్తం 35 టీఎంసీలు తీసుకునేందుకు తెలంగాణ సమ్మతి తెలిపింది. ఏపీ కోరిక మేరకు 45 టీఎంసీలను రాబట్టుకుంది. ఏపీకి నాగార్జునసాగర్ నుంచి 15 టీఎంసీలు, శ్రీశైలం నుంచి 30 టీఎంసీలను కేటాయించేందుకు అంగీకారం కుదిరింది.

కనీస మట్టాలకన్నా దిగువన నీళ్లే..

ప్రస్తుత ఏడాది తీవ్ర వర్షాభావంతో శ్రీశైలం, నాగార్జున సాగర్‌లలో నిల్వలు అడుగంటిపోయి ఉన్నాయి. అయినా ఇరు రాష్ట్రాల నీటి అవసరాల కోసం కనీస నీటిమట్టాలకు దిగువ నుంచి కూడా నీటిని తీసుకెళ్లాలని త్రిసభ్య కమిటీ నిర్ణయించింది. శ్రీశైలంలో 805 అడుగుల వరకు.. సాగర్ కనీస మట్టం 510 అడుగులుకాగా.. 505 అడుగుల వరకు నీళ్లను తీసుకోవాలని నిర్ణయం తీసుకుంది.

ఏపీ 95 టీఎంసీలు, తెలంగాణ 48 టీఎంసీలు వినియోగం

ప్రస్తుత నీటి సంవత్సరంలో జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టుల నుంచి మొత్తం 144.267 టీఎంసీలను తెలుగు రాష్ట్రాలు వాడుకున్నట్టు త్రిసభ్య కమిటీ సమావేశంలో నిర్ధారించారు. నాగార్జునసాగర్ నుంచి 4.21 టీఎంసీలు, శ్రీశైలం నుంచి 25.865 టీఎంసీలు, ఇతర ప్రాజెక్టుల నుంచి 65.649 టీఎంసీలు కలిపి మొత్తం 95.724 టీఎంసీలను ఏపీ వినియోగించుకుంది. ఇక తెలంగాణ నాగార్జునసాగర్ నుంచి 11.88 టీఎంసీలు, శ్రీశైలం నుంచి 12.626 టీఎంసీలు, ఇతర ప్రాజెక్టుల నుంచి 24.037 టీఎంసీలు కలిపి మొత్తం 48.543 టీఎంసీలను వాడుకుంది.

ఏమిటీ వాటర్ ఇయర్?

ఏటా నైరుతి రుతుపవనాల సీజన్ ప్రారంభమయ్యే జూన్ 1 నుంచి తర్వాతి ఏడాది మే 31 వరకు నీటి సంవత్సరం (వాటర్ ఇయర్)గా పరిగణిస్తారు. మన దేశంలో పంటల సీజన్లు (ఖరీఫ్, యాసంగి) కూడా దీనికి అనుగుణంగానే ఉంటాయి. జలాశయాల్లో నీటి నిల్వలు, పంపిణీ, విడుదల వంటి వాటిని వాటర్ ఇయర్ ఆధారంగానే లెక్కిస్తుంటారు. ఈ క్రమంలో తాజా వాటర్ ఇయర్‌కు సంబంధించి కృష్ణా నదిలో జలాల కేటాయింపులను త్రిసభ్య కమిటీ తేల్చింది.

పోలవరం తాజా అంచనాలు ఆమోదించాలి

- కేంద్ర హోంశాఖ మంత్రికి ఏపీ సీఎం వైఎస్ జగన్ విజ్ఞప్తి



ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్

సాక్షి, న్యూఢిల్లీ: పోలవరం ప్రాజెక్టు పూర్తి నిర్మాణ వ్యయంపై తాజా అంచనాలకు త్వరితగతిన ఆమోదం తెలిపేలా చర్యలు తీసుకోవాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను కోరారు. శుక్రవారం రాత్రి సీఎం వైఎస్ జగన్ సుమారు గంటకుపైగా అమిత్ షా నివాసంలో ఆయనతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పోలవరం ప్రాజెక్టుకు నిధులు, కృష్ణా జలాల వివాదంపై ఆయనతో చర్చించారు. 2017–18 ధరల సూచీ ప్రకారం పోలవరం ప్రాజెక్టు వ్యయం రూ.55,548.87 కోట్లుగా ఇప్పటికే టెక్నికల్ అడ్వైజరీ కమిటీ ఆమోదం తెలిపిందని గుర్తు చేశారు. పోలవరం తొలి దశను పూర్తి చేయడానికి ఇంకా రూ.17,144.06 కోట్లు అవసరమవుతాయని, ఆ మేరకు నిధులు విడుదల చేసేలా చూడాలని కోరారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం తన సొంత నిధుల నుంచి ఖర్చు చేసిన రూ.1,355 కోట్లను రీయింబర్స్ చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ (కేడబ్ల్యూడీటీ)–2కు మరిన్ని విధి విధానాల జారీకి బుధవారం కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలపడంపై ముందుకెళ్లొద్దని అమిత్ షాకు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ ఆమోదం ఏపీ ప్రజల హక్కులకు విఘాతం కలిగించే అవకాశం ఉందని తెలిపారు.

కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కులను పరిరక్షించండి

ప్రధాని మోదీకి ఏపీ సీఎం వైఎస్ జగన్ లేఖ

సాక్షి, అమరావతి: కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కులకు విఘాతం కలిగించకుండా పరిరక్షించాలని ప్రధాని నరేంద్ర మోదీకి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. అంతర్రాష్ట్ర నదీ జల వివాదాల (ఐఎస్‌ఆర్‌డబ్ల్యూ డీ- ఇంటర్ స్టేట్ రివర్ వాటర్ షేరింగ్ డిస్‌ప్యూట్స్) చట్టం–1956లో సెక్షన్–1 ప్రకారం కొనసాగుతున్న కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ (కేడబ్ల్యూడీటీ)–2కు మరిన్ని విధి విధానాల జారీకి బుధవారం కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలపడం ఆంధ్రప్రదేశ్ ప్రజలను ఆశ్చర్యానికి గురి చేసిందని ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణ ప్రభుత్వం 2014 జూలై 14న చేసిన ఫిర్యాదు ప్రకారం ఈ విధి విధానాలను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకే పరిమితం చేశారని గుర్తు చేశారు. ఆ విధి విధానాల నుంచి కృష్ణా నదీ పరివాహక ప్రాంతం(బేసిన్)లోని మిగతా రెండు రాష్ట్రాలను (మహారాష్ట్ర, కర్ణాటక) పూర్తిగా మినహాయించి.. రెండు రాష్ట్రాలకే (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ) పరిమితం చేయాలని ఏకపక్షంగా సూచించడం అశాస్త్రీయం అని చెప్పారు. దీంతోపాటు జాతీయ సంపద అయిన జలవనరులను న్యాయ బద్ధంగా వినియోగించుకోవడానికి కూడా విరుద్ధమని స్పష్టం చేశారు. కేంద్ర కేబినెట్ తీసుకున్న ఈ నిర్ణయం వల్ల కృష్ణా జలాలపై ఆధార పడిన ఆంధ్రప్రదేశ్ ప్రజల ప్రయోజనాలకు విఘాతం కలిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయ పరమైన చిక్కులను పరిశీలించి, ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని తదుపరి చర్యలు తీసుకోకుండా కేంద్ర జల్‌శక్తి శాఖను ఆదేశించాలని ప్రధానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ప్రధానికి లేఖ రాశారు.

స్కిల్ కార్పొరేషన్‌కు, టీడీపీకి ఒకరే ఆడిటర్

- ప్రజాధనం కొల్లగొట్టేందుకే ఈ ఎత్తుగడ
- కీలక ఆధారాలు సేకరించిన సీఐడీ
- వాటిపై విచారించేందుకు చంద్రబాబును మరోసారి కస్టడీకి ఇవ్వాలి
- సాక్షులను బాబు బెదిరిస్తున్నారు.. బెయిల్ పిటిషన్ తిరస్కరించండి
- న్యాయస్థానాన్ని కోరిన ఏఏజీ సుధాకర్ రెడ్డి
- న్యాయస్థానంపై బాబు న్యాయవాది దూబే తప్పుడు ఆరోపణ
- సీడీ ఫైల్ లేకుండా విచారణ జరుపుతున్నారని వ్యాఖ్య
- టేబుల్‌పై ఉన్న సీడీ ఫైల్‌ను చూపిస్తూ ఇదేమిటని ప్రశ్నించిన న్యాయమూర్తి
- వ్యాఖ్యలను వెనక్కు తీసుకున్న బాబు న్యాయవాది
- చంద్రబాబు కస్టడీ, బెయిల్ పిటిషన్లపై ఏసీబీ కోర్టులో ముగిసిన వాదనలు
- తీర్పు రిజర్వ్ చేసిన న్యాయస్థానం.. సోమవారానికి వాయిదా

సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వం హయాంలో తెలుగుదేశం పార్టీ ఆడిటర్‌నే స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు కూడా ఆడిటర్‌గా నియమించడం వెనుక ప్రజాధనం కొల్లగొట్టాలన్న ఎత్తుగడ ఉందని న్యాయస్థానానికి సీఐడీ తెలిపింది. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిధుల అక్రమ మళ్లింపులో దర్యాప్తు అధికారులు తాజాగా గుర్తించిన ఆధారాలపై ప్రశ్నించాల్సిన అవసరం ఉందని, అందువల్ల ఈ కేసులో నిందితుడు, టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబును సీఐడీ కస్టడీకి అనుమతించాలని సీఐడీ తరఫున రాష్ట్ర అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్ రెడ్డి న్యాయస్థానానికి నివేదించారు. స్కిల్ స్కామ్ కేసులో చంద్రబాబు కస్టడీ, బెయిల్ పిటిషన్లను విజయవాడ ఏసీబీ న్యాయస్థానం వరుసగా మూడో రోజు శుక్రవారం విచారించింది. సీఐడీ తరఫున ఏఏజీ సుధాకర్ రెడ్డి వాదనలు వినిపిస్తూ.. నిధుల అక్రమ మళ్లింపునకే టీడీపీకి, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు రెండింటికీ వెంకటేశ్వరరావును ఆడిటర్‌గా నియమించారన్నారు. గుట్టు చప్పుడు కాకుండా వ్యవహారం నడిపించారని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా డిజైన్‌టెక్ కంపెనీకి విడుదల చేసిన రూ.371 కోట్లలో రూ.27 కోట్లు టీడీపీ ఖాతాలోకి చేరినట్టు సీఐడీ అధికారులు గుర్తించారన్నారు. దీనిపై ఈ నెల 10న విచారణకు రావాలని ఆడిటర్ వెంకటేశ్వరరావుకు సీఐడీ నోటీసులు జారీ చేసిందన్నారు. టీడీపీ ఖాతాల్లో చేరిన రూ.27 కోట్లతోపాటు అక్రమంగా తరలించిన మిగిలిన నిధులపై రాబట్టిన కీలక ఆధారాలపై చంద్రబాబును సీఐడీ ప్రశ్నించాల్సిన అవసరం ఉందని చెప్పారు. టీడీపీ ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన ఐటీ రిటర్న్‌ను మాత్రమే సీఐడీ డౌన్‌లోడ్ చేసిందని, బ్యాంకుల నుంచి రికార్డులు తీసుకోలేదన్నారు. బ్యాంకర్ల నుంచి రికార్డులు తీసుకున్నారని చంద్రబాబు న్యాయవాదుల వాదనలో వాస్తవం లేదన్నారు. గతంలో రెండు రోజుల కస్టడీలో చంద్రబాబు ఉద్దేశపూర్వకంగానే కాలయాపన, సహాయ నిరాకరణ చేసి విలువైన సమయాన్ని వృథా చేశారని తెలిపారు. కాబట్టి చంద్రబాబును కనీసం మూడు రోజులు సీఐడీ కస్టడీకి అనుమతించాలని కోరారు. దర్యాప్తు కీలక దశలో ఉన్నందున చంద్రబాబు బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించాలని న్యాయస్థానాన్ని ఏఏజీ కోరారు. సీఎం హోదాలో ఉంటూ కుట్రపూరితంగా వ్యవహరించి షెల్ కంపెనీల ద్వారా ప్రజాధనాన్ని కొల్లగొట్టిన చంద్రబాబుకు సెక్షన్ 409 వర్తిస్తుందన్నారు. సీఐడీ నోటీసులు జారీ చేసిన కీలక సాక్షులు చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్, షాపూర్జీ–పల్లోంజీ కంపెనీ ప్రతినిధి మనోజ్ పార్థసాని విదేశాలకు పరారైన విషయాన్ని ఆయన మరోసారి ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ తరుణంలో చంద్రబాబుకు బెయిల్ మంజూరు చేస్తే ఇతర కీలక సాక్షులను బెదిరించి కేసు దర్యాప్తును ప్రభావితం చేసే ప్రమాదం ఉందన్నారు. చంద్రబాబు తరఫున ఢిల్లీ నుంచి వచ్చిన సీనియర్ న్యాయవాది ప్రమోద్ కుమార్ దూబే వాదనలు వినిపిస్తూ.. ఆదాయ పన్ను శాఖ, ఎన్నికల సంఘానికి టీడీపీ సమర్పించిన రిటర్న్‌లు, రికార్డులను తప్పుగా అన్వయిస్తున్నారన్నారు. ఈ కేసులో ఇప్పటికే 13 మంది నిందితులకు బెయిల్‌పై బయట ఉన్నందున చంద్రబాబుకు కూడా బెయిల్ మంజూరు చేయాలన్నారు. వాదనల సందర్భంగా న్యాయస్థానంపై చంద్రబాబు తరఫు న్యాయవాది దూబే చేసిన వ్యాఖ్యలను న్యాయమూర్తి తప్పుబట్టారు. సీడీ ఫైల్ లేకుండా విచారిస్తున్నారని దూబే వాదించారు. దీనిపై న్యాయమూర్తి స్పందిస్తూ తన టేబుల్‌పై ఉన్న సీడీ ఫైల్‌ను చూపిస్తూ ఇదేమిటి అన్ని ప్రశ్నించారు. న్యాయస్థానంపై తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. దాంతో కంగుతిన్న దూబే తన మాటలను ఉపసంహరించుకుంటున్నట్లు చెప్పారు. చంద్రబాబు కస్టడీ, బెయిల్ పిటిషన్లపై ఇరువర్గాల వాదనలు విన్న తరువాత న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేస్తూ ఈ కేసును సోమవారానికి వాయిదా వేసింది.


Urban Ladder
India's biggest
furniture sale!
FULL HOUSE SALE
UP TO 70% OFF + EXTRA 10% OFF*
THEODORE BOOKSHELF - IN RUSTIC WALNUT
ONLY AT ₹23,499 ₹15,039
LEBOWSKI RECLINER - IN COBALT BLUE
ONLY AT ₹48,499 ₹16,489
TRUMAN STUDY TABLE - IN TEAK FINISH
ONLY AT ₹25,299 ₹15,432
FLORENCE ACCENT CHAIR - IN CALICO FLORAL
ONLY AT ₹14,999 ₹9,899
DINER 4 SEATER DINING TABLE SET - IN GOLDEN OAK
ONLY AT ₹46,097 ₹25,552
BENNIS 25 PAIR SHOE RACK - IN DARK WALNUT
ONLY AT ₹17,799 ₹10,501
BEIRUT QUEEN BED - IN TEAK FINISH
ONLY AT ₹30,299 ₹16,361
ICICI Bank
10% INSTANT DISCOUNT* ON CREDIT & DEBIT CARDS
UP TO 12.5% OFF* ADDITIONAL DISCOUNT
On purchases at your nearest store!
FIND US HERE
Hitech City Road, Kondapur - 7306070916 | Above Super Select Car Showroom, Road No. 12, Banjara Hills - 9100756843 |
Beside KFC, Ambedkar Nagar, Miyapur - 9581861516 | 1st Floor, above Zudio Sreshta Magnus, Reddy Colony, L. B. Nagar - 9392337141 |
Inside Smart Bazaar, Saadath Plaza, Tarnaka - 9491453092


నవరాత్రి
ప్రీ-బుకింగ్ ఆఫర్
నవరాత్రుల సమయంలో ఖచ్చితమైన డెలివరీ కోసం ఇప్పుడే బుక్ చేసుకోండి*
Hero
GIFT
Grand Indian Festival of Trust
బుకింగ్ ప్రారంభం@ ₹501*
అదనపు క్యాష్ డిస్కౌంట్ ₹1000*
అతి తక్కువ వడ్డీ రేటు@ 6.99%^
ఇప్పుడు కొనండి 2024లో చెల్లించండి^
డెలివరీపై ఆకర్షణీయమైన క్యాష్ డిస్కౌంట్ మరియు ఎక్స్ఛేంజ్ బోనస్ పొందండి~
Pleasure+ XTEC
THE ICONIC Passion
GLAMOUR
Hero 112** MILLION
MADE OF TRUST
WORLD'S NO.1 22 YEARS IN A ROW*
INDIA'S FIRST 5 YEAR WARRANTY* *Conditions apply
ఆధార్ ఆధారంగా^ లోన్ & క్యాష్ EMI
హైపోథికేషన్ లేకుండా^
Hero MotoCorp Ltd. Regd. Office: The Grand Plaza, Plot No.2, Nelson Mandela Road, Vasant Kunj Phase - II, New Delhi - 110070, India. | CIN: L35911DL1984PLC017354 | For further information, contact your nearest Hero MotoCorp authorised outlet or CALL TOLL-FREE or visit us on www.HeroMotoCorp.com. Accessories and features shown may not be a part of standard fitment. Always wear a helmet while riding a two-wheeler. **As per the cumulative dispatch number till March 2023. *Highest sales for any 2 Wheeler Corporate Entity in the world for Calendar Year 2022 - Data source: DNA Consult & Advisory's report Assessment of Global Two Wheelers Market (CY22)*. ^^Based on offers from empanelled dealers on Wheels of Trust platform. ^Finance offer is at the sole discretion of the Financier, subject to its respective T&Cs. Available at select dealerships. *Offer is valid only on paid bookings with a minimum amount of ₹501 T&C apply. Offer amount may vary for model/variant and states and it is applicable on select models only. ~Offers will be communicated at the time of invoicing and may vary for model/variant and states, valid on invoicing between 15th Oct'23 to 24th Oct'23 or till stock last, For more details, please visit your nearest authorised Hero outlet.
Exchange Powered By
Wheels of Trust^^
అత్యుత్తమ రీసేల్ విలువ కోసం స్కాన్ చేయండి
AUTHORISED DEALERS – Hyderabad: Mody Hero, R.P. Road: Ph: 9289922146. Phoenix Hero, Habsiguda: Ph: 9289922515. Ramanthapur: Ph: 9246394475. Nagole: Ph: 9246394476. Kushaiguda: Ph: 9246824193. Bhanu Hero, Erragadda: Ph: 9289922148. Kukatpally: Ph: 9392525885 Miyanpur: 8790667999 Venkateshwara Hero, Narayanguda: Ph: 9289922145, 7799884320, Pragnapur 8886642271. Sri Lakshmi Hero, Malakpet: Ph: 9289922155. Saroornagar: Ph: 9246223479, Vanasthalipuram: 9246223423 Phoenix Hero, Hi-tech City: Ph: 9289922759. Hafeezpet: Ph: 7799017976, Gopannapalli – 7093947427 Dealwel Hero, Nampally: Ph: 9289922827. Asifnagar: Ph: 9110704727. Narsingi: Ph: 97054 27429, Bibinagar: 6305974768, Attapur: 9177888606 . Krishna Sai Hero, Malkajgiri: Ph: 9289922972. Lakshmi Hero, Somajiguda: Ph: 9289922147. Sri Venkanna Hero, Serilingampally: Ph :9640515185. Patancheru: Ph: 9289922150. Sowjanya Hero, Bahadurpura: Ph: 9289923133. Geetha Hero, Suchitra: Ph: 9289923134. Mahbubnagar: Ashvini Hero (Yenugonda) - Ph:9289922435. Ashvini Hero (Patha Palamoor) - Ph: 9949111933. Gadwal: Meghanath Hero, Ph:9289922967. Karimnagar: Bharadwaj Hero, Ph: 9289922510. Devesh Hero, Ph: 9289923163. Ramagundam: Siddi Shri Vinayaka Hero, Ph: 9289923076. Warangal: Sri Sri Sri Hero, Ph: 9289923103. Sree Vaishnavi Hero, Ph: 9289922498. Nizamabad: Sri Sai Durga Hero, (Kanteshwar) Ph: 9289922876. Venkateshwara Enterprises, (Vinayaka Nagar), Ph: 9289922153. Adilabad: Chandra Hero, Ph: 9289922156. Khammam: Sri Sri Sri Hero, Ph: 9289922159. Kothagudem: Rajyalakshmi Hero, Ph: 9289922642. Bhadrachalam: Sri Ram Motors, Ph: 9289923048.Nalgonda: Venkataramana Hero, Ph: 9289922536. Miryalaguda: Sri Krishna Hero, Ph: 9289922161. Suryapeta: Sri Venkata Lakshmi Hero, Ph: 9289923007. Mancherial: Vera Motors, Ph: 9821697492. Sangareddy: Prudhvi Automotives, Ph: 9821697396.
WT.5651.2023TEL

పురుష శ్రేష్ఠుడా! సుఖదుఃఖాలలో సమంగా ఉండే ఏ ధీరుణ్ణి ద్వంద్వాలు బాధించవో అతడు అమృతత్వానికి అర్హుడు అవుతాడు.
– హైందవ ధర్మం

సాక్షి
శనివారం, 7 అక్టోబర్ 2023

ఏ వెలుగులకీ ప్రస్థానం!

చదవేస్తే ఉన్న మతి పోయిందని నానుడి. బాంబే ఐఐటీ పాలకవర్గం నిర్వాకం వల్ల తిండి చుట్టూ మన సమాజంలో అల్లుకొని ఉన్న వివక్ష ఆ ఉన్నత శ్రేణి విద్యాసంస్థను కూడా తాకింది. బాంబే ఐఐటీ హాస్టళ్లలో మూణ్ణెల్ల క్రితం శాకాహారులకు విడిగా టేబుల్స్ కేటాయించాలన్న డిమాండ్ బయల్దేరింది. మాంసాహారుల పక్కన కూర్చుంటే ఆ ఆహారం నుంచి వచ్చే వాసనల కారణంగా తమలో వికారం, వాంతులు వంటి అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని ఆ డిమాండు చేస్తున్న వారి ఫిర్యాదు. ఎప్పుడో 1958లో స్థాపించిన ఆ విద్యాసంస్థలో ఇప్పుడే ఈ డిమాండ్ ఎందుకు తలెత్తిందన్న సంగతలా వుంచితే... దాన్ని అంగీకరిస్తే మాంసాహారం అపవిత్రం లేదా మలినం అని సమాజంలోని కొన్ని వర్గాల్లో నెలకొన్న అభిప్రాయానికి ఆమోదముద్ర వేసినట్టవుతుందన్న సందేహం బాంబే ఐఐటీ పాలకవర్గానికి కలగలేదు. ప్రాంగణంలోని మూడు హాస్టళ్లలో విడిగా ఆరు టేబుళ్లను 'వెజిటేరియన్ ఓన్లీ' బోర్డులతో అలంకరించింది. అంతటితో ఊరుకోలేదు. దీనిపై నిరసన వ్యక్తం చేసిన విద్యార్థికి రూ. 10,000 జరిమానా విధించింది. ఈ నిరసన ఘర్షణకు దారితీస్తుందనీ, క్రమశిక్షణ ఉల్లంఘన కిందికొస్తుందనీ డీన్ అంటున్నారు. ఇలాంటి డిమాండ్ తలెత్తినప్పుడు దానిపై అందరి అభిప్రాయాలూ తీసుకోవటం, ఒక కమిటీని నియమించటం, దాని సాధ్యాసాధ్యాలు, పర్యవసానాలపై చర్చించటం ప్రజాస్వామిక పద్ధతి. అలాంటి విధానమే అమలైవుంటే శాకాహార విద్యార్థులు అంతిమంగా తమ డిమాండ్‌ను వదులుకునేవారో, మాంసాహార ప్రియులు వారి సమస్య పట్ల సానుభూతితో వ్యవహరించేవారో తెలిసేది. ఈ ప్రక్రియ అమలైందా లేదా... అందులో వచ్చిన అనుకూల, ప్రతికూల అభిప్రాయాలేమిటన్నది ఎవరికీ తెలియదు. బాంబే ఐఐటీలోని అంబేడ్కర్ పెరియార్ పూలే స్టడీ సర్కిల్ (ఏపీపీఎస్సీ) విద్యార్థుల ప్రకారం పాలకవర్గం ఈ మొత్తం వ్యవహారాన్ని గోప్యంగా ఉంచింది. కనుక సహజంగానే నిరసనలు వ్యక్తమయ్యాయి. 'మేం ఏం చేసినా శిరసావహించాల్సిందే, లేకుంటే కొరడా ఝళిపిస్తాం' అన్నట్టు వ్యవహరించటం, ప్రశ్నించటమే నేరమన్నట్టు పరిగణించటం ఉన్నత శ్రేణి విద్యాసంస్థకు శోభస్కరం కాదు. వికారాలున్నవారిని దూరంగా పోయి తినమని చెప్పక గోటితో పోయేదానికి గొడ్డలి అందుకున్నట్టు ఇంత రాద్ధాంతం దేనికో అర్థం కాదు.

పాశ్చాత్య దేశాల్లో కూడా శాకాహారం, మాంసాహారం విభజన వుంది. డెయిరీ ఉత్పత్తులు సైతం సమ్మతం కాదనే వెగానిజం కూడా అక్కడుంది. అమెరికన్లలో గత మూడు నాలుగేళ్లలో దాదాపు 15 శాతం మంది శాకాహారులుగా మారారని ఈమధ్య ఒక సర్వే వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా 2020లో 1,400 కోట్ల డాలర్లుగా ఉన్న వెగాన్ మార్కెట్, ఆ మరుసటి ఏడాదికి 1,577 కోట్ల డాలర్లకు పెరిగిందని మరో సర్వే అంటున్నది. అయితే మన దేశంలో వలే అక్కడ తినే ఆహారం కులాలతో ముడిపడి లేదు. ఇక్కడ శాకాహారులు చాలా ఉన్నతులనీ, మాంసాహారులు తక్కువనీ అభిప్రాయం బలంగా పాతుకుపోయింది. అందుకు మన సంస్కృతి, సంప్రదాయాలు కూడా దోహదపడుతున్నాయి. ఆహారపుటలవాట్లలో కులాన్ని వెతకటం పాక్షిక దృష్టి అంటున్నవారు కొన్ని తూర్పు, ఈశాన్య రాష్ట్రాల్లో, మహారాష్ట్ర, కశ్మీర్ వంటిచోట్ల బ్రాహ్మణులు మాంసాహారులుగా ఉండటాన్ని ఉదహరిస్తున్నారు. కానీ ఇవి చెబుతున్నవారు మన దేశంలో చాలాచోట్ల అట్టడుగు కులాలవారికి అద్దెకు ఇల్లు ఇవ్వకుండా ఉండటానికి 'వెజిటేరియన్లకు మాత్రమే' అనే బోర్డులు పెడుతున్న ధోరణిని మరిచిపోకూడదు. ఏ తల్లిదండ్రులైనా తమ పిల్లలను ఒంటిస్తంభం మేడలో ఉంచి చదువు చెప్పించాలనుకోకుండా... ప్రాథమిక విద్య మొదలుకొని అన్ని దశల్లోనూ విద్యాసంస్థలకు పంపటంలో ఒక అంతరార్థం ఉంటుంది. వివిధ వర్గాల పిల్లలతో కలిసిమెలిసి పెరగటం, సామాజిక అవగాహన పెంపొందించుకోవటం అనే లక్ష్యాలు కూడా అంతర్లీనంగా ఇమిడివుంటాయి. తెలియనిది తెలుసుకోవటం, భిన్నత్వాన్ని గౌరవించటం, అవసరమైతే ప్రశ్నించటం, ఈ క్రమంలో తనను తాను మార్చుకోవటం కూడా విద్యాసముపార్జనలో భాగమే. బాధ్యతాయుతమైన రేపటి పౌరులుగా రూపొందటానికి ఇవన్నీ అవసరం. బాంబే ఐఐటీలో చదువుతున్నవారు పరిశోధనల కోసమో, ఉన్నతోద్యోగాల కోసమో విదేశాలకు వెళ్లవలసి వచ్చినప్పుడు తోటి మనిషి ఆహారాన్ని చూసి వికారాలు తెచ్చుకోవటం అక్కడికి కూడా మోసుకుపోతే క్షణకాలమైనా మనుగడ సాగించగలరా? ఈ ఆలోచన వాళ్లకు రాకపోతే పోయింది... సంస్థ నిర్వాహకులకేమైంది?

ఉన్నతశ్రేణి విద్యాసంస్థల్లో ఈ ఏడాది మొదటి ఏడు నెలల్లో 20 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని రాజ్యసభలో మొన్న జూలైలో కేంద్రం తెలిపింది. ఈ ఉదంతాల్లో వ్యక్తిగత కారణాలను వెదకటం తప్ప సంస్థాగతంగా ఎలాంటి దిద్దుబాటు చర్యలు అవసరమన్న విచికిత్సలోకి పోవటం లేదు. తినే తిండి మొదలుకొని ఎన్నిటినో ఎత్తి చూపి న్యూనత పరిచే ధోరణి ఉండటాన్ని ఈ సంస్థల పాలకవర్గాలు గుర్తించటం లేదు. బాంబే ఐఐటీ మరో అడుగు ముందుకేసి అలాంటి ధోరణులను బలపర్చే నిర్ణయాన్ని తీసుకోవటం ఆందోళన కలిగించే అంశం. ఈ జాడ్యం హైదరాబాద్ ఐఐటీకి కూడా వ్యాపించిందంటున్నారు. ఏకంగా శాకాహారుల కోసం అది ప్రత్యేక హాల్ కేటాయించబోతున్నదన్న వార్తలొస్తున్నాయి. తమ సంస్థల్ని ప్రపంచ శ్రేణి విద్యా కేంద్రాలుగా రూపుదిద్దటం ఎలాగన్న ఆలోచనలు మాని, క్షీణ విలువలను తలకెత్తుకోవటం ఏ మేరకు సమంజసమో నిర్వాహకులు ఆలోచించాలి.

వ్యవసాయ రంగ మేరు నగం

సందర్భం



నరేంద్ర మోదీ
ప్రధాన మంత్రి

ప్రొఫెసర్ ఎం.ఎస్.స్వామినాథన్ కొన్ని రోజుల కిందట (సెప్టెంబర్ 28) మనకు దూరమయ్యారు. వ్యవసాయ రంగాన్ని విప్లవాత్మక మలుపు తిప్పిన ఓ దార్శనికుడిని మన దేశం కోల్పోయింది. భారతదేశానికి ఆ దిగ్గజం చేసిన సేవలు చరిత్రలో సువర్ణాక్షర లిఖితం. మాతృభూమిని అమితంగా ప్రేమించే స్వామినాథన్– మన దేశం సదా సుభిక్షంగా ఉండాలనీ, మన రైతులోకం సౌభాగ్యంతో వర్ధిల్లాలనీ ఆకాంక్షించారు. ఒక తెలివైన విద్యార్థిగా తన ఉజ్వల భవిష్యత్తుకు బాటవేసుకునే వీలున్నా 1943 నాటి బెంగాల్ క్షామం ఆయనను చలింపజేసింది. ఆ రోజుల్లో ఎంతగా ప్రభావితులయ్యారంటే– ఆరు నూరైనా వ్యవసాయ రంగమే తన భవిష్యత్తుగా ఆయన తిరుగులేని నిర్ణయం తీసుకున్నారు.

వ్యవసాయ శాస్త్రంలో చదువు ముగించిన స్వామినాథన్‌కు తొలినాళ్లలోనే ప్రపంచ ప్రసిద్ధ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ నార్మన్ బోర్లాగ్‌తో పరిచయం ఏర్పడింది. నాటి నుంచీ పూర్తిగా ఆయన అడుగుజాడల్లో నడుస్తూ పరిశోధనలను ముందుకు తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో 1950 లోనే అమెరికాలో అధ్యాపకుడిగా ఆయనకు అవకాశం వచ్చింది. కానీ, జన్మభూమి సేవలో తరించడమే తన ధ్యేయమంటూ దాన్ని తిరస్కరించారు.

పెను సవాళ్లతో నిండిన అప్పటి పరిస్థితుల్లో... స్వామినాథన్ మన దేశాన్ని ఆత్మవిశ్వాసంతో స్వావలంబన వైపు నడిపించడాన్ని ఒకసారి ఊహించుకోవాల్సిందిగా కోరుతున్నాను. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తొలి రెండు దశాబ్దాల్లో మనకు ఎదురైన సవాళ్లలో ఆహార కొరత ప్రధానమైనది. 1960వ దశకం తొలినాళ్లలో భారతదేశం కరువు కాటకాలు కమ్ముకుని అల్లాడుతోంది. అటువంటి గడ్డు పరిస్థితుల నడుమ స్వామినాథన్ మొక్కవోని పట్టుదల, నిబద్ధత, ముందుచూపుతో ఉజ్వల వ్యవసాయ శకానికి నాంది పలికారు. వ్యవసాయం రంగంలో, ముఖ్యంగా గోధుమ సాగు వంటి నిర్దిష్ట ఆహార పంటల సమృద్ధి దిశగా మార్గదర్శకుడై నిలిచారు. తద్వారా ఆహార కొరతతో అల్లాడిన భారత్ స్వయం సమృద్ధ దేశంగా రూపొందింది. వ్యవసాయ రంగంలో దేశం సాధించిన ఈ అద్భుత విజయమే ఆయనకు 'భారత హరిత విప్లవ పితామహుడు' బిరుదును ఆర్జించి పెట్టింది.

'ఏదైనా సాధించగలం' అనే భారత ఆత్మస్థైర్యానికి హరిత విప్లవం ఒక సమగ్ర ఉదాహరణగా నిలిచింది. మనకు లక్ష సవాళ్లున్నా, ఆవిష్కరణల ఆలంబనగా వాటిని అధిగమించగల పది లక్షల మేధావుల అండ ఉన్నదని రుజువైంది. హరిత విప్లవం శ్రీకారం చుట్టుకున్న ఐదు దశాబ్దాల తర్వాత నేడు భారత వ్యవసాయ రంగం అత్యాధునాతనం, ప్రగతిశీలమైనదిగా మారిందంటే కారణం స్వామినాథన్ వేసిన పునాదులేననే వాస్తవాన్ని మరువలేం. దేశ ఆహార కొరతను అధిగమించడంలో విజయం తర్వాత, ఏళ్ల తరబడి బంగాళాదుంప పంటను దెబ్బతీస్తున్న పరాన్నజీవుల ప్రభావాన్ని అరికట్టే దిశగా ఆయన పరిశోధన చేపట్టి సఫలమయ్యారు. అంతేకాకుండా ఈ పంట చలి వాతావరణాన్ని కూడా తట్టుకోగలిగింది. ఇక ప్రపంచం నేడు చిరుధాన్యాలు లేదా 'శ్రీఅన్న'ను అద్భుత ఆహార ధాన్యాలుగా పరిగణిస్తోంది. స్వామినాథన్ 1990లలోనే చిరుధాన్యాలపై చర్చను ముమ్మరం చేయడమే గాక వాటి సాగును ఇతోధికంగా ప్రోత్సహించారు.

స్వామినాథన్‌తో నాకు వ్యక్తిగత సంబంధాలు ఉండేవి. 2001లో నేను గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయనతో పరిచయం ఏర్పడింది. ఆ రోజుల్లో గుజరాత్ వ్యవసాయపరంగా పెద్దగా నైపుణ్యంగల రాష్ట్రం కాదు. దీనికితోడు వరుస కరువులు, తుపానులు, భూకంపం వంటివి రాష్ట్ర ప్రగతిని దెబ్బతీశాయి. ఈ నేపథ్యంలో మేం ప్రారంభించిన అనేక కార్యక్రమాలలో భూసార కార్డుల పథకం ఒకటి. ఇది భూసారాన్ని చక్కగా అర్థం చేసుకోవడంలో తోడ్పడింది. సమస్యలు తలెత్తినపుడు వాటిని సులువుగా పరిష్కరించడం సాధ్యమైంది. ఈ పథకం అమలు సమయంలోనే నేను స్వామినాథన్‌ను కలిశాను. ఆయన ఈ పథకాన్ని ఎంతగానో మెచ్చుకున్నారు. దాన్ని మరింత మెరుగుపరచడం కోసం విలువైన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఏదైనా పథకంపై సందేహాలు వెలిబుచ్చేవారు స్వామినాథన్ మాటతో ఒక్కసారిగా ఏకాభిప్రాయానికి వచ్చేవారు.



ప్రొఫెసర్ ఎం.ఎస్.స్వామినాథన్

నేను ముఖ్యమంత్రిగా ఉన్నపుడు మాత్రమేగాక, ప్రధానమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టాక కూడా మా మధ్య సంబంధాలు కొనసాగాయి. 2016 నాటి అంతర్జాతీయ వ్యవసాయ–జీవవైవిధ్య మహాసభలలో ఆయనను కలిశాను. మరుసటేడాది 2017లో ఆయన రెండు భాగాలుగా రాసిన పుస్తకాన్ని నేనే ఆవిష్కరించాను. ప్రపంచాన్ని పరస్వరం అనుసంధానించే సూదితో 'తిరుక్కురళ్'లోని ఒక ద్విపద రైతుల గురించి అభివర్ణిస్తుంది. ఎందుకంటే ప్రతి ఒక్కరికీ అన్నదాత రైతే! ఈ సూక్తిని స్వామినాథన్ చక్కగా జీర్ణించుకున్నారు. కాబట్టే, ప్రజలు ఆయనను 'వ్యవసాయ శాస్త్రవేత్త'గా పిలుస్తారు. కానీ, ఆయన ప్రతిభా వ్యుత్పత్తులు అంతకుమించినవని నా విశ్వాసం. ఆయన నిజమైన 'రైతు శాస్త్రవేత్త'. 'రైతుల శాస్త్రవేత్త'. ఆయన మెదడులో శాస్త్రవేత్త ఉంటే, హృదయంలో రైతు ఉన్నాడన్నది నా అభిప్రాయం.

స్వామినాథన్ పరిశోధనలు కేవలం ఆయన విద్యా నైపుణ్యానికి పరిమితం కాదు; వాటి ప్రభావం ప్రయోగశాలల వెలుపలకు... వ్యవసాయ క్షేత్రాలు–పొలాలకు విస్తరించాయి. శాస్త్రీయ జ్ఞానం–ఆచరణాత్మక అనువర్తనాల మధ్య అంతరాన్ని ఆయన పనితీరు తగ్గించింది. వ్యవసాయం రంగంలో సుస్థిరత కోసం ఆయన సదా పాటుపడ్డారు. మానవ పురోగమనం, పర్యావరణ సుస్థిరత నడుమ సున్నిత సమతౌల్యాన్ని నొక్కిచెప్పారు. సన్న–చిన్నకారు రైతుల జీవితాలను మెరుగుపరచడం, ఆవిష్కరణల ఫలాలు వారికి అందించడంలో స్వామినాథన్ ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వడాన్ని నేను తప్పక ప్రస్తావించాలి. ముఖ్యంగా మహిళా రైతుల జీవితాల సాధికారతపై ఆయనెంతో శ్రద్ధాసక్తులు చూపారు.

స్వామినాథన్ లోని మరో విశిష్ట కోణం గురించి కూడా చెప్పాలి. ఆవిష్కరణల విషయంలోనే కాకుండా మార్గదర్శకత్వం వహించడంలోనూ ఆయనొక ఆదర్శమూర్తి. 1987లో ప్రతిష్ఠాత్మక 'వరల్డ్ ఫుడ్ ప్రైజ్' తొలి విజేతగా, దానికింద లభించిన సొమ్ముతో లాభాపేక్ష రహిత పరిశోధన కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కేంద్రం ఇప్పటిదాకా వివిధ రంగాలలో విస్తృత, విశిష్ట పరిశోధనలు నిర్వహించింది. అలాగే ఆయన ఎందరో పరిశోధకులను తీర్చిదిద్దారు. అభ్యాసం, ఆవిష్కరణలపై ఎందరిలోనో శ్రద్ధాసక్తులు రగిలించారు. వేగంగా మారిపోతున్న నేటి ప్రపంచ పరిస్థితుల నడుమ విజ్ఞానం, మార్గదర్శకత్వం, ఆవిష్కరణలకు గల శక్తిసామర్థ్యాలను ఆయన జీవితం ప్రతిబింబిస్తుంది. ఆయన స్వయంగా ఓ సంస్థ స్థాపకులేగాక శక్తిమంతమైన పరిశోధనలు సాగిస్తున్న మరెన్నో సంస్థల స్థాపనకు ఊపిరి పోసినవారు. మనీలాలోని అంతర్జాతీయ వరి పరిశోధన కేంద్రం డైరెక్టర్‌గానూ ఆయన పనిచేయడం ఇందుకు నిదర్శనం. ఈ సంస్థ దక్షిణాసియా ప్రాంతీయ పరిశోధన కేంద్రం 2018లో వారణాసి నగరంలో ప్రారంభమైంది.

డాక్టర్ స్వామినాథన్‌కు నివాళి అర్పిస్తున్న ఈ సందర్భంలో నేను మరో ద్విపదను ప్రస్తావించదలిచాను. 'ప్రణాళిక రూపకర్త దృఢ మనస్కుడైతే... తానేది ఏ రీతిలో ఆకాంక్షించాడో ఆ రీతిలో దాన్ని సాధించగలడు' అని ఈ ద్విపద చెబుతుంది. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయాలనీ, రైతులకు సేవలందించాలనీ చిరుప్రాయంలోనే నిర్ణయించుకున్న మహనీయుడాయన. ఆ విధంగానే వినూత్నంగా, ఆవిష్కరణాత్మకంగా, భావోద్వేగాలతో తాను నిర్దేశించుకున్న లక్ష్యం సాధించారు. వ్యవసాయ ఆవిష్కరణలు, సుస్థిరత దిశగా మన పయనంలో స్వామినాథన్ కృషి, పరిశ్రమ మనకు సదా స్ఫూర్తిదాయక మార్గనిర్దేశం చేస్తాయి. మనం కూడా ఆయనెంతో ప్రీతిగా అనుసరించిన సూత్రాల అమలుకు మన నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ ముందుకు సాగాలి. రైతుల సంక్షేమం ప్రాతిపదికగా శాస్త్రీయ ఆవిష్కరణల ఫలాలు మూలాలకు చేరేలా చూడాలి. తద్వారా భవిష్యత్తరాలను వృద్ధి, సుస్థిరత, సౌభాగ్యం వైపు ప్రోత్సహించాలి.

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

బందీగా విజేత



బందీగా ఉన్న ఇరానియన్ మానవ హక్కుల యాక్టివిస్ట్ నర్గీస్ మొహమ్మదీకి నోబెల్ శాంతి బహుమతి వచ్చింది. ఇరాన్ జైళ్లలో మగ్గుతున్న చురుకైన మెదళ్ల జాబితా పెద్దది. ఇప్పుడు ఆ జాబితాకు ఒక నోబెల్ శాంతి బహుమతి విజేతను కలుపుకోవాలి.

– నజానిన్ నూర్, ఇరానియన్ అమెరికన్ నటి

ప్రత్యేక రోజు



నార్వేజియన్ నోబెల్ కమిటీ నర్గీస్ మొహమ్మదీకి నోబెల్ శాంతి బహుమతి ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇరానియన్లు, స్వాతంత్ర్య పోరాట యోధులు, మహిళల హక్కుల కోసం పోరాడుతున్న యాక్టివిస్టులందరికీ ఇది ప్రత్యేక రోజు.

– రెజా, విజువల్ స్టోరీటెల్లర్

సొంత లక్ష్యాలుండవా?



నేనేమీ ఇండియా మీద, ఈ భౌగోళిక రాజకీయాల మీద నిపుణురాలిని కాదుగానీ, 140 కోట్ల జనాభా కలిగిన దేశాన్ని తన సొంత ప్రయోజనాలు, లక్ష్యాలు ఉండే దేశంగా చూడాలే తప్ప, కేవలం చైనాకు ప్రతి సమ తూకంగా(కౌంటర్‌వెయిట్) చూడకూడదు.

– త్రిన్హ్ ఎంగుయెన్, ఆర్థికవేత్త

సోషల్ ట్రెండ్



ఓ 5 స్టార్ హోటల్లో ఓ కుటుంబం దిగడం చూశాను. తల్లి, కూతురు వేర్వేరుగా రీల్స్ తీసుకోవడంలో మునిగారు. పాపం, భర్తేమో ఆ 'చెక్ ఇన్' పనులు చూసుకుంటున్నాడు. ఎంజాయ్ చేయడం కన్నా, తాము ఎంజాయ్ చేస్తున్నామని జనాన్ని నమ్మించడం ఈమధ్య ఎక్కువైపోయింది.

– ఇద్రీస్ ముబారిక్, వైద్యుడు

విలువైన మూడు



మొదటి బహుమతి జీవితం. రెండవ బహుమతి ప్రేమ. మూడవ బహుమతి మనశ్శాంతి.

– వాలా అఫ్షార్, డిజిటల్ ఇవాంజెలిస్ట్

ఒత్తిడి పెంచడమే లక్ష్యం!

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను చట్టబద్ధం చేస్తూ కేంద్ర ప్రభుత్వం శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు పెట్టేలా ఒత్తిడి తెచ్చేందుకు నేడు (అక్టోబర్ 7)న ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా అలంపూర్ నుండి హైదరాబాద్ వరకు ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ 'మహా పాదయాత్ర'కు శ్రీకారం చుట్టారు. మూడు దశాబ్దాల క్రితం వర్గీకరణ కోరుతూ చేసిన పాదయాత్రతో హైదరాబాద్ మహా నగరాన్ని మాదిగల ప్రవాహంతో ముంచెత్తారు మంద కృష్ణ మాదిగ. ఆయనే నేడు 'విశ్వరూపం' అంటూ మరోసారి పాదయాత్రకు పూనుకోవడం ఒక చారిత్రాత్మక నిర్ణయం.

కేంద్ర ప్రభుత్వానికి ఈ శీతాకాల పార్లమెంట్ సమావేశాలే చివరి సమావేశాలు కావచ్చు. సరిగ్గా పార్లమెంటు సమావేశాలు జరిగే సమయానికే తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలకు రంగం సిద్ధం కాబోతున్నది. అందుకే కేంద్రంపై ఒత్తిడి సృష్టించి 'ఎస్సీ వర్గీకరణ' అంశ పరిష్కారాన్ని సాధించాలని 'దండోరా' భావిస్తోంది.

తెలంగాణలో మాదిగల జనాభా ఎక్కువ. వారి మద్దతు లేకుండా ఇక్కడ రాజకీయ అధికారాన్ని ఏ పార్టీ చేపట్టలేదు. బీజేపీ, కాంగ్రెస్‌లు నేడు తెలంగాణ వైపే చూస్తున్నాయి. ఈ రెండింటిలో ఒకటి (బీజేపీ) అధికారంలో ఉంటే... రెండోది ప్రధాన ప్రతిపక్షంగా ఉంది. కేంద్రంలో సంపూర్ణ మెజారిటీ ఉన్న బీజేపీకి ఎస్సీ వర్గీకరణపై సత్వరమే నిర్ణయం తీసుకోవడానికి ఏ ఇబ్బందీ లేదు. ప్రతిపక్ష కాంగ్రెస్ కూడా తమ మద్దతు తెలుపుతూ కేంద్రానికి లేఖ సమర్పించాలి. బీజేపీ బిల్లు పెట్టడానికి ముందుకు రాకపోతే తామే ప్రైవేటు బిల్లును ప్రవేశపెట్టాలి. షెడ్యూల్డ్ కులాల్లో ఉమ్మడి రిజర్వేషన్ల విధానం వలన అసమానతలు ఏర్పడి మెజార్టీ జనాభా కలిగిన కులాలు తీవ్ర అన్యాయానికి గురై నష్టపోయాయని తెలిసినా, ప్రభుత్వాలు నియమించిన కమిషన్లే జరిగిన నష్టాన్ని ఆధారాలతో తేల్చినా కేంద్ర పాలకులు సమస్యను పరిష్కరించడం లేదు.

బీజేపీ ముందు మూడు పరిష్కార మార్గాలు ఉన్నాయి. అవి ఆర్టికల్ 341ను సవరించి పార్లమెంటులో బిల్లు ఆమోదించడం, ఇప్పటికే అసెంబ్లీలో తీర్మానాలు చేసిన రాష్ట్రాలకు ఎస్సీ వర్గీకరణ చేసేలా అధికారం ఇవ్వడం, ఎస్సీ వర్గీకరణ న్యాయ సమ్మతమేనని జస్టిస్ అరుణ్ మిశ్రా నేతృత్వంలోని ఐదుగురు జడ్జీలతో కూడిన సుప్రీం ధర్మాసన సిఫారసుల మీద ఏడుగురు లేదా తొమ్మిది మంది జడ్జిలతో కూడిన విస్తృత ధర్మాసనాన్ని ఏర్పాటు చేసి ముందుకు పోవడం. ఈ మూడు మార్గాల్లో ఏ మార్గాన్ని అనుసరించినా సమస్య పరిష్కారం అవుతుంది.

– రాగళ్ల ఉపేందర్ మాదిగ,
ఎమ్మార్పీఎస్ తెలంగాణ ప్రధాన కార్యదర్శి
(నేటి నుంచి మందకృష్ణ మాదిగ విశ్వరూప మహా పాదయాత్ర)

1948 పోలీస్ యాక్షన్ - మరోకోణం

విశ్లేషణ



దానీ

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం, అది సృష్టించిన సాహిత్యం మన రాజకీయాల్లో, సాహిత్యంలో చివరకు మన జీవితాల్లోనూ విడదీయరాని భాగం. ఇప్పుడు కమ్యూనిస్టు పార్టీలకు రెండు తెలుగు రాష్ట్రాల చట్టసభల్లో ఒక్క ప్రతినిధి కూడా లేడు. అయినప్పటికీ, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో వామపక్ష భావజాలమే ఇప్పటికీ బలంగా ఉంది. తెలుగు సాహిత్యంలో అత్యధిక భాగం 'సామ్యవాద వాస్తవికత' ప్రభావంలోనే ఉందంటే అతిశయోక్తి కాదు.

భాషా ప్రయుక్త రాష్ట్రాల విధానం వచ్చాక 1956లో తెలంగాణ ప్రాంతాన్ని ఆంధ్రరాష్ట్రంతో కలిపి ఆంధ్రప్రదేశ్‌ను ఏర్పాటు చేశారు. నిజాం సంస్థానం చాలా పెద్దది. అందులోని ఐదు ప్రధాన ప్రాంతాల్లో తెలంగాణ ఒకటి. తెలంగాణలోని నల్లగొండ, వరంగల్ రెండు జిల్లాల్లో ప్రధానంగానూ, మరో ఒకటి రెండు జిల్లాల్లో స్వల్పంగానూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం సాగింది. ఆనాటి చారిత్రక సంఘటనల మీద తమ అనుభవాలను గ్రంథస్థం చేసిన ఆ పోరాట అగ్రనాయకులు అందరూ తెలంగాణకు పరిమితమయ్యారు. తమ పుస్తకాలకు నిజాయితీగా 'తెలంగాణ' అనే శీర్షికలే పెట్టారు. మిగిలిన నిజాం సంస్థానాన్ని వదిలేశారు. దానికి రెండు కారణాలు. మొదటిది ఉర్దూ భాషా సమస్య, రెండోది ముస్లిం మత సమస్య.

నిజాం పాలన గురించి మనకు, ముఖ్యంగా, తెలుగు పాఠకులకు తెలిసింది చాలా తక్కువ. నిజాం సంస్థానంలో పెట్టుబడీదారీ అభివృద్ధి గురించి పరిశోధనలు చేసిన ప్రొఫెషనల్స్ కొందరు లేకపోలేదు. వారిలో ఒకడైన సివి సుబ్బారావు ఆ రోజుల్లో జవహర్ లాల్ నెహ్రూ వాగ్దానం చేసిన ఇండియాకన్నా మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ పాలనలోని నిజాం సంస్థానంలో కొనసాగుతున్న అభివృద్ధి మెరుగ్గా ఉందనే నిర్ధారణకు వచ్చాడు.

ఇంతకీ తెలంగాణ సాయుధ పోరాటం ద్వారా భారత కమ్యూనిస్టు పార్టీ సాధించిందేమిటి? వాదన కోసం; నిజాం రాచరిక పాలననో, జాగీర్దార్ల భూస్వామ్యాన్నో వాళ్ళు అంతం చేసేశారు అనుకుందాము. భూస్వామ్య వ్యవస్థను అంతం చేశాక పెట్టుబడీదారీ వ్యవస్థ ఏర్పడుతుందని సాక్షాత్తు 'కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక'లో కార్ల్ మార్క్స్– ఫ్రెడరిక్ ఏంగిల్స్ చెప్పారు. అంతేకాని భూస్వామ్య వ్యవస్థను కూల్చేస్తే సమసమాజం వస్తుందనో, కమ్యూనిస్టు రాజ్యం వస్తుందనో, కనీసం 'రైతు–కూలీ రాజ్యం' వస్తుందనో వాళ్ళెక్కడా చెప్పలేదు.

తెలంగాణలో కమ్యూనిస్టు పార్టీ రాచరిక – భూస్వామ్య వ్యతిరేక పోరాటం చేసిన తరువాత అక్కడ అత్యంత సహజంగానే పెట్టుబడీదారీ వ్యవస్థ అభివృద్ధి చెందడాన్ని మనందరం చూస్తున్నాం. 1940ల చివర్లో ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీగానీ, 1980ల మొదట్లో నక్సలైట్ పార్టీలుగానీ ఉద్దేశ్యపూర్వకంగా కాకపోయినా పెట్టుబడిదారులు పెరగడానికి కారణమయ్యారు. సమాజానికి తనదైన ఒక రోడ్ మ్యాప్ ఉంటుంది. ఒకరు అనుకున్నా అనుకోకపోయినా అదలా సాగిపోతుందంతే. ఒక కఠోర చారిత్రక వాస్తవం ఏమంటే ప్రపంచంలో ఇప్పటి వరకు పెట్టుబడీదారీ వ్యవస్థ అభివృద్ధి చెందిన ఏ దేశంలోనూ సోషలిస్టు విప్లవం విజయవంతం కాలేదు.



1948 నాటి పోలీస్ యాక్షన్ గురించి కమ్యూనిస్టు నాయకులు చెప్పని ఇంకో పెద్ద నిజం కూడా ఉంది. జె.ఎన్. చౌధరి నాయకత్వంలోని 'పోలీసు యాక్షన్' కమ్యూనిస్టు ప్రభావిత జిల్లాలకు చేరుకోవడానికి ముందే నిజాం సంస్థానంలో సాయుధపోరాటంలో మరణించిన 3 వేలకు ఓ పది రెట్లకు పైగా ముస్లింలను అతి క్రూరంగా చంపేశారు. వాళ్ల ఆస్తుల్ని స్వాధీనం చేసుకున్నారు. దీనిపైన నెహ్రూ వేసిన సుందర్ లాల్ బహుగుణ కమిటీ మాత్రమేకాక, ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీకి అప్పటి పార్లమెంటరీ రాజకీయాల వేదికగా ఉన్న 'పీపుల్స్ డెమోక్రాటిక్ ఫ్రంట్ '(పీడీఎఫ్) నాయకులు కూడ ఒక నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందచేశారు. సుందర్ లాల్ బహుగుణ నివేదికను జాతీయభద్రత దృష్ట్యా చాలాకాలం దాచిపెట్టారుగానీ ఇప్పుడు అది అందుబాటులో వుంది.

ఇండో–అమెరికన్ రచయిత అఫ్సర్ మహమ్మద్ 1948 నాటి పోలీస్ యాక్షన్ బాధిత కుటుంబాల సంతతిని కలిసి వాళ్ళ అనుభవాలను నమోదు చేసే బాధ్యతను భుజాన వేసుకున్నాడు. ఈ అంశం మీద ఓ దశాబ్దం పాటు విస్తృత పరిశోధనలు చేసి ఇప్పుడు 'రీమేకింగ్ హిస్టరీ –1948 పోలీస్ యాక్షన్ అండ్ ది ముస్లిమ్స్ ఆఫ్ హైదరాబాద్' శీర్షికతో ఒక భారీ చారిత్రక డాక్యుమెంట్ ప్రచురించాడు. 2002 గుజరాత్ అల్లర్ల తరువాత తను ముస్లిం సమాజం మీద దృష్టి పెట్టాడు. మొహర్రం పండుగ సందర్భంగా తెలంగాణలో వెల్లివెరిసే మత సామరస్యం మీద పరిశోధన సాగించాడు. ఆ క్రమంలో 1948 పోలీస్ యాక్షన్ బాధితులు అతనికి తారసపడ్డారు. దాచేస్తే దాగని సత్యాలను వెల్లడించడానికి సిద్ధపడ్డాడు. దాని ఫలితమే ఈ పరిశోధనా గ్రంథం.

ప్రపంచం అనేది చాలా పెద్దది. అందులో మనకు తెలిసింది చాలా తక్కువ, తెలియాల్సింది చాలా ఎక్కువ అనే స్పృహ చాలామందికి ఉండదు. ప్రపంచం మొత్తం తెలియకపోయినా మనదేశం గురించి, మన రాష్ట్రం గురించయినా తెలియాలి. హీనపక్షం మనతో వందల సంవత్సరాలుగా సహజీవనం చేస్తున్న సమూహాల మనోభావాలనైనా తెలుసుకోవాలిగా. దానికి ఈ పుస్తకం తోడ్పడుతుందని ఆశిస్తాను.


వ్యాసకర్త సమాజ విశ్లేషకులు, సీనియర్ జర్నలిస్టు
మొబైల్: 9010757776

క్షమాగుణం

క్షమా శస్త్రం కరే యస్య దుర్జనః కిం కరిష్యతి?
అతృణో పతితో వహ్నిః స్వయమేవోపశమ్యతి!

గడ్డి పరక లేని నేలమీద పడిన మంట తనంత తానే ఆరిపోతుంది. ఎవరి దగ్గరైతే క్షమ అనే శస్త్రం ఉంటుందో వారిని దుర్జనులు కూడా ఏమీ చేయలేరని శ్లోకం భావం. మంట తనని కాలుస్తున్నా తిరిగి ప్రతీకారం తీర్చుకోకుండా నేలతల్లి సహనం వహించడం వల్ల మంటలో ఉన్న కాలే గుణం తగ్గి పోతుందట.

రావణుడితో మొదటిసారి యుద్ధంలో తలపడినప్పుడు 'సీతను అప్పగించి శరణు కోరితే క్షమించి వదిలేస్తాను' అని పలికాడు రాముడు. ఎంతటి శత్రువునైనా క్షమించగల దయా గుణ సంపన్నుడు రాముడు. తన భార్యని అపహరించిన శత్రువుని కూడా క్షమాగుణంతోనే పలకరించాడు. రావణుడు చనిపోయాక శ్రాద్ధ కర్మల అవసరం లేదని విభీషణుడు చెప్పగా 'ఎంతటి శత్రువైనా మరణంతో పగలన్నీ మరచిపోవాలి. అతడు మీకెలా సోదరుడో నాకూ అంతే. అతడికి సద్గ తులు కలగాలంటే శ్రాద్ధ కర్మలు జరిపించాలని' పలికాడు. అంతటి క్షమాగుణం సీతాపతిది. కార్తవీర్యార్జునుడిని, పదిహేడు అక్షౌహిణుల సైన్యాన్ని హతమార్చిన పరశురాముడితో తండ్రి జమదగ్ని 'క్షమయే మన ధర్మం. ధర్మతత్వానికి క్షమయే మూలం. క్షమ కలిగి ఉండడం చేతనే సర్వేశ్వరుడు బ్రహ్మ పదాన్నీ, సకల జీవరాశినీ పరి పాలిస్తున్నాడు. క్షమ కలిగి ఉంటే సిరి కలుగుతుంది. విద్య అబ్బుతుంది. సౌఖ్యాలు కలుగుతాయి. శ్రీహరి మెప్పు పొందగలరని' హితబోధ చేశాడు. ఫలితంగా ఏడాది పాటు తీర్థయాత్రలు చేశాడు పరశురాముడు.



ఈ కాలం వారికి వింతగా కనబడవచ్చు కానీ క్షమాగుణానికి ఉన్న బలం అంచనా కట్టలేనిది. ఎవరైనా ఒక్క మాటంటే భరించలేకపోవడం, దూషిస్తూ తిరిగి ఎదురుదాడి చేయడం నేటి కాలంలో చూస్తుంటాం. ఒక్క క్షణం ఓపికతో అవతలి వారి కోణంలో ఆలోచిస్తే వారి మీద కోపం రావడం బదులు సానుభూతి కలుగుతుంది. క్షమాగుణాన్ని చూప డమంటే చేతకానితనం కాదు. ఆత్మబలమున్న బలవంతులకే అది సాధ్యం.

– అమ్మాజీ ఉమామహేశ్వర్

గ్రహం అనుగ్రహం

శ్రీశోభకృత్‌నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, భాద్రపద మాసం, **తిథి:** బ.అష్టమి ఉ.10.05 వరకు, తదుపరి నవమి **నక్షత్రం:** పునర్వసు రా.2.31 వరకు, తదుపరి పుష్యమి, **వర్జ్యం:** ప.1.36 నుండి 3.21 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.55 నుండి 7.29 వరకు, **అమృతఘడియలు:** రా.11.55 నుండి 1.34 వరకు; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 5.54, **సూర్యాస్తమయం:** 5.43.

సీఎం కేసీఆర్‌కు ఛాతీలో ఇన్‌ఫెక్షన్

- వైరల్ జ్వరం తర్వాత సెకండరీ ఇన్‌ఫెక్షన్ వచ్చింది: కేటీఆర్
- అందుకే కోలుకునేందుకు ఎక్కువ సమయం పడుతోంది

సాక్షి, హైదరాబాద్: అనారోగ్యం బారినపడిన ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు క్రమంగా కోలుకుంటున్నారని మంత్రి కేటీ రామారావు వెల్లడించారు. కొద్దిరోజుల క్రితం వైరల్ జ్వరం బారినపడిన కేసీఆర్‌కు తర్వాత బాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్ సోకిందని తెలిపారు. ఛాతీలో ఈ సెకండరీ ఇన్‌ఫెక్షన్ వచ్చిందని వివరించారు. దీంతో కేసీఆర్ పూర్తిగా కోలుకునేందుకు అనుకున్న సమయం కంటే ఎక్కువకాలం పట్టే అవకాశం ఉందని తెలిపారు. వైరల్ జ్వరం బారిన పడిన సీఎం కేసీఆర్ దాదాపు మూడు వారాలుగా బహిరంగ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. తాజాగా ఆయన ఆరోగ్యానికి సంబంధించిన అంశాలను కేటీఆర్ వెల్లడించారు.

బీఆర్‌ఎస్‌లోకి మెదక్ డీసీసీ మాజీ అధ్యక్షుడు

- కంఠారెడ్డి తిరుపతిరెడ్డికి గులాబీ కండువా కప్పిన కేటీఆర్


తిరుపతిరెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: మెదక్ జిల్లా కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి శుక్రవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ప్రగతిభవన్‌లో జరిగిన కార్యక్రమంలో తిరుపతిరెడ్డికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ కోసం కష్టపడి పనిచేసిన తిరుపతిరెడ్డి వంటి నేతలను బలవంతంగా బయటికి పంపుతున్నారంటూ ఈ సందర్భంగా కాంగ్రెస్‌పై కేటీఆర్ విమర్శలు గుప్పించారు. కాగా పదేళ్లుగా మెదక్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేసిన తనను మోసం చేశారని తిరుపతిరెడ్డి మండిపడ్డారు. డబ్బు సంచులతో వస్తున్న నేతలకు మాత్రమే కాంగ్రెస్‌లో టికెట్లు వస్తున్నాయని ఆరోపించారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు కుమారుడు రోహిత్ మెదక్ అసెంబ్లీ టికెట్ ఆశిస్తూ కాంగ్రెస్‌లో చేరడంతో.. కంఠారెడ్డి తిరుపతిరెడ్డి కాంగ్రెస్‌ను వీడి బీఆర్‌ఎస్‌లోకి వచ్చారు.

ప్రగతిభవన్‌కు నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి శుక్రవారం సీఎం కేసీఆర్‌ను కలిసేందుకు ప్రగతి భవన్‌కు వచ్చారు. సీఎం కేసీఆర్ అనారోగ్యంతో ఉండటంతో ఆయనను శనివారం మధ్యాహ్నం రావాల్సిందిగా సూచించినట్టు తెలిసింది. నర్సాపూర్‌లో మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డికి బీఆర్‌ఎస్ టికెట్ ఇవ్వనున్న సంకేతాలతో మదన్‌రెడ్డి అసంతృప్తిగా ఉన్నారు. ఈ క్రమంలో మెదక్ లోక్‌సభ స్థానం నుంచి పోటీకి గానీ, రాజ్యసభ సభ్యుడిగా గానీ అవకాశమిస్తామని బీఆర్‌ఎస్ పెద్దలు బుజ్జగిస్తున్నట్టు తెలిసింది. కేసీఆర్‌ను కలిశాక తన నిర్ణయాన్ని ప్రకటించాలని మదన్‌రెడ్డి భావిస్తున్నారు.

15 నుంచి కాంగ్రెస్ బస్సుయాత్ర!

- ప్రారంభించనున్న ప్రియాంక.. హాజరుకానున్న రాహుల్, ఖర్గే
- త్వరలోనే షెడ్యూల్, రూట్ మ్యాప్ ఖరారు
- పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో తుది నిర్ణయం తీసుకునే చాన్స్
- మంచి రోజులు లేవన్న కారణంతో అభ్యర్థుల జాబితా ఆలస్యం
- ఈ నెల 14న అమావాస్య తర్వాత విడుదల చేసే అవకాశం ఉందన్న పార్టీ నేతలు



సాక్షి, హైదరాబాద్/ సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ కాంగ్రెస్‌లోని సీనియర్ నేతలు నిర్వహించ తలపెట్టిన బస్సుయాత్రను ఈనెల 15వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్టు తెలిసింది. ఈ నెల 14 తర్వాత ఏ క్షణమైనా కాంగ్రెస్ అభ్యర్థుల జాబితా వెలువడుతుందన్న అంచనాల నేపథ్యంలో టీపీసీసీ నేతలు దీనిపై సూత్రప్రాయ నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. బస్సు యాత్రను ప్రారంభించేందుకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ రానున్నారని.. యాత్ర జరుగుతున్న సమయంలో రాహుల్‌గాంధీతోపాటు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా హాజరయ్యేలా షెడ్యూల్ రూపొందుతోందని పీసీసీ వర్గాలు చెప్తున్నాయి. ఈ నెల 9న లేదా 10న జరిగే రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశంలో షెడ్యూల్, రూట్ మ్యాప్‌ను ఖరారు చేయనున్నట్టు వివరిస్తున్నాయి.

టికెట్లు ఎప్పుడు?.. సమావేశాలు ఎన్నడు?

ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో టికెట్ల కేటాయింపు అంశం హాట్‌టాపిక్‌గా నడుస్తోంది. రెండు దఫాలు స్క్రీనింగ్ కమిటీ సమావేశాలు పూర్తయిన నేపథ్యంలో.. అదిగో జాబితా, ఇదిగో జాబితా అంటూ వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. అయితే టికెట్ల ప్రకటన ఈనెల 14వ తేదీ తర్వాతే ఉంటుందని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. నిజానికి అక్టోబర్ మొదటి వారంలోనే తొలిజాబితా విడుదల చేసేలా కాంగ్రెస్ పెద్దలు కసరత్తు చేశారు. కానీ స్క్రీనింగ్ కమిటీ సమావేశాలు ఇంకా జరగాల్సి ఉండడం, కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) భేటీ జరగకపోవడంతోపాటు పితృపక్షాల కారణంగా మంచి రోజులు లేవనే ఉద్దేశంతో అభ్యర్థుల ప్రకటన వాయిదా వేసినట్టు సమాచారం. ఈ నెల 14న అమావాస్య ఉండటంతో ఆ తర్వాత తెలంగాణ అభ్యర్థుల తొలి జాబితా ఉంటుందని టీపీసీసీ కీలక నేత ఒకరు వెల్లడించారు. ఇందుకోసం ఈనెల 8న స్క్రీనింగ్ కమిటీ భేటీ అవుతుందని, తర్వాత 10న సీఈసీ సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. మరోవైపు స్క్రీనింగ్ కమిటీ ఒక్కో పేరు పంపిన నియోజకవర్గాలకే తొలుత అభ్యర్థుల ప్రకటన ఉంటుందని తెలిసింది. రెండు, మూడు పేర్లు పంపిన సెగ్మెంట్లకు సంబంధించి ఒక్కో పేరును ఫైనల్ చేసేందుకు సీఈసీ కొన్ని మార్గదర్శకాలు ఇస్తుందని, ఆ మార్గదర్శకాల మేరకు మళ్లీ స్క్రీనింగ్ కమిటీనే ఒక్కో పేరు సూచించాల్సి వస్తుందనే చర్చ ఏఐసీసీ వర్గాల్లో జరుగుతోంది.

పెద్ద నేతల పర్యటనలపై చర్చ

శుక్రవారం బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి చేరిక సందర్భంగా ఢిల్లీలో ఖర్గే, వేణుగోపాల్‌లతో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముగ్గురు నేతలు తెలంగాణలో ఏఐసీసీ కీలక నేతల పర్యటనలపై చర్చించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వీలున్నన్ని ఎక్కువ సార్లు ప్రియాంక, రాహుల్‌గాంధీలతోపాటు ఖర్గే కూడా రాష్ట్రంలో పర్యటించేలా షెడ్యూల్ ఇవ్వాలని, కీలక సమయంలో మరోమారు సోనియాగాంధీ కూడా పాల్గొనేందుకు అనుమతి ఇప్పించాలని రేవంత్ కోరినట్టు సమాచారం. ఈ నెల 15 తర్వాత రాష్ట్రంలో 2 రోజుల పాటు రాహుల్ పర్యటన ఉంటుందని తెలిసింది.

'అంధుల పాఠశాలల పరిస్థితి దారుణం'

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా అంధ బాలబాలికల పాఠశాలల పరిస్థితి దయనీయంగా ఉందని, సిబ్బంది, వసతులు లేకుండానే స్కూళ్లు కొనసాగుతున్నాయని అమికస్ క్యూరీ (కోర్టు సహాయకుడు) హైకోర్టుకు నివేదిక సమర్పించారు. ఆ స్కూళ్లలో కనీస సౌకర్యాలు కల్పించాలని, సిబ్బందిని నియమించాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. దారుల్ షిఫాలోని అంధ పాఠశాలల విద్యార్థుల ఇబ్బందులపై వచ్చిన కథనాలపై హైకోర్టు సుమోటోగా విచారణ జరిపింది.

మున్సిపాలిటీల్లో అవిశ్వాసం
ఆపాలన్న పిటిషన్ల కొట్టివేత

- చట్టప్రకారం అవిశ్వాస తీర్మాన ప్రక్రియ
- 28 పిటిషన్లకు కలిపి ఒకే తీర్పు ఇచ్చిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: మున్సిపల్ కౌన్సిలర్లు ఇచ్చిన అవిశ్వాస తీర్మానా లను ఆపాలంటూ రాష్ట్ర వ్యాప్తంగా పలువురు చైర్‌పర్సన్లు, వైస్ చైర్మన్లు దాఖలు చేసిన 28 పిటిషన్లను హైకోర్టు కొట్టి వేసింది. ఫిబ్రవరి 9న కౌన్సిలర్లు తనపై ఇచ్చిన అవిశ్వాస తీర్మానాన్ని జిల్లా కలెక్టర్ స్వీకరించడం, సంబంధిత ప్రక్రియ ప్రారంభించడాన్ని గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి హైకోర్టులో సవాల్ చేశారు. ఈ మేరకు రిట్ పిటిషన్ దాఖలు చేశారు. మరోవైపు తమ వాదనలు వినకుండా ఉత్తర్వులు ఇవ్వవద్దని కోరుతూ కౌన్సిలర్ల తరఫున గౌరారం రాజశేఖర్‌రెడ్డి కేవియట్ దాఖలు చేశారు. ఈ విధంగా రాష్ట్ర వ్యాప్తంగా అవిశ్వాసాలను సవాల్ చేస్తూ పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై విచారణ చేపట్టిన జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ఏప్రిల్‌లో తీర్పు రిజర్వు చేశారు. కొత్త తెలంగాణ మునిసిపా లిటీల చట్టం–2019 ప్రకారం చైర్‌పర్సన్ లేదా వైస్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు ఎలాంటి నిబంధనలు రూపొందించలేదని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. అవిశ్వాస ప్రక్రియకు జారీ చేసిన నిబంధనలు ఏపీ మున్సిపాలిటీల చట్టం–1965 ప్రకారం రూపొందించినవని, అయితే అవి రద్దయ్యా యని పేర్కొన్నారు. కొత్త క్లాజ్‌లో సెక్షన్ 299, సెక్షన్ 299 (2)లను ఏపీ మునిసిపాలిటీల చట్టం నుంచే రూపొందించారని రాజశేఖర్‌రెడ్డి వాదించారు. వాదనలు విన్న న్యాయమూర్తి శుక్రవారం తీర్పు వెలువరించారు. ప్రతివాదుల వాదనలతో ఏకీభవించిన న్యాయమూర్తి.. చట్ట ప్రకారం అవిశ్వాస తీర్మాన ప్రక్రియ సాగుతుందని పేర్కొంటూ పిటిషన్లు కొట్టివేశారు.

ఉపాధ్యాయ బదిలీలపై హైకోర్టు స్టే

తదుపరి విచారణ వరకు నిలిపివేత.. 19వ తేదీకి విచారణ వాయిదా

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ బదిలీలపై హైకోర్టు స్టే విధించింది. తదుపరి విచారణ వరకు బదిలీల నిలిపివేతపై మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు విచారణను ఈ నెల 19వ తేదీకి వాయిదా వేసింది. రంగారెడ్డి జిల్లా ఉపాధ్యాయుల సీనియారిటీ తుదిజాబితా సిద్ధమ య్యేవరకు బదిలీలు ఆపాలని, వీలైనంత త్వరగా జాబితా సిద్ధం చేసేలా అధికారులకు ఆదేశాలు జారీచేయాలని కోరుతూ స్కూల్ అసిస్టెంట్ ఎస్.గోపీకృష్ణతోపాటు మరో నలుగురు హైకోర్టులో శుక్రవారం లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ జువ్వాడి శ్రీదేవి ధర్మాసనం విచారణ చేపట్టింది. 'మేం రంగారెడ్డి జిల్లాలో స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లుగా పనిచేస్తున్నాం. రాష్ట్రపతి ఉత్తర్వులు, 2018లోని నిబంధన ల ప్రకారం రంగారెడ్డి జిల్లాకు స్థానికులం. చాలాకాలం తర్వాత 2023, జనవరిలో విడుదల చేసిన జీవో నంబర్ 5 ప్రకారం వివిధ కేడర్ల ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్న తులకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పాఠ శాల విద్యాడైరెక్టర్ షెడ్యూల్ జారీచేశారు. అయితే జిల్లా అధికారులు తాత్కాలిక సీనియారిటీ జాబితాలు రూపొందించారు. దీని ప్రకారం అన్ని కేటగిరీల ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టే ప్రక్రియ పూర్తిచేశారు. తాత్కాలిక సీనియారిటీ జాబితాను ఇప్పటికే ప్రచురించారు. వివరణ ఇవ్వడానికి మాకు కేవలం ఒక్కరోజు సమయం ఇచ్చారు. ఫిర్యాదు చేయడానికి ప్రయత్నించినా చాలాసేపు సంబంధిత వెబ్‌సైట్ ఓపెన్ కాలేదు. లిఖితపూర్వకంగా అభ్యంతరాలు సమర్పించడానికి గ్రీవెన్స్ సెల్ లేదు. రాష్ట్రపతి ఉత్తర్వులను ఉల్లంఘించి ఇతర జిల్లాలవారిని జాబితాలో చేర్చి ప్రచురించారు. ఇది స్టేట్ అండ్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్‌లోని 38(డి) నిబంధనకు విరుద్ధం. సీనియారిటీ తుదిజాబితా సిద్ధమయ్యే వరకు బదిలీలు ఆపాలి' అంటూ పిటిషన్‌లో వారు పేర్కొన్నారు.

వచ్చేది హంగ్.. మనదే పవర్!

▶ మొదటి పేజీ తరువాయి

అనుకుంటున్నారు. కానీ మనం బలపడ్డాం. 12 వేల ఓట్ల నుండి 90 వేల ఓట్లకు పెరిగాం. జీహెచ్‌ఎంసీలో నాలుగు సీట్ల నుండి 48 సీట్లు గెలిచాం. దుబ్బాక, హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో గెలిచాం. బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లకు ఎంఐఎం అవసరం. అందుకోసమే ఆ పార్టీతో అవి అంటకాగుతున్నాయి. పశ్చిమ బెంగాల్, తెలంగాణ సీఎంలు ఒకేలా వ్యవహరిస్తున్నారు. చట్టాన్ని కాపాడాల్సిన పోలీసులే అక్రమ కేసులు పెడుతున్నారు. వీటికి భయపడాల్సిన అవసరం లేదు..' అని సంతోష్ పేర్కొన్నారు. కాగా పార్లమెంట్ ఉభయ సభలు 'నారీశక్తి వందన్ బిల్లు'కు ఆమోదం తెలిపిన నేపథ్యంలో ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలుపుతూ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని రాష్ట్ర కౌన్సిల్ ఆమోదించింది. దీనితో పాటు రాజకీయ తీర్మానాన్ని, జీ–20 సమావేశాల విజయవంతం, చంద్రయాన్–2 విజయవంతంపై తీర్మానాలు కూడా ఆమోదించారు.

బీజేపీకి మద్దతివ్వండి: అన్నివర్గాల ప్రజలను దగా చేసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో ఓడించి, ప్రజాస్వామ్యయుత పాలన నెలకొల్పేందుకు బీజేపీకి తెలంగాణ ప్రజలు మద్దతునివ్వాలని కోరుతూ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ రాజకీయ తీర్మానం ప్రవేశపెట్టారు. 'మహమూద్ అలీ హోంమంత్రిగా ఉండటానికి అనర్హుడు. పోలీస్ చెంప పగలగొడతాడా?' అంటూ తీర్మానంలో ప్రశ్నించారు. సమావేశం ప్రారంభానికి ముందు జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా కాలేజీ ప్రాంగణంలో మొక్క నాటారు. జాతీయ ప్రధాన కార్యదర్శులు తరుణ్ ఛుగ్, సునీల్‌బన్సల్, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా.కె.లక్ష్మణ్, రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, రాష్ట్ర పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాశ్ జవదేకర్, నేతలు అర్వింద్ మీనన్, నల్లు ఇంద్రసేనారెడ్డి, సోయం బాపూరావు, పి.మురళీధర్‌రావు, వివేక్ వెంకటస్వామి, ఏపీ జితేందర్ రెడ్డి, గరికపాటి మోహన్‌రావు, పొంగులేటి సుధాకరరెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మర్రి శశిధర్‌రెడ్డి, రవీంద్రనాయక్, ఎవీఎన్ రెడ్డి, చిత్తరంజన్‌దాస్, డా.కాసం వెంకటేశ్వర్లు, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆ తార అస్తమయం వెనక...!



ఆసక్తి కలిగిస్తున్న భిన్న వాదనలు

అది 2009. అనంతాకాశంలో ఒక తార ఉన్నట్టుండి మాయమైంది. అది సైంటిస్టులను ఎంతగానో ఆశ్చర్యపరిచింది. నక్షత్రాలు మరణించడం వింతేమీ కాదు. అరుదు అంతకన్నా కాదు. కానీ అందుకు ఒక క్రమం ఉంటుంది. తమ జీవిత కాలంలో చివరి ఏడాదిలో అవి అత్యంత ప్రకాశవంతంగా మారతాయి. అనంతరం సూపర్ నోవాగా పిలిచే బ్రహ్మాండమైన పేలుడుకు లోనవుతాయి. అలా శక్తినంతా కోల్పోయి మరుగుజ్జు తారలుగా మిగిలిపోతాయి. నెమ్మదిగా అంతర్ధానం చెందుతాయి.

కానీ... సూర్యుని కంటే ఏకంగా 25 రెట్లు పెద్దదైన ఎన్6946– బీహెచ్1 అనే నక్షత్రం మాత్రం ఏదో మంత్రం వేసినట్టు ఉన్నపళంగా మాయమైపోయింది!

మనకు 2.2 కోట్ల కాంతి సంవత్సరాల దూరంలో ఉన్న అది కూడా తొలుత మరణానికి సిద్ధమయ్యే ఇతర తారల మాదిరిగానే 10 లక్షల సూర్యులకు సమాన తేజంతో వెలిగిపోయింది. దీన్ని గమనించిన సైంటిస్టులు, మరో సూపర్ నోవా చోటు చేసుకోనుందనే అనుకున్నారు. కానీ జరగకపోగా, అది వెలుగులన్నీ కోల్పోయింది. అలాగే క్రమంగా మాయమైపోయి ఆశ్చర్యానికి గురిచేసింది. దీనికి కారణాలపై ఇప్పుడు బోలెడంత చర్చ జరుగుతోంది.

కృష్ణబిలం మింగింది.. కాదు...

ఈ తార విచిత్ర అంతర్ధానాన్ని 'జరగని సూపర్ నోవా'గా అప్పట్లో కొందరు సైంటిస్టులు పిలిచారు. బహుశా ఆ నక్షత్రాన్ని ఏదో కృష్ణబిలం మింగేసిందని వారు ప్రతిపాదించారు. అలా అది కూడా కృష్ణబిలంగానే మారిందని సూత్రీకరించారు. ఆ ఉద్దేశంతోనే దాని పేరు చివరన బీహెచ్1 అని చేర్చారు. అయితే అది సరికాదని మరికొందరు సైంటిస్టులు తాజాగా వాదిస్తున్నారు. దీనికి సంబంధించి జేమ్స్ వెబ్ టెలిస్కోప్ ఇటీవల సేకరించిన పరిణామాల్ని విశ్లేషించిన మీదట ఆ వాదనకు బలం చేకూరుతోంది. బీహెచ్1 తార ఉన్న చోట అతి ప్రకాశవంతమైన పరారుణ కాంతిని జేమ్స్ వెబ్ గమనించింది. అది మూడు వేర్వేరు రకాల కాంతి అని కూడా చెబుతున్నారు. బహుశా పలు నక్షత్రాలు పరస్పరం కలిసిపోయి పెను తారగా మారాయనేందుకు ఇది నిదర్శనమని అంటున్నారు. కానీ సూపర్ నోవాగా మారకుండా అది ఎలా అంతర్ధానం అయిందన్న కీలక ప్రశ్నకు మాత్రం ఇంకా బదులు దొరకాల్సే ఉంది! - సాక్షి, నేషనల్ డెస్క్

ఇరాన్ హక్కుల యోధురాలికి నోబెల్ శాంతి

టెహ్రాన్ జైల్లో ఉన్న నర్గిస్ మొహమ్మదికి ప్రతిష్టాత్మక పురస్కారం ● జైలు నుంచే పోరాటం చేస్తున్న అలుపెరగని యోధురాలు

స్టాక్హోమ్: అత్యంత ప్రతిష్టాత్మకమైన నోబెల్ శాంతి పురస్కారం ఇరాన్కు చెందిన మానవ హక్కుల కార్యకర్త నర్గిస్ మొహమ్మదికి లభించింది. ఇరాన్లో మహిళల అణచివేత, మానవ హక్కులపై అవగాహన, అందరికీ స్వేచ్ఛ, మరణ శిక్ష రద్దు కోసం అలుపెరగకుండా ఆమె చేస్తున్న పోరాటానికి అత్యున్నత పురస్కారం దక్కింది. మహిళల కోసం జీవితాన్ని ధారపోసినందుకు నర్గిస్ను శాంతి పురస్కారానికి ఎంపిక చేసినట్టుగా నార్వే నోబెల్ కమిటీ ప్రకటించింది. ప్రస్తుతం ఆమె టెహ్రాన్లోని ఎవిన్ జైల్లో ఉన్నారు. ''నర్గిస్ చేసిన పోరాటం అత్యంత సాహసోపేతమైనది. మహిళా హక్కుల కోసం ఆమె తన వ్యక్తిగత జీవితాన్ని పణంగా పెట్టారు. ఇరాన్లో ఏడాదిగా సాగుతున్న మహిళా హక్కుల పోరాటానికి నోబెల్ శాంతి తొలి గుర్తింపు. జైలు నుంచే ఈ ఉద్యమానికి ఊపిరిలా మారిన వివాదరహితురాలైన నర్గిస్ మొహమ్మదికి నోబెల్ శాంతి బహుమతిని ప్రకటిస్తున్నాం'' అని కమిటీ చైర్ పర్సన్ బెరిట్ రెసి అండర్సన్ వెల్లడించారు. నోబెల్ శాంతి పురస్కారం కింద ఆమెకు 1.1 కోట్ల స్వీడిష్ క్రోనర్లు (దాదాపుగా 10 లక్షల డాలర్లు) నగదు బహుమానం, 18 కేరట్ గోల్డ్ మెడల్, డిప్లామా లభిస్తుంది,. డిసెంబర్లో జరిగే అవార్డు ప్రదానోత్సవం సమయానికి నర్గిస్ జైలు నుంచి విడుదల కావాలని, స్వయంగా పురస్కారాన్ని అందుకోవాలని నోబెల్ కమిటీ ఆశాభావం వ్యక్తం చేసింది. ఇరాన్లో మహిళా హక్కుల ఉద్యమానికి అంతర్జాతీయ గుర్తింపు రావడంతో తనపై మరింత బాధ్యత పెరిగిందని నర్గిస్ జైలు నుంచే న్యూయార్క్ టైమ్స్కి ఒక ప్రకటన పంపారు. ''నోబెల్ శాంతి పుర స్కారం నాలో మరింత స్ఫూర్తిని నింపింది. మహిళల సమస్యలు పరిష్కారమవుతాయన్న ఆశ పెరిగింది. ఇరాన్లో మార్పు కోసం పోరాడుతున్న వారిలో మరింత బలం పెరుగుతుంది. ఇక విజయం సమీపంలో ఉంది'' అని ఆ ప్రకటనలో ఆశాభావం వ్యక్తం చేశారు.



13 సార్లు అరెస్ట్

హక్కుల పోరాటంలో ఎన్ని సవాళ్లు ఎదురైనా నర్గిస్ వెనుకంజ వేయలేదు. ఇరాన్ ప్రభుత్వం ఆమెను ఇప్పటికి 13 సార్లు అరెస్ట్ చేసింది. అయిదు సార్లు దోషిగా నిర్ధారించింది. 31 ఏళ్ల జైలు శిక్ష విధించింది. 154 సార్లు కొరడా దెబ్బల శిక్ష విధించింది. అయినా ఆమె అదరలేదు. బెదరలేదు. 1998లో ఇరాన్ ప్రభుత్వాన్ని విమర్శించి తొలిసారి అరెస్టయి ఏడాది జైల్లో ఉన్నారు. హ్యూమన్ రైట్స్ సంస్థలో చేరి మళ్లీ అరెస్టయ్యారు. 2011లో జాతి విద్రోహ కార్యకలాపాలు సాగిస్తున్నారంటూ మరోసారి అరెస్ట్ చేశారు. ఇరాన్లో మరణ శిక్షలకు వ్యతిరేకంగా గళమెత్తినందుకు 2015లో జైలుకు పంపారు. ఇలా తన జీవితంలో సగభాగం ఆమె జైల్లోనే గడుపుతున్నారు.

అన్నీ కోల్పోయినా....

సంప్రదాయం పేరుతో మహిళలపై ఆంక్షలు విధిస్తూ హిజాబ్ కాస్త పక్కకి జరిగినా జైలు పాల్జేయడమో, కొట్టి చంపేయడమో చేసే దేశంలో పుట్టి మహిళా హక్కుల కోసం జీవితాన్ని ధారపోస్తున్న నర్గిస్ అత్యున్నత పురస్కారాన్ని ప్రకటించిన సమయంలో నాలుగ్గోడల మధ్య బందీగా ఉన్నారు. వ్యక్తిగత జీవితాన్ని, ఆరోగ్యాన్ని, స్వేచ్ఛని పణంగా పెట్టి 51 ఏళ్ల వయసున్న నర్గిస్ ఇంకా మార్పు కోసం పోరాటం చేస్తూనే ఉన్నారు. ''ప్రభుత్వం నన్ను ఎంత అణగదొక్కాలని చూస్తే, ఎంతగా శిక్షిస్తే నాలో పోరాట స్ఫూర్తి అంతకంతకూ పెరుగుతుంది. దేశంలో మహిళలు స్వేచ్ఛా వాయువులు పీల్చుకునే వరకు ఈ పోరాటం ఆగదు'' అని నర్గిస్ పలు ఇంటర్వ్యూల్లో చెప్పారు. ఇరాన్లోని జంజన్ పట్టణంలో 1972, ఏప్రిల్ 21న ఒక మధ్య తరగతి కుటుంబంలో జన్మించారు. ఆమె తండ్రి ఒక రైతు. తల్లి ఒక రాజకీయ కుటుంబం నుంచి వచ్చారు. 1979లో ఇరాన్ విప్లవం సమయంలో రాచరికం రద్దయిందో అప్పుడే నర్గిస్ తల్లి సోదరుడు, మరో ఇద్దరు కుటుంబ సభ్యులు జైలు పాలయ్యారు. వారిని ప్రతీ వారం కలుసుకోవడానికి తల్లితో పాటు జైలుకు వెళ్లే చిన్నారి నర్గిస్కు తమ బతుకులు ఎందుకంత అణచివేతకు గురవుతున్నాయో అర్థం కాక తీవ్ర సంఘర్షణకు లోనయ్యేది. అది చూసి ఆమె తల్లి తనకున్న అనుభవంతో రాజకీయాలు, వ్యవస్థల జోలికి వెళ్లొద్దని హితవు చెప్పింది. అయినప్పటికీ నర్గిస్లో చిన్నప్పట్నుంచి ధైర్యసాహసాలు, పోరాట స్ఫూర్తి ఆమెను హక్కుల పోరాటంలో ముందుకు నడిపించాయి. ఇంజనీరింగ్ విద్య పూర్తి చేసిన తర్వాత ఆమె కొన్నాళ్లు వార్తాపత్రికలకు కాలమిస్ట్గా చేశారు. నోబెల్ శాంతి బహుమతి గ్రహీత షిరిన్ ఎబది స్థాపించిన డిఫెండర్స్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ సెంటర్లో

31 ఏళ్ల జైలు శిక్ష

2003లో చేరిన ఆమె ప్రస్తుతం ఉపాధ్యక్షురాలిగా వ్యవహరిస్తున్నారు. కాలేజీలో సహచర విద్యార్థిగా పరిచయమైన ప్రఖ్యాత సామాజిక కార్యకర్త తాఘీ రెహమనీను ఆమె ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి ఇద్దరు కవల పిల్లలు ఉన్నారు. ప్రస్తుతం రెహమనీ తన పిల్లలతో కలిసి పారిస్కు ప్రవాసం వెళ్లిపోయారు. తన భర్త, పిల్లలతో మాట్లాడి, ప్రేమతో వారిని అక్కున చేర్చుకొని ఆమెకు ఏళ్లు గడిచిపోయాయి.

జైలు నుంచే పోరాటం

జైలు నుంచి ఆమె ఎందరిలోనో ఉద్యమ స్ఫూర్తి రగిలిస్తున్నారు. రాజకీయ ఖైదీలు, మహిళా ఖైదీలపై జరుగుతున్న లైంగిక హింసకు వ్యతిరేకంగా జైల్లోనే ఆమె ఉద్యమం ప్రారంభించారు. జైల్లో కూడా ఆమెకు మద్దతుదారులు పెరగడంతో అధికారులు ఆమెపై పలు ఆంక్షలు విధించారు. అయినా ఆమె బెదరలేదు. జైలు నుంచే పలు వ్యాసాలు న్యూయార్క్ టైమ్స్, బీబీసీ వంటి వాటికి పంపించారు. 2022 సెప్టెంబర్లో హిజాబ్ ధరించనందుకు మాసా అమిని అనే యువతిని ఇరాన్ పోలీసులు అరెస్ట్ చేయగా కస్టడీలో తీవ్ర గాయాలపాలై ఆమె మరణించిన విషయం తెలిసిందే. దీంతో ఇరాన్లో భారీగా యువతీ యువకులు ఆందోళనలు చేపట్టి రోడ్లపైకి వచ్చినప్పుడు జైలు నుంచే ఆమె తన గళాన్ని వినిపించారు. పోరాడే వారిలో ఉద్యమ స్ఫూర్తిని రగిలించారు. తోటి మహిళా ఖైదీల అనుభవాలతో వైట్ టార్చర్ అనే పుస్తకాన్ని రాశారు. ప్రపంచంలో అత్యధికంగా ఉరిశిక్షలు విధించే ఇరాన్లో అత్యంత క్రూరమైన ఆ శిక్షను రద్దు చేసే వరకు తన పోరాటం ఆగదని నర్గిస్ ఎలుగెత్తి చాటుతున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

రెండేళ్లలో తీవ్రవాదానికి చరమగీతం: అమిత్ షా

న్యూఢిల్లీ: దేశంలో వామపక్ష తీవ్రవాదాన్ని రెండేళ్లలో పూర్తిగా నిర్మూలిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ధీమా వెలిబుచ్చారు. నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో మరణాలు, హింసాత్మక ఘటనలు 2022లో గత 4 దశాబ్దాల్లోకెల్లా అతి తక్కువగా నమోదయ్యాయని చెప్పారు. 'నక్సలిజం మానవత్వం పాలిట శాపం. దాన్ని అన్నివిధాలా నిర్మూలించేందుకు కట్టుబడి ఉన్నాం' అని అన్నారు. వామపక్ష తీవ్రవాద రాష్ట్రాల్లో పరిస్థితిపై ఆయన శుక్రవారం సమీక్ష జరిపారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డితో పాటు మహారాష్ట్ర, జార్ఖండ్ సీఎంలు కూడా ఇందులో పాల్గొన్నారు. 2015లో 'వామపక్ష తీవ్రవాదంపై జాతీయ విధానం, కార్యాచరణ ప్రణాళిక' అమల్లోకి వచ్చాక ఆ ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిస్థితి ఎంతో మెరుగుపడిందని ఉన్నతాధికారులు తెలిపారు. 2010తో పోలిస్తే నక్సల్స్ హింసలో పోలీసు, పౌర మరణాలు 90 శాతం తగ్గాయని వివరించారు. '2004–14 మధ్య 17,679 నక్సల్ సంబంధిత హింసా ఘటనలు, 6,984 మరణాలు సంభవించాయి. 2014–23 మధ్య 7,659 ఘటనలు, 2,020 మరణాలు నమోదయ్యాయి' అని పేర్కొన్నారు.


శుక్రవారం సిక్కింలోని రంగ్పో పట్టణంలో జల దిగ్బంధంలో ఇళ్లు

సిక్కిం వరదలు.. 26కు చేరిన మరణాలు

గ్యాంగ్టక్: సిక్కింలోని తీస్తా నదికి బుధవారం సంభవించిన ఆకస్మిక వరదల్లో గల్లంతైన వారి ఆచూకీ కోసం ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు నిర్విరామంగా గాలిస్తున్నాయి. ఇప్పటి దాకా 26 మృతదేహాలను వెలికితీశారు. ఇందులో ఏడుగురు జవాన్ల మృతదేహాలున్నాయి. బర్దంగ్ ఏరియాలో సంభవించిన వరదల్లో 23 మంది ఆర్మీ సిబ్బంది గల్లంతైన విషయం తెలిసిందే. జవాన్లు సహా మొత్తం 143 మంది జాడ తెలియాల్సి ఉంది. జల దిగ్బంధానికి గురైన మొత్తం 2,413 మందిని రక్షించి, సహాయక శిబిరాలకు తరలించామని అధికారులు చెప్పారు. బర్దంగ్ ప్రాంతంలో ఇసుక మేటను తొలగించి ఆయుధ డిపోను వెలికితీసినట్లు రక్షణ శాఖ తెలిపింది. అన్వేషణ కార్యకలాపాల్లో స్పెషల్ రాడార్లు, జాగిలాలను రప్పించామని తెలిపింది. సింగ్టమ్–బర్దంగ్ మధ్య ధ్వంసమైన రహదారిని వాహనాల రాకపోకలకు వీలుగా పునరుద్ధరించినట్లు తెలిపింది. ఇలా ఉండగా, రాష్ట్రానికి అవసరమైన సాయం అందజేస్తామని ప్రధాని మోదీ హామీ ఇచ్చారని సీఎం తమాంగ్ చెప్పారు. అడ్వాన్సుగా రూ.44.8 కోట్లు విడుదల చేస్తున్నట్లు హోం మంత్రి అమిత్ షా చెప్పారన్నారు. ఆకస్మిక వరద నష్టం అంచనాకు హోం శాఖ, ఇతర విభాగాల అధికారులతో కూడిన బృందాన్ని కూడా పంపుతామని అమిత్ షా తెలిపినట్లు సీఎం వెల్లడించారు.

రాష్ట్ర ప్రభుత్వాల విధాన నిర్ణయాలను అడ్డుకోలేం


న్యూఢిల్లీ: రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొనే విధాన పరమైన నిర్ణయాలను అడ్డుకోలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. బిహార్ ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన కుల గణనకు సంబంధించిన తదుపరి సమాచారాన్ని బహిర్గతం చేయకుండా తాము నిరోధించలేమని వెల్లడించింది. కుల గణన డేటాను ఎందుకు ప్రచురించాల్సి వచ్చిందో చెప్పాలని బిహార్ ప్రభుత్వాన్ని న్యాయస్థానం ప్రశ్నించింది. కుల గణన చేపట్టే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందో లేదో పరిశీలిస్తామని తెలియజేసింది. బిహార్లో కుల గణనకు అనుమతి ఇస్తూ ఆగస్టు 1న బిహార్ హైకోర్టు జారీచేసిన ఉత్తర్వును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎస్వీఎన్ భట్టీతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. కులాల వారీగా సర్వేకు సంబంధించిన కొన్ని వివరాలను ప్రభుత్వం ప్రచురించిందని, మిగిలిన వివరాలకు బయటపెట్టకుండా స్టే ఇవ్వాలని పిటిషనర్లు విజ్ఞప్తి చేయగా, ధర్మాసనం అందుకు నిరాకరించింది. విచారణను వచ్చే ఏడాది జనవరికి వాయిదా వేసింది.

టెక్నాలజీ అత్యవసరం.. అందిపుచ్చుకోవాల్సిందే

హైకోర్టులకు, న్యాయమూర్తులకు సీజేఐ సూచన



న్యూఢిల్లీ: పలు హైకోర్టుల్లో వర్చువల్ విచారణల శాతం తక్కువగా ఉండటంపై సుప్రీంకోర్టు విస్మయం వెలిబుచ్చింది. అన్ని కోర్టులు, దేశంలో ప్రతి జడ్జీ టెక్నాలజీని వీలైనంత త్వరగా అందిపుచ్చుకోవాల్సిందేనని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ స్పష్టం చేశారు. పంజాబ్, హరియాణా హైకోర్టు విచారణల్లో వీడియో కాన్ఫరెన్స్ వాడకాన్ని పూర్తిగా పక్కన పెట్టిందంటూ దాఖలైన పిటిషన్పై సీజేఐ సారథ్యంలోని ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. న్యాయమూర్తులు టెక్నాలజీ వాడకంలో నిష్ణాతులా కాదా అన్నది కాదు సమస్య. కానీ వారికి దాని వాడకం తెలిసి ఉండాలి. లేదంటే అది అలవాటయ్యేలా శిక్షణ తీసుకోవాలి. సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు కూడా ఇది వర్తిస్తుంది. టెక్నాలజీ వాడకం మీద అవగాహన కోసం వాళ్లు ప్రత్యేక కేంద్రాలకు వెళ్లి శిక్షణ తీసుకున్నారు' అని పేర్కొంది. నేటి పరిస్థితుల్లో టెక్నాలజీ వాడకం ఇంకెంతమాత్రమూ ఆప్షన్ కాదని, అత్యవసర పనిముట్టుగా మారిందని జస్టిస్ చంద్రచూడ్ అన్నారు. ఈ మార్పు దిశగా లాయర్లను కూడా సిద్ధం చేయక తప్పదని అభిప్రాయపడ్డారు. బాంబే హైకోర్టులో వీడియో కాన్ఫరెన్స్లకు ఉద్దేశించిన స్క్రీన్స్ను తీసేయడం దారుణమన్నారు. ఇకపై మన దేశంలో జడ్జి కావాలంటే టెక్ ఫ్రెండ్లీగా ఉండాల్సిందేనని స్పష్టం చేశారు.


అమెరికాలోనే మొట్ట మొదటిసారిగా టెక్సాస్ రాష్ట్రం హ్యూస్టన్లో ఇటీవల గాంధీ మ్యూజియంను ప్రారంభించారు. ఈ మ్యూజియం ఆవరణలో నెలకొల్పిన మహాత్ముని విగ్రహమిది.

'మహాదేవ్' లూటీ రోజుకు రూ.200 కోట్లు

- దుబాయ్ కేంద్రంగా భారీ బెట్టింగ్ దందా
- బాలీవుడ్ నటుల ప్రమేయంపై ఈడీ దర్యాప్తు

మహాదేవ్ ఆన్లైన్ బెట్టింగ్ యాప్.. ప్రస్తుతం దేశవ్యాప్తంగా సంచలనాత్మకంగా మారిన వ్యవహారమిది. బాలీవుడ్ ప్రముఖ నటులకు ఇందులో భాగస్వామ్యం ఉన్నట్లు కేంద్ర దర్యాప్తు సంస్థలు గుర్తించడం తీవ్ర కలకలం సృష్టిస్తోంది. యాప్పై దర్యాప్తులో భాగంగా ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్(ఈడీ) గత నెలలో భారత్లో 39 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించింది. రూ.417 కోట్ల విలువైన బంగారు బిస్కెట్లు, ఆభరణాలు, నగదు స్వాధీనం చేసుకుంది. యాప్ కోసం ప్రచారం చేసిన బాలీవుడ్ నటులు రణబీర్ కపూర్, శ్రద్ధ కపూర్కు ఈడీ నోటీసులు జారీ చేసింది. విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. ఈ కేసులో ఇప్పటికే నలుగురి నిందితులను అదుపులోకి తీసుకుంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఈ యాప్ బాగోతం బయటపడింది.

- ఛత్తీస్గఢ్లోని భిలాయి పట్టణానికి చెందిన సౌరభ్ చంద్రశేఖర్, రవి ఉప్పల్ దుబాయ్లో మకాం వేసి, మహాదేవ్ ఆన్లైన్ బెట్టింగ్ యాప్ను ఆపరేట్ చేస్తున్నారు.
- కొత్తకొత్త వెబ్సైట్లు, చాటింగ్ యాప్ల ద్వారా కస్టమర్లను ఆకర్షిస్తారు. ఆన్లైన్లో బెట్టింగ్ల్లో భారీగా లాభాలు వస్తాయంటూ సోషల్ మీడియాలో ప్రచారం చేస్తారు.



- తమ వలలో చిక్కిన కస్టమర్లతో వాట్సాప్లో గ్రూప్లు ఏర్పాటు చేస్తారు. వారితో నేరుగా ఫోన్లలో మాట్లాడరు. వాట్సాప్ ద్వారానే సంప్రదిస్తుంటారు.
- కస్టమర్లను బెట్టింగ్ యాప్లో సభ్యులుగా చేర్చి, యూజర్ ఐడీ, పాస్వర్డ్ ఇస్తారు. తర్వాత వారితో నగదు జమ చేయించుకుంటారు. ఈ వ్యవహారాన్ని మహాదేవ్ కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్లు పర్యవేక్షిస్తుంటారు. ఈ డబ్బంతా తప్పుడు పత్రాలతో తెరిచిన యాప్ నిర్వాహకుల బినామీ బ్యాంకు ఖాతాల్లోకి చేరుతుంది.
- యాప్లో బెట్టింగ్లు కాస్తే తొలుత లాభాలు వచ్చినట్లు నమ్మిస్తారు. దాంతో కస్టమర్లో ఆశ పెరిగిపోతుంది. పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టేలా అతడిని ప్రేరేపిస్తారు. చివరకు అదంతా నష్టపోయేలా బెట్టింగ్ యాప్లో రిగ్గింగ్ చేస్తారు. మళ్లీ కొత్త బకరా కోసం వేట మొదలవుతుంది.
- మహాదేవ్ బెట్టింగ్ యాప్ సంపాదన ప్రతిరోజూ రూ.200 కోట్లు ఉంటుందని ఈడీ దర్యాప్తులో తేలింది.
- భారత్, మలేసియా, థాయ్లాండ్, యూఏఈలో మహాదేవ్ యాప్నకు వందలాది కాల్ సెంటర్లు ఉన్నాయి. ప్రధాన కార్యాలయం యూఏఈలో ఉంది. నాలుగు దేశాల్లో పెద్ద సంఖ్యలో బినామీ బ్యాంకు ఖాతాలు తెరిచారు.
- భారత్లోని 30 కాల్ సెంటర్లను అనిల్ దమానీ, సునీల్ దమానీ నిర్వహిస్తున్నారు. వీరిద్దరిని ఈడీ అరెస్టు చేసింది.
- బెట్టింగ్ యాప్ జోలికి రాకుండా ఉండడానికి పోలీసులకు, రాజకీయ నాయకులకు, ప్రభుత్వ అధికారులకు నిర్వాహకులు హవాలా మార్గాల్లో లంచాలు ఇచ్చినట్లు వెల్లడయ్యింది.
- బెట్టింగ్ సిండికేట్ నడిపిస్తున్న ఓ యాప్ను బాలీవుడ్ హీరో రణబీర్ కపూర్ ప్రమోట్ చేస్తున్నట్లు ఈడీ చెబుతోంది.
- ఈ ఏడాది ఫిబ్రవరిలో దుబాయ్లో ఓ పెళ్లి నిర్వహణకు రూ.200 కోట్లు నగదు రూపంలో చెల్లించారు. దీనిపై దర్యాప్తు చేయగా మహాదేవ్ బెట్టింగ్ యాప్ గురించి బయటపడింది. ఈ పెళ్లిలో రణబీర్ కపూర్, శ్రద్ధాకపూర్, కపిల్ శర్మ, హీనా ఖాన్తో పాటు మరికొందరు బాలీవుడ్ నటులు ప్రదర్శన ఇచ్చారు. వారికి హవాలా మార్గంలో రూ.కోట్లలో చెల్లింపులు చేసినట్లు తేలింది. పెళ్లిలో ప్రదర్శన ఇవ్వడానికి 17 మంది బాలీవుడ్ సెలబ్రిటీలను చార్టర్డ్ విమానంలో దుబాయ్కి తీసుకెళ్లారని ఈడీ అధికారులు వెల్లడించారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

కెనడా దౌత్యవేత్తలు వెనక్కు!

టొరంటో: ఖలిస్తానీ వేర్పాటువాది హర్దీప్ సింగ్ నిజ్జర్ మృతి వివాదం రేపిన మంటల నేపథ్యంలో భారత్లోని తమ దౌత్యవేత్తల సంఖ్యను కెనడా బాగా తగ్గించింది. ఢిల్లీ వెలుపల పని చేస్తున్న వారిని చాలావరకు కౌలాలంపూర్ (మలేసియా), సింగపూర్కు తరలించింది. ఆ దేశ ప్రైవేట్ వార్తా చానల్ ఒకటి శుక్రవారం ఈ మేరకు పేర్కొంది. అక్టోబర్ 10లోగా వారి సంఖ్యను కెనడాలోని భారత దౌత్యవేత్తల సంఖ్యకు సమానంగా తగ్గించాలని కేంద్రం ఇటీవలే ఆదేశించడం తెలిసిందే. ఆ ఆదేశాలను పాటించి తీరాల్సిందేనని గురువారం కూడా పునరుద్ఘాటించింది. ఈ విషయంలో ఎలాంటి సమీక్షకూ, పునరాలోచనకూ తావు లేదని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి అరిందం బాగ్చి చెప్పకనే చెప్పారు కూడా. నిజ్జర్ హత్య వెనక భారత్ ప్రమేయం ఉందని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో చేసిన ఆరోపణలు ఇరుదేశాల మధ్య తీవ్ర స్థాయిలో మంటలు రేపడం తెలిసిందే. ఆ తర్వాత భారత సీనియర్ దౌత్యవేత్తను కెనడా బహిష్కరించడంతో వివాదం మరింత ముదిరింది. వెంటనే భారత్ కూడా కెనడా సీనియర్ దౌత్యవేత్తను పంపించేసింది. ప్రస్తుతం భారత్లో కెనడా దౌత్యవేత్తలు 60 మంది దాకా ఉన్నారు. వారిలో కనీసం 40 మందిని పంపించేయాలని భారత్ పేర్కొన్నట్టు సమాచారం.

'ఉచితాల'పై సుప్రీంకోర్టు నోటీసు

న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్, రాజస్తాన్లో త్వరలో శాసనసభ ఎన్నికలు జరుగనున్నాయి. ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు ఓటర్లపై ఉచితాల వల విసురుతున్నాయి. మళ్లీ అధికారం అప్పగిస్తే ఉచిత పథకాలు అమలు చేస్తామని, ఎన్నో ప్రయోజనాలు చేకూరుస్తామని హామీ ఇస్తున్నాయి. ప్రజాధనాన్ని దుర్వినియోగం అవుతోందని, ఈ ఉచిత పథకాలను అడ్డుకోవాలని కోరుతూ భట్టూలాల్ జైన్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. మధ్యప్రదేశ్, రాజస్తాన్ ప్రభుత్వాలతోపాటు కేంద్ర ప్రభుత్వానికి, ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా స్పందించాలని ఆదేశించింది.

సీఐసీ పోస్టుకు 76 దరఖాస్తులు

న్యూఢిల్లీ: ముఖ్య సమాచార కమిషనర్(సీఐసీ) పదవిని భర్తీ చేయడానికి కేంద్ర ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించగా, ఇప్పటిదాకా 76 దరఖాస్తులు వచ్చాయి. సీఐసీ వైకే సిన్హా పదవీ కాలం మంగళవారం ముగిసింది. ఈ పోస్టు కోసం ముగ్గురు సమాచార కమిషనర్లు హీరాలాల్ సమారియా, సరోజ్ పున్హానీ, ఉదయ్ మహూర్కర్ పోటీ పడుతున్నారు. మాజీ సమాచార కమిషనర్ అమిత్ పాండోవ్ కూడా దరఖాస్తు చేసుకున్నారు.

ఆ కంటెంట్ తొలగించకుంటే చర్యలే

న్యూఢిల్లీ: సోషల్ మీడియాలో బాలలపై లైంగిక వేధింపుల కంటెంట్ వ్యాప్తిపై కేంద్రం కన్నెర్రజేసింది. దాన్ని తక్షణం తొలగించాల్సిందేనని స్పష్టం చేసింది. సోషల్ మీడియా వేదికలు ఎక్స్, యూట్యూబ్, టెలిగ్రాంలకు ఈ మేరకు శుక్రవారం నోటీసులిచ్చింది. 'భారత ఇంటర్నెట్ పరిధిలో వాటిని తక్షణం శాశ్వతంగా తొలగించండి. లేదా డిజెబుల్ చేయండి' అని ఆదేశించింది. లేదంటే ఐటీ చట్టంలో 79వ సెక్షన్ కింద వారికి కల్పించిన రక్షణను తొలగిస్తామని ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ హెచ్చరించారు. నిబంధనల మేరకు పౌరులకు నమ్మకమూ, సురక్షితమైన ఇంటర్నెట్ను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

రైలులో మద్యం మత్తులో...

ఝాన్సీ: ఇటీవల విమానంలో ఓ వ్యక్తి మద్యం మత్తులో తోటి ప్రయాణికులపై మూత్ర విసర్జన చేసిన సంఘటన గురించి విన్నాం. అలాంటి ఘటనపై ఉత్తరప్రదేశ్లో రైలులో జరిగింది. 19 ఏళ్ల రితేశ్ సంపర్క్ క్రాంతి ఎక్స్ప్రెస్ ఏసీ కంపార్ట్మెంట్లో ప్రయాణిస్తూ కింది బెర్తుపై నిద్రిస్తున్న వృద్ధ దంపతులపై మద్యం మత్తులో మూత్ర విసర్జన చేశాడు. అతడిని అరెస్టు చేశామని ఆర్పీఎఫ్ పోలీసులు శుక్రవారం తెలిపారు. అయితే, అతడు ఉద్దేశపూర్వకంగా ఈ పని చేయలేదని తేలినట్లు చెప్పారు. మూత్ర విసర్జన ఘటన జరగ్గానే దంపతులు రైలులో ఉన్న టీటీఈకి ఫిర్యాదు చేశారు టీటీఈ ఝాన్సీ రైల్వే స్టేషన్కు సమాచారం చేరవేశాడు. రైలు ఝాన్సీ స్టేషన్కు చేరుకోగా పోలీసులు రితేశ్ను అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేశారు. రైల్వే చట్టం ప్రకారం జరిమానా చెల్లించిన రితేశ్ను విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు.

భవనంలో మంటలు.. ఏడుగురు మృతి

ముంబై: ముంబైలోని ఓ నివాస భవనంలో శుక్రవారం వేకువజామున చెలరేగిన మంటల్లో ఇద్దరు చిన్నారులు సహా ఏడుగురు మృతి చెందారు. మరో 68 మంది గాయపడ్డారు. గోరెగావ్ వెస్ట్లోని ఏడంతస్తుల నివాస భవనంలో తెల్లవారు జామున 3 గంటల సమయంలో మంటలు ప్రారంభమయ్యాయి. సమాచారం అందుకుని ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకునే సరికి అగ్ని కీలలు భవనాన్నంతటినీ చుట్టుముట్టాయి. పార్కింగ్ ప్లేస్లోని దుకాణాలు, ద్విచక్ర వాహనాలతోపాటు, భారీగా నిల్వ ఉంచిన పాత దుస్తులు తగులబడిపోయాయి. వివిధ అంతస్తులతోపాటు టెర్రస్పై చిక్కుకున్న సుమారు 30 మందిని ఫైర్ సిబ్బంది కాపాడారు. గాయపడిన వారిని ఆస్పత్రులకు తరలించారు. ఆస్పత్రుల్లో ఒక మహిళ, ఇద్దరు చిన్నారులు సహా ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. వీరంతా ఊపిరాడకనే చనిపోయినట్లు అధికారులు తెలిపారు. గాయపడిన 68 మందిలో అయిదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

అమెరికాలో భారత సంతతి దంపతులు, ఇద్దరు చిన్నారులు హత్య

న్యూయార్క్: అమెరికాలోని న్యూజెర్సీలో భారత సంతతికి చెందిన దంపతులు, వారి ఇద్దరు చిన్నారులు హత్యకు గురయ్యారు. తేజ్ ప్రతాప్ సింగ్(43), సోనాల్ పరిహార్(42), వారి పదేళ్ల కొడుకు ఆయుష్, ఆరేళ్ల కూతురు ఆరీలు ప్లెయిన్స్బొరోలోని వారి సొంతింట్లోనే విగతజీవులై రక్తపు మడుగులో కనిపించారని పోలీసులు తెలిపారు. ఐటీ నిపుణులుగా పనిచేస్తున్న సింగ్ దంపతులు 2018లో సొంతింటిని కొనుక్కున్నారని బంధువులు తెలిపారు. ఈ నెల 4న సాయంత్రం తమ ఫోన్కాల్కు సింగ్ దంపతులు స్పందించడం లేదంటూ వారి బంధువొకరు అధికారులను అలర్ట్ చేశారు. పోలీసులు అక్కడికి వెళ్లి చూడగా విషయం బయటపడింది. బుధవారం రాత్రి వారు హత్యకు గురై ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. తేజ్ ప్రతాప్ సింగ్ సొంతూరు యూపీలోని జలౌన్ అని తెలిసింది.

ఖర్గే, రాహుల్ గాంధీతో శరద్ పవార్ భేటీ

న్యూఢిల్లీ: నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) అధినేత శరద్ పవార్ శుక్రవారం ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఆ పార్టీ సీనియర్ నేత రాహుల్ గాంధీతో సమావేశమయ్యారు. ప్రస్తుత రాజకీయ పరిణామాలపై వారు చర్చించుకున్నారు. విపక్ష 'ఇండియా' కూటమి తదుపరి కార్యాచరణపై అభిప్రాయాలు పంచుకున్నారు. దాదాపు 40 నిమిషాలపాటు ఈ సమావేశం జరిగింది. ఇండియా కూటమి చివరి సమావేశం ఆగస్టు 31, సెప్టెంబర్ 1న ముంబైలో జరిగింది. త్వరలోనే కూటమి నేతలంతా మరోసారి భేటీ కావాలని పవార్, ఖర్గే, రాహుల్ గాంధీ అభిప్రాయపడ్డారు.

టీచర్పై కాల్పులు.. సోషల్ మీడియాలో పోస్టింగ్

ఆగ్రా(యూపీ): కోచింగ్ సెంటర్ టీచర్పై అకారణంగా కోపం పెంచుకున్న ఇద్దరు విద్యార్థులు తుపాకీతో ఆయనపై కాల్పులు జరిపారు. మరోసారి మరిన్ని బుల్లెట్లు దించుతామని సోషల్ మీడియాలో హెచ్చరించారు. ఆగ్రాలోని ఖండోలిలో చోటుచేసుకుంది. సుమిత్ సింగ్ గతంలో ఓ కోచింగ్ సెంటర్లో పనిచేశారు. ఆయన వద్ద చదువుకున్న 16, 18 ఏళ్ల ఇద్దరు విద్యార్థులు ఓ బాలికతో మాట్లాడుతుండగా సుమిత్ సోదరుడు తరుణ్ అడ్డుకున్నారు. దీనిపై వారు కోపం పెంచుకుని గురువారం సుమిత్కు ఫోన్ చేసి, కోచింగ్ సెంటర్కు రావాలని కోరారు. రాగానే తెచ్చుకున్న తుపాకీతో సుమిత్ కాలిపై కాల్చారు. అనంతరం సోషల్ మీడియాలో ఓ వీడియోను పోస్ట్ చేశారు. అందులో 'గ్యాంగ్ ఆఫ్ వాసేపూర్' సినిమాలోని నటుల్లా పోజులు పెట్టి, ప్రస్తుతానికి ఒక్క బుల్లెట్టే కాల్చామని, ఆరు నెల్ల తర్వాత మిగతా 39 బుల్లెట్లనూ సుమిత్ శరీరంలోకి దించుతామంటూ హెచ్చరికలు చేశారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.

సాక్షి
హైదరాబాద్
శనివారం, 7, అక్టోబర్, 2023





న్యూస్‌రీల్

పటాన్‌చెరు-కోఠి లేడీస్ స్పెషల్ బస్సులు

సాక్షి, సిటీబ్యూరో: పటాన్‌చెరు-కోఠి మధ్య (రూట్ 222ఏ) ఉదయం, సాయంత్రం మహిళా ప్రయాణికుల కోసం రెండు లేడీస్ స్పెషల్ ట్రిప్పులు నడుపనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ నెల 9వ తేదీ నుంచి ఈ సర్వీసులు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు పటాన్‌చెరు-కోఠికి ఉదయం 8.41 గంటలకు బయలుదేరుతుంది. కోఠి-పటాన్‌చెరు లేడీస్ స్పెషల్ బస్సు సాయంత్రం 5 గంటలకు బయలుదేరుతుంది. ఈ బస్సులు లింగంపల్లి, ఆల్విన్‌కాలనీ, కొండాపూర్, హైటెక్‌సిటీ, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్, ఎల్వీప్రసాద్ ఇన్‌స్టిట్యూట్, పంజగుట్ట, బంజారాహిల్స్ రోడ్ నెంబర్-1, మాసాబ్‌ట్యాంక్, లక్డీకాపూల్ తదితర ప్రాంతాల మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

'పీజీ' ప్రవేశాలకు కౌన్సెలింగ్

ఉస్మానియా యూనివర్సిటీ: టీఎస్‌సీపీజీఈటీ-2023లో భాగంగా రాష్ట్రంలో ఓయూతో ఇతర వర్సిటీలలో ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ తదితర పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు రెండో విడత ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌ను శుక్రవారం ప్రారంభించినట్లు కన్వీనర్ ప్రొ.పాండురంగారెడ్డి తెలిపారు. పీజీ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు ఈ నెల 12 వరకు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.



పాక్ షాన్.. డచ్ క్రేజ్

భాగ్యనగరంలో జరిగిన వన్డే ప్రపంచకప్ క్రికెట్ మ్యాచ్‌కు శుక్రవారం మిశ్రమ స్పందన లభించింది. భారత జట్టు మ్యాచ్ కాకపోవడంతో సహజంగానే ఎక్కువ మంది మ్యాచ్‌కు దూరంగా ఉన్నారు. ప్రత్యేకంగా ఒకే టీమ్ అభిమానులంటూ ఎవరూ లేకపోవడంతో ఇరు జట్లకూ ప్రేక్షకుల నుంచి మద్దతు లభించింది. మంచి షాట్, బౌండరీ వచ్చినప్పుడల్లా వారు చప్పట్లతో ఉత్సాహపరిచారు. మ్యాచ్ పాకిస్తాన్, నెదర్లాండ్స్ మధ్యే అయినా... కొంత మంది ప్రేక్షకులు టీమిండియా జెర్సీలు ధరించి వచ్చారు. వీసా సమస్యలతో పాకిస్తాన్ నుంచి ఆ జట్టు అభిమానులెవరూ రాలేదు. న్యూయార్క్ నుంచి వచ్చిన ఒక కుటుంబం, ఎన్నో ఏళ్లుగా పాక్ వీరాభిమాని అయిన 'చికాగో చాచా' తమ టీమ్‌కు మద్దతునిస్తూ కనిపించారు. ఫ్యాన్స్‌లో కొందరు తాము జమ్మూ కశ్మీర్ నుంచి ఈ మ్యాచ్ కోసమే హైదరాబాద్‌కు వచ్చినట్లు చెప్పారు. హెచ్‌సీఏ లెక్కల ప్రకారం దాదాపు 10 వేల మంది ప్రేక్షకులు మ్యాచ్‌కు హాజరయ్యారు. ఇరు జట్లను ప్రోత్సహించేందుకు నిర్వాహకులు ఏర్పాటు చేసిన భారీ జెండాలను హెచ్‌సీఏ సిబ్బంది ఊపుతూ కనిపించారు. వాటిపై 'పాకిస్తాన్ కీ షాన్, దాజిల్ డచ్' అనే నినాదాలు రాసి ఉన్నాయి.

–సాక్షి, హైదరాబాద్









నయా రూట్

మేడ్చల్ టూ లింగంపల్లి...

- నాలుగు సర్వీసులతో ఎంఎంటీఎస్ సేవలు ప్రారంభం
- శివార్లకు ఎంఎంటీఎస్ విస్తరణ
- సమయపాలనలో మార్పులు
- వందేభారత్ కోసం స్పెషల్ సర్వీసులు

సాక్షి, సిటీబ్యూరో: ఎంఎంటీఎస్ రైలు కొత్త రూట్ అందుబాటులోకి వచ్చింది. రెండోదశ విస్తరణలో భాగంగా ఇప్పటికే పలు మార్గాల్లో సర్వీసులను ప్రవేశపెట్టిన దక్షిణమధ్య రైల్వే తాజాగా మేడ్చల్ నుంచి లింగంపల్లి, మేడ్చల్ నుంచి నాంపల్లి వరకు రెండు కొత్త మార్గాల్లో ఎంఎంటీఎస్ రైళ్లను ప్రవేశపెట్టింది. కొద్ది నెలల క్రితం ఉత్తర, దక్షిణాది ప్రాంతాల మధ్య కనెక్టివిటీని పెంచేందుకు మేడ్చల్ నుంచి ఉందానగర్ వరకు ఎంఎంటీఎస్ సేవలను విస్తరించగా, తాజాగా ఉత్తరం నుంచి పడమటికి కనెక్టివిటీ ఏర్పడింది. నగరశివార్లు, ఔటర్ చుట్టుపక్కల ఉన్న కాలనీలకు చెందిన ప్రజల రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఎంఎంటీఎస్ సేవల విస్తరణ చేపట్టినట్లు దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ తెలిపారు. సిటీ బస్సులు, మెట్రో కంటే అతి తక్కువ చార్జీలతో ఎంఎంటీఎస్ సేవలను విని యోగించుకోవచ్చునని చెప్పారు. అలాగే మేడ్చల్ వైపు ఉన్న వివిధ ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు నగరంలోని నాంపల్లికి చేరుకునేందుకు అనుగుణంగా కొత్త సర్వీసులు రాకపోకలు సాగించనున్నాయి. మరోవైపు ఎంఎంటీఎస్ సేవలపైన ప్రయాణికుల నుంచి వచ్చిన సలహాలు, సూచనల మేరకు సమయపాలనలో మార్పులు చేసినట్లు జీఎం పేర్కొన్నారు. కాచిగూడ నుంచి బెంగళూరుకు రాకపోకలు సాగించే వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు అనుగుణంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక సర్వీసులను నడుపనున్నారు.

నాలుగు సర్వీసులతో ప్రారంభం...

- ఉదయం, సాయంత్రం ప్రయాణికుల రద్దీకనుగుణంగా మేడ్చల్-లింగంపల్లి మధ్య ఎంఎంటీఎస్ రైళ్లు రాకపోకలు సాగిస్తాయి. ప్రస్తుతం నాలుగు సర్వీసులను ఈ రూట్‌లో ప్రారంభించారు. క్రమంగా సర్వీసులను పెంచనున్నారు.
- మేడ్చల్-లింగంపల్లి (47222) ఎంఎంటీఎస్ ఉదయం 7.20 కి బయలుదేరి 8.25కు లింగంపల్లికి చేరుకుంటుంది. తిరిగి 8.27 కే లింగంపల్లి నుంచి బయలుదేరి 9.20కి మేడ్చల్‌కు చేరుకుంటుంది.
- లింగంపల్లి-మేడ్చల్ (47225): ఉదయం 10.20 కి లింగంపల్లి నుంచి బయలుదేరి 11.08 గంటలకు మేడ్చల్‌కు చేరుకుంటుంది. 11.10 గంటలకు మేడ్చల్ నుంచి బయలుదేరి 12.10 కి లింగంపల్లికి చేరుకుంటుంది.
- మేడ్చల్-లింగంపల్లి (47225): మధ్యాహ్నం 3.30గంటలకు మేడ్చల్ నుంచి బయలుదేరి 4.40 గంటలకు లింగంపల్లికి చేరుకుంటుంది. సాయంత్రం 4.42 కు తిరిగి బయలుదేరి 5.40 కి మేడ్చల్‌కు చేరుకుంటుంది.
- లింగంపల్లి-మేడ్చల్ (47227): సాయంత్రం 6.10 గంటలకు లింగంపల్లి నుంచి బయలుదేరి 7.10 గంటలకు మేడ్చల్‌కు చేరుకుంటుంది. తిరిగి 7.12గంటలకు బయలుదేరి రాత్రి 8.15 గంటలకు లింగంపల్లికి చేరుకుంటుంది.

వందేభారత్‌కు ఎంఎంటీఎస్..

కాచిగూడ నుంచి బెంగళూరుకు ఇటీవల ప్రారంభించిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ కోసం ఎంఎంటీఎస్ స్పెషల్ సర్వీసులను ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి ప్రయాణికులు కాచిగూడకు చేరుకొనేందుకు ఈ సర్వీసులు అందుబాటులో ఉంటాయి. లింగంపల్లి నుంచి ఉందానగర్, ఫలక్‌నుమా నుంచి లింగంపల్లి వరకు ఈ రైళ్లను నడుపుతారు.

- లింగంపల్లి-ఉందానగర్ (47213): ఉదయం 4గంటలకు బయలుదేరి 5 గంటలకు కాచిగూడకు చేరుకుంటుంది. 5.02 గంటలకు తిరిగి బయలుదేరి 5.40 గంటలకు ఉందానగర్‌కు చేరుకుంటుంది.
- ఫలక్‌నుమా-లింగంపల్లి (47220): రాత్రి 11.15 గంటలకు ఫలక్‌నుమా నుంచి బయలుదేరి 11.29కి కాచిగూడకు చేరుకుంటుంది. 11.30 కి తిరిగి బయలుదేరి రాత్రి 12.45 గంటలకు లింగంపల్లికి చేరుకుంటుంది.
- ఉందానగర్-లింగంపల్లి, ఫలక్‌నుమా-లింగంపల్లి మధ్య రెగ్యులర్‌గా నడిచే మరో 6 సర్వీసుల వేళల్లో మార్పులు, చేర్పులు చేశారు.

మేడ్చల్-నాంపల్లి రూట్‌లో..

- మేడ్చల్-నాంపల్లి (47251): ఎంఎంటీఎస్ ఉదయం 11.50గంటలకు బయలుదేరి 12.48కి నాంపల్లికి చేరుకుంటుంది. తిరిగి 12.50 కి బయలుదేరి మధ్యాహ్నం 1.30కి మేడ్చల్‌కు చేరుకుంటుంది.
- నాంపల్లి-మేడ్చల్ (47244): మధ్యాహ్నం 1.40 కి బయలుదేరి 2.28 కి మేడ్చల్‌కు చేరుకుంటుంది. తిరిగి 2.30కి బయలుదేరి 3.20గంటలకు నాంపల్లికి చేరుకుంటుంది.

ఎలక్షన్ అలర్ట్!

ఎన్నికల కోసం పకడ్బందీ ఏర్పాట్లు

- మద్యం, ధనప్రవాహం లేకుండా చర్యలు
- సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ
- ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టుల ఏర్పాటు
- వివిధ విభాగాల ఉన్నతాధికారుల సమావేశం

సాక్షి, సిటీబ్యూరో: త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పూర్తి నిఘా ఉంచాలని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ సూచించారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో రిటర్నింగ్ అధికారులు, సెక్టోరల్ నోడల్ ఆఫీసర్లు, డిప్యూటీ కలెక్టర్లు, పోలీసు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, జీఎస్టీ, ఎస్ఎల్‌బీసీ, ఆర్‌బీఐ, కస్టమ్స్, ఎన్‌సీబీ అధికారులతో ఎన్నికల సన్నద్ధతపై నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్‌తో కలిసి రోనాల్డ్‌రాస్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మద్యం, ధనప్రవాహం లేకుండా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సమష్టిగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలన్నారు. మద్యం షాపుల వద్ద సీసీ కెమెరాల నిఘా ఉండాలని, వాటిని పోలీసు కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేయాలని సూచించారు. ఎక్సైజ్, పోలీస్, జీఎస్టీ విభాగాల అధికారులు జాయింట్‌గా ఆపరేషన్లు నిర్వహించాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా భారీగా జరిగే నగదు బదిలీలపై ఆర్‌బీఐ, ఎస్ఎల్‌బీసీలు తగిన చర్యలు తీసుకోవాలని, నిర్ణీత పరిమితికి మించి ఎక్కువ మొత్తంలో విత్‌డ్రా చేసే వారి వివరాలు సేకరించి విచారణ జరపాలన్నారు. నగదు తరలింపు, తదితరమైన వాటికి సంబంధించి వాహనాల కదలికలను జీపీఎస్ సిస్టమ్‌తో కమాండ్ కంట్రోల్‌రూమ్ నుంచి పరిశీలిస్తామని చెప్పారు. ఉచిత పంపిణీల సందర్భంగా కన్స్యూమర్స్ గూడ్స్‌పై కమర్షియల్ ట్యాక్స్ విభాగం నిఘా ఉండాలన్నారు. గంజాయి తరలింపు ప్రాంతాల గుర్తింపునకు ఎన్‌సీబీ (నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో) ద్వారా చర్యలు తీసుకోవాలని సూచించారు. సెక్టోరల్ అధికారులు విధులకు హాజరు కాని పక్షంలో వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సిందిగా రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. వల్నరబుల్ (సమస్యాత్మక) పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ చేసి, వాటిని మూడుసార్లు సందర్శించాలన్నారు.

ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టుల ఏర్పాటు: సీవీ ఆనంద్

పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ మాట్లాడుతూ, గుర్గావ్, ఢిల్లీ ఎయిర్‌పోర్టుల నుంచి అక్రమంగా తరలించే నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్ నియంత్రణకు అవసరమైన ప్రాంతాల్లో చెక్‌పాయింట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. గంజాయి నియంత్రణకు విజయవాడ రోడ్‌లోని పెద్దఅంబర్ పేట్, ఘట్‌కేసర్ సరిహద్దులు తదితర ప్రాంతాల్లో ఎన్‌సీబీ ఆపరేషన్లు నిర్వహించాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో ఎక్సైజ్, జీఎస్టీ, ఆర్టీఏ, పోలీసు విభాగాలతో ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తామన్నారు. త్వరలోనే నోటిఫికేషన్ వెలువడనున్నందున అందరూ అప్రమత్తంగా ఉండాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకమన్నారు. వల్నరబుల్ ప్రాంతాల మ్యాపింగ్‌లో అలసత్వం వహించవద్దని, సెక్టోరల్ అధికారులు తమ పరిధిలో పూర్తి నివేదికను రెండు రోజుల్లో సమర్పించాలని సూచించారు. సమావేశంలో హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అడిషనల్ కమిషనర్(ఎన్నికలు)శంకరయ్య, కంటోన్మెంట్ సీఈఓ మధుకర్‌నాయక్ ఆయా విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న సీవీ ఆనంద్, రొనాల్డ్ రాస్



ఇడ్లీ... పూరి రెడీ


ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం కార్యక్రమాన్ని నగరవ్యాప్తంగా శుక్రవారం ప్రారంభించారు. ఈస్ట్‌మారేడ్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో మంత్రి కేటీఆర్ స్వయంగా పాల్గొని పిల్లలకు అల్పాహారం వడ్డించారు. అక్కడే పూరి, ఉప్మాను ఆరగించారు. ఇక రావిర్యాలలో మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి పాఠశాల విద్యార్థులకు స్వయంగా ఇడ్లీ, ఇతర అల్పాహారాన్ని వడ్డించారు. నగరంలో మిగతా చోట్ల ఆయా ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దీంతో పాఠశాలల్లో సందడి వాతావరణ నెలకొంది. చిన్నారులు కూడా ఉత్సాహంగా అల్పాహారాన్ని ఆరగించారు.



ఉరుకులు.. పరుగులు!

ఎన్నికల వేళ ప్రజాప్రతినిధుల హడావుడి

- మంత్రులు, ఎమ్మెల్యేల సుడిగాలి పర్యటనలు
- రెండు రోజుల్లో 200 కార్యక్రమాలు
- రూ.కోట్లాది పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- ఎన్నికల నోటిఫికేషన్ ముంచుకొస్తుండటంతోనే..



సాక్షి, సిటీబ్యూరో/నెట్‌వర్క్: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ముహూర్తం సమీపిస్తోంది. ఏ క్షణంలోనైనా ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుందనే అంచనాల నేపథ్యంలో గ్రేటర్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లోనూ ప్రజాప్రతినిధులు ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. వివిధ కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు, లబ్ధిదారులకు సంక్షేమ పథకాల పంపిణీ కార్యక్రమాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు బిజీబిజీగా ఉన్నారు. నోటిఫికేషన్ వస్తే.. కొత్త ప్రభుత్వం కొలువు తీరేంతవరకు సంక్షేమ ఫలాలు అందించే వీలుండదు. అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు అవకాశం ఉండదు. నోటిఫికేషన్ లోపునే పనుల్ని ప్రారంభించి ఉంటే మాత్రం వాటిని కొనసాగించవచ్చు. దీంతో పనుల శంకుస్థాపనలకు సుడిగాలి వేగంతో పర్యటిస్తున్నారు.

- గడచిన రెండు రోజుల్లోనే గ్రేటర్ పరిధిలోని ప్రజాప్రతినిధులు దాదాపు రెండొందల కార్యక్రమాల్లో పాల్గొన్నారు.
- సనత్‌నగర్ ఎమ్మెల్యే, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఒక్కరోజులోనే 13 కార్యక్రమాల్లో పాల్గొన్నారు.
- సికింద్రాబాద్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ పద్మారావు గౌడ్ రెండు రోజుల్లో 48 అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు.
- ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ శుక్రవారం ఒక్కరోజే 12 కార్యక్రమాల్లో పాల్గొనగా, శనివారం మరో 15 కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.
- మేడ్చల్ ఎమ్మెల్యే, మంత్రి మల్లారెడ్డి గడచిన రెండు రోజుల్లో 20 కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పలు పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.
- ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి రెండు డివిజన్లలోని 30 కాలనీల్లో రూ.24 కోట్ల విలువైన పనులు ప్రారంభించారు.
- కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు 9 కార్యక్రమాల్లో, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ గడచిన మూడు రోజుల్లో 13 కార్యక్రమాల్లో పాల్గొన్నారు.
- అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ 15 కార్యక్రమాల్లో పాల్గొనగా, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఒక్క కార్యక్రమంలో పాల్గొన్నారు. బీజేపీ ఆయనను సస్పెండ్ చేయడం తెలిసిందే.
- మలక్‌పేటలో ఎమ్మెల్యే బలాలా రెండు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పార్టీని వీడిపోవడంతో ఒక కార్యక్రమంలో మాత్రం పాల్గొన్నారు. కార్వాన్ ఎమ్మెల్యే రెండు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.
- హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ శుక్రవారం ఒక్కరోజే చార్మినార్ నియోజకవర్గంలో రూ.180 కోట్లతో ఐదు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. పాతబస్తీలోని నాలుగు నియోజకవర్గాల్లో ఎనిమిది పనులు ప్రారంభించారు.
- ఇతరనియోజకవర్గాల్లోనూ స్థానిక ప్రజాప్రతినిధులు వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వెరసి రెండు రోజుల్లో దాదాపు 200 కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఘనంగా మంత్రి తలసాని పుట్టిన రోజు వేడుకలు



భారీ గజమాలతో తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను సన్మానిస్తున్న దృశ్యం..



సనత్‌నగర్: రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ జన్మదిన వేడుకలు వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఆయన నివాసం వద్ద శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పుష్పగుచ్ఛాలను అందజేసి శాలువాలతో సత్కరించారు. అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, విజయ డెయిరీ చైర్మన్ సోమా భరత్‌కుమార్‌గుప్తా, పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ రాంచందర్, మత్స్య శాఖ కమిషనర్ లచ్చిరాం బూక్యా, ఉస్మానియా యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ రవీందర్‌యాదవ్, వాటర్‌వర్క్స్ సీజీఎం ప్రభు, జీఎం కృష్ణ, శశాంక్, నర్సింగ్‌రావు, బీఆర్ఎస్ నాయకులు కొలను బాల్‌రెడ్డి, డీవీ నరేందర్‌రావు, సురేష్‌గౌడ్, రాజా తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

సర్వమత ప్రార్థనలు..

పద్మారావునగర్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌ఛార్జి గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో వెస్ట్‌మారేడ్‌పల్లిలోని మంత్రి నివాసం వద్ద జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. సర్వమత ప్రార్థనలు చేసి మంత్రిని ఆశీర్వదించారు. అనంతరం క్రేన్ సాయంతో భారీ పూల మాలను మంత్రిని సన్మానించారు. కార్యక్రమంలో వెంకటేషన్ రాజు, నాయకులు శైలేందర్, బాబురావు, బాలరాజ్‌యాదవ్, శివ తదితరులు పాల్గొన్నారు.

'సాక్షి' రాసింది.. ఏసీబీ కదిలింది!

- పబ్ యజమానికి బంజారాహిల్స్ పోలీసుల వేధింపులు
- బాధితుడి ఫిర్యాదుతో గతంలోనే రంగంలోకి ఏసీబీ టీమ్
- ఓ రాజకీయ నాయకుడి ఒత్తిడితో అటకెక్కిన వ్యవహారం
- దీనిపై సోమవారం 'సాక్షి' ప్రత్యేక కథనం
- స్పందించిన అవినీతి నిరోధక శాఖ అధికారులు
- శుక్రవారం పోలీసుస్టేషన్‌పై దాడి
- ఇన్‌స్పెక్టర్ నరేందర్, ఎస్సై నవీన్‌రెడ్డి, హోంగార్డుల విచారణ
- నాటకీయ పరిణామాల మధ్య ఇన్‌స్పెక్టర్ నరేందర్‌కు అస్వస్థత
- సస్పెండ్ చేసేందుకు అధికారుల సన్నాహాలు



ఇన్‌స్పెక్టర్ ఎం.నరేందర్



ఎస్సై ఎస్.నవీన్‌రెడ్డి



హోంగార్డు హరి

సాక్షి, సిటీబ్యూరో: పెంచిన మామూళ్లతో పాటు 'పాత బకాయిల' కోసం పబ్ యజమానిని వేధించి, బెదిరించి, తప్పుడు కేసు నమోదు చేసిన బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ ఎం.నరేందర్, ఎస్సై ఎస్.నవీన్ రెడ్డి, హోంగార్డు హరిపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు చర్యలకు ఉపక్రమించారు. రాజకీయ నాయకుల ప్రమేయంతో కొన్నాళ్ల క్రితం అటకెక్కిన ఈ కేసు వ్యవహారంపై 'సాక్షి' సోమవారం 'ఏ' క్లాస్ రాజీ! శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురించింది. దీంతో స్పందించిన ఏసీబీ అధికారులు శుక్రవారం బంజారాహిల్స్ పోలీసుస్టేషన్‌పై దాడి చేశారు. నరేందర్, నవీన్‌రెడ్డి, హరిలను అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలోనే నరేందర్ అస్వస్థతకు గురి కావడంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ ముగ్గురి పైనా శాఖాపరమైన చర్యలు తీసుకుంటూ సస్పెండ్ చేయడానికి ఉన్నతాధికారులు సన్నాహాలు చేపట్టారు.

మామూలు పెంచి 'ఎరియర్స్' ఇమ్మని...

బంజారాహిల్స్ పీఎస్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న ఎం.నరేందర్‌కు రాజకీయ అండదండలు దండిగా ఉన్నాయన్నది బహిరంగ రహస్యమే. తన పరిధిలో ఉన్న పబ్స్, బార్ అండ్ రెస్టారెంట్స్‌తో పాటు మసాజ్ సెంటర్ల నుంచి నెలవారీ మామూళ్లు వసూలు చేస్తున్నారు. తన వద్ద హోంగార్డుగా పని చేస్తున్న హరికి ఈ కలెక్షన్స్ బాధ్యతలు అప్పగించారు. అతడే ప్రతి నెలా అందరికీ ఫోన్లు చేసి, డబ్బు వసూలు చేసుకుని వస్తుంటాడు. కొన్ని నెలల క్రితం నరేందర్ తన పరిధిలో ఉన్న పబ్స్ ఇచ్చే నెల వారీ మామూళ్లను రూ.50 వేల నుంచి రూ.1.5 లక్షలకు పెంచేశారు. అంతటితో ఆగకుండా రెండు నెలల 'ఎరియర్స్'తో కలిపి మొత్తం రూ.4.5 లక్షలు చెల్లించాలంటూ డిమాండ్ చేశారు. బంజారాహిల్స్ రోడ్ నెం.14లోని రాక్ క్లబ్ అండ్ స్కై లాంజ్ పబ్‌ను లక్ష్మణ్ రావు, శివలాల్ నిర్వహిస్తున్నారు. అంత మొత్తం ఇచ్చేందుకు వారు అంగీకరించకపోవడంతో 'రిబేటు' ఇచ్చిన నరేందర్ రూ.3 లక్షలకు తగ్గించారు. ఈ డబ్బు ఇవ్వాలంటూ లక్ష్మణ్ రావుకు హోంగార్డు హరితో పదేపదే వాట్సాప్ కాల్స్ చేయించాడు.

హేయమైన ఆరోపణలతో తప్పుడు కేసు...

పబ్ యాజమాన్యం తన మాట వినకపోవడంతో వారిపై తప్పుడు కేసు నమోదు చేసేందుకు ఎస్సై ఎస్.నవీన్‌రెడ్డితో కలిసి పథక రచన చేశాడు. ఈ ఏడాది జులై 30 రాత్రి నవీన్‌రెడ్డికి రాక్ క్లబ్ అండ్ స్కై లాంజ్‌లో అసాంఘిక కార్యకలాపాలు సాగుతున్నట్లు సమాచారం అందినట్లు, అతడు దానిపై దాడి చేసినట్లు కేసు నమోదు చేశారు. సదరు పబ్ యాజమాన్యం తన వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవడం కోసం పబ్‌లో మహిళలను కూడా సరఫరా చేస్తోందని, వారితోనే కస్టమర్లకు సర్వీస్ చేయిస్తూ రెచ్చగొడుతోందని, ఆకర్షితులైన వినియోగదారులతో కలిసి గడిపేలా ప్రోత్సహిస్తోందనే ఆరోపణలు చేస్తూ కేసు నమోదు చేశారు. అదే నెల 31న మహిళల అక్రమ రవాణా నిరోధక చట్టం కిందన నమోదు చేసిన కేసులో ఇద్దరు యజమానులనూ నిందితులుగా చేర్చారు. కాగా రోజు పబ్‌లో వారు ఇరువురూ లేరని, అక్కడ అసాంఘిక కార్యకలాపాలు జరగట్లేదని, అసలు పోలీసులు దాడే చేయలేదని ఇటీవల ఏసీబీ గుర్తించింది.

ఒత్తిడితో మిన్నకుండిపోయిన ఏసీబీ...

ఈ నేపథ్యంలో లక్ష్మణ్ రావు ఆగస్టులోనే ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో అవసరమైన ఆధారాల కోసం అవినీతి నిరోధక శాఖ అధికారులు రంగంలోకి దిగారు. రహస్య కెమెరాలతో కూడిన వాచీలు తదితరాలను ఏర్పాటు చేసి పబ్‌కు సంబంధించిన ఓ వ్యక్తిని నరేందర్ వద్దకు పంపారు. లంచానికి సంబంధించిన బేరసారాలు ఆడియో, వీడియోలు రికార్డు చేసే ప్రయత్నం చేశారు. అయితే ఓ దశలో సదరు వ్యక్తి రహస్య కెమెరాలతో వచ్చిన విషయం గుర్తించిన నరేందర్ అప్రమత్తమయ్యారు. అసలు విషయం గ్రహించి తన 'బంధువైన' రాజకీయ నాయకుడిని ఆశ్రయించారు. ఆయన జోక్యంతో ఏసీబీకి చెందిన కింది స్థాయి అధికారులు అడుగు వెనక్కు వేశారు. మరోసారి సదరు పబ్ జోలికి రావద్దని ఇన్‌స్పెక్టర్ నరేందర్‌కు, నరేందర్‌ను వదిలేయని పబ్ యాజమాన్యానికి చెప్పి రాజీ చేసి ఫైల్‌ను అటకెక్కించేశారు. దీంతో దాదాపు రెండు నెలలుగా కేసు మరుగున పడిపోయింది. ఈ విషయాన్ని వెలుగులోకి తీసుకువస్తూ 'సాక్షి' సోమవారం 'ఏ' క్లాస్ రాజీ! శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన ఉన్నతాధికారులు 'బంజారాహిల్స్ ఫైల్'8 దుమ్ము దులిపించారు.

ఓసారి షుగర్ డౌన్... మరోసారి ఛాతి నొప్పి...

ఏసీబీ డీఎస్పీ శ్రీకాంత్ నేతృత్వంలోని బృందం శుక్రవారం ఉదయం బంజారాహిల్స్ ఠాణాపై దాడి చేసింది. నరేందర్, నవీన్‌రెడ్డి, హరిలను అదుపులోకి తీసుకుని వివిధ కోణాల్లో ప్రశ్నించింది. పబ్ యాజమాన్యంపై నమోదు చేసిన కేసుకు సంబంధించిన పత్రాలు సేకరించింది. సుదీర్ఘంగా ఈ ముగ్గురు నిందితులను విచారించింది. దీంతో తొలుత తన షుగర్ లెవల్స్ పడిపోయాయంటూ నరేందర్ చెప్పడంతో వైద్య బృందాన్ని ఠాణాకు పిలిపించి చికిత్స చేయించారు. సాయంత్రం తనకు ఛాతీ నొప్పంటూ పడిపోవడంతో స్థానికంగా ఉన్న ఆస్పత్రికి తరలించింది. హాస్పిటల్ వెళ్ళడానికి నరేందర్ నడుచుకుంటూ వచ్చి తన వాహనమే ఎక్కడం గమనార్హం. ఈ కేసుపై ప్రకటన విడుదల చేసిన అవినీతి నిరోధక శాఖ డైరెక్టర్ జనరల్.. 'ఇన్‌స్పెక్టర్ నరేందర్ ఆదేశాల మేరకు నవీన్ రెడ్డి గత శనివారం అర్ధరాత్రి సదరు పబ్ వద్దకు వెళ్లారు. లక్ష్మణ్ రావును అనవసరంగా పబ్ బయటకు పిలిచారు. రోడ్డుపై ఆపి ఉంచిన పోలీసు వాహనం వద్దకు వచ్చిన ఆయన్ను బలవంతంగా అందులో ఎక్కించుకుని ఠాణాకు తరలించారు. అక్కడ కొన్ని గంటల పాటు నిర్బంధించారు. నరేందర్, నవీన్‌రెడ్డి, హరిలపై నమోదు చేసి కేసు దర్యాప్తులో ఉందని, చట్ట ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటాం' అని పేర్కొన్నారు.

నేడు అనీస్–ఉల్–గుర్బా ప్రారంభం

- రూ.20 కోట్లతో ఏడంతస్తుల భవన సముదాయం
- 600 మంది అనాథ పిల్లలకు ఆశ్రయం
- ప్రారంభించనున్న కేటీఆర్

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరం నడిబొడ్డున నాంపల్లిలో పునర్నిర్మించిన వందేళ్ల అత్యంత పురాతన అనాథ శరణాలయం అనీస్–ఉల్–గుర్బా నూతన భవన సముదాయాన్ని శనివారం మంత్రి కేటీఆర్ ప్రారంభించనున్నారు. సుమారు రూ.20 కోట్లతో 4500 చదరపు గజాల స్థలంలో నిర్మించిన ఏడంతస్తుల భవన సముదాయం సుమారు 600 మంది విద్యార్థులకు ఆశ్రయం కల్పించనుంది. నిజాం హయాంలో 1921లో మీర్ ఖాజా బద్రుద్దీన్ చిస్తీ స్థాపించిన అనీస్–ఉల్–గుర్బా అసఫ్ జాహీ రాజవంశంలో మతపరమైన విభాగం నియంత్రణలో ఉండేది. హైదరాబాద్ రాష్ట్రం భారత యూనియన్‌లో విలీనమైన తర్వాత దానిని ఎండోమెంట్ శాఖకు అప్పగించారు. ఆ తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2009లో వక్ఫ్ బోర్డుకు బదిలీ చేస్తూ జీవో జారీ చేసింది. తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీ సంక్షేమం, నిరుపేద, అనాథ పిల్లల విద్యాభ్యాసం కోసం అనీస్–ఉల్– గుర్బా ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా భావించింది. 2017లో శిథిలావస్థకు చేరిన అనాథాశ్రమాన్ని కూల్చివేసి మరింత కొంత భూమి సేకరించి ఆధునిక మోడల్‌లో నూతన భవన నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టింది. ఆరేళ్లలో నిర్మాణ పనులు పూర్తి చేసుకున్న భవన సముదాయం మంత్రి చేతుల మీదుగా ప్రారంభం కానుంది.

ఫ్రీజ్ చేసిన అకౌంట్లలో రూ.100 కోట్లు

- ఆలస్యమైతే నగదు చేతులు మారే అవకాశం
- త్వరగా 1930 కాల్ సెంటర్‌కు ఫిర్యాదు చేస్తేనే బ్యాంక్ అకౌంట్లు బ్లాక్
- సైబర్ క్రైం బ్యూరో ఎస్పీ విశ్వజిత్ కంభంపాటి
- సైబర్ క్రైం బాధితులకు రికవరీ నగదు అందజేత
- 44 కేసుల్లో రూ.2,23,89,575 రికవరీ



రికవరీ చేసిన నగదును బాధితులకు అందజేస్తున్న సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర

గచ్చిబౌలి: రాష్ట్రవ్యాప్తంగా సైబర్ క్రైం పై వచ్చిన ఫిర్యాదులతో ఫ్రీజ్ చేసిన బ్యాంక్ అకౌంట్లలో రూ.100 కోట్లు ఉన్నాయని, వాటిని త్వరలోనే బాధితులకు అందజేస్తామని సైబర్ క్రైం బ్యూరో ఎస్పీ విశ్వజిత్ కంభంపాటి తెలిపారు. శుక్రవారం సైబరాబాద్ కమిషనరేట్‌లో సైబర్‌క్రైం బాధితులకు రికవరీ నగదును సీపీ స్టీఫెన్ రవీంద్ర చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ విశ్వజిత్ మాట్లాడుతూ సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. త్వరగా ఫిర్యాదు చేస్తే ఆ నగదు వెళ్లిన అకౌంట్‌ను బ్లాక్ చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామన్నారు. ఆలస్యమైతే నగదు చేతులు మారే అవకాశం ఉందన్నారు. దీంతో బాధితులు నష్టపోయే అవకాశం ఉందని తెలిపారు. సైబర్ నేరగాళ్లు భారీ మొత్తంలో నగదును తీసుకున్నప్పుడు ఆలస్యం అయితే క్రిప్టో కరెన్సీకి మళ్లించే అవకాశం ఉందన్నారు. అలా చేసిన తరువాత రికవరీ చేసే వీలుండదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సైబర్ క్రైం ఫిర్యాదులతో ఫ్రీజ్ చేసిన బ్యాంక్ అకౌంట్లలో రూ.100 కోట్ల నగదు ఉందని, అన్ని జిల్లాల పోలీసు అధికారులకు సమాచారం అందించామని, త్వరలోనే బాధితులకు అందజేయనున్నట్లు తెలిపారు. డబ్బులు ఇస్తామని ఎరవేసి పాస్ బుక్, డెబిట్ కార్డు, లింక్ చేసిన ఫోన్ నెంబర్ తీసుకుని వేరే అకౌంట్లు తెరచి సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని, అలా సహకరించిన వారిపై కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. సైబరాబాద్ డీసీపీ క్రైమ్స్ కల్మేశ్వర్ సింగన్వార్ మాట్లాడుతూ పెట్టుబడి పేరిట మోసాలకు పాల్పడిన కేసులే ఎక్కువగా ఉన్నాయన్నారు. ఆన్‌లైన్ వెబ్‌సైట్స్, మెసెంజర్, సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలను నమ్మవద్దని సూచించారు. ఇన్వెస్ట్‌మెంట్ పేరిట మొదట అదనంగా కొంత కలిపి ఇచ్చి నమ్మకం కలిగిస్తారని తెలిపారు. ఎక్కువ మొత్తంలో డబ్బు ట్రాన్స్‌ఫర్ చేయగానే కంటాక్ట్‌లో లేకుండా పోతారని వివరించారు. సైబర్ నేరాలపై ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి మూడు, నాలుగు నెలలు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించినట్లు తెలిపారు. 44 కేసుల్లో రూ.2,23,89,575 రికవరీ చేసి బాధితులకు అందజేశామన్నారు. 1930 కాల్ సెంటర్ కేవలం ఫిర్యాదును మాత్రమే స్వీకరిస్తారని ఆ తర్వా కేసు ఏ పోలీస్ స్టేషన్‌కు కేటాయిస్తారో మెసేజ్ వస్తుందన్నారు. కేసు స్టేటస్‌ను ఆయా పోలీస్ స్టేషన్లలోనే అడగాలని సూచించారు. కార్యక్రమంలో సైబర్ క్రైం డీసీపీ రితిరాజ్, ఏసీపీ, సీఐలు పాల్గొన్నారు.

డ్రగ్స్ పేరిట బ్లాక్ మెయిల్

మీరు తైవాన్‌కు పంపుతున్న ఫెడెక్స్ పార్సిల్‌లో డ్రగ్స్ ఉన్నాయి. ఫోన్ నెంబర్, ఆధార్‌కార్డు వివరాలతో మీకు ఫోన్ చేశాం. మేము సీబీఐ అధికారులం మీ పై కేసు నమోదవుతుందని ఓ మహిళను బెదిరించి రూ.10.96 లక్షలు కాజేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సదరు అకౌంట్‌ను ఫ్రీజ్ చేసిన పోలీసులు మొత్తం నగదును రికవరీ చేసి బాధితురాలికి అందజేశారు.

పెట్టుబడి పేరిట మోసం

గాజుల రామారం ప్రాంతానికి చెందిన యువకుడు మొబైల్ షాపు నిర్వహిస్తున్నాడు. మెసేంజర్‌లో ఇన్వెస్ట్‌మెంట్ ప్రకటనలు చూసిన అతను మొదట రూ.1000 పంపిస్తే వెంటనే రూ.1200 వచ్చాయి. రెండో సారి రూ.9,900 పంపిస్తే రూ.12600 పంపారు. అనుమానం వచ్చి యువకుడు స్పందించకుంటే వీడియో కాల్స్ చేసి మరింత ఆశ చూపడంతో అప్పు చేసి రూ.2.92,600 పంపాడు. వెంటనే అటువైపు నుంచి ఎలాంటి స్పందనలేకపోవడం మోసపోయినట్లు గుర్తించి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు రూ.1,50,000 రికవరీ చేసి అతడికి అందజేశారు.

చందన బ్రదర్స్ షాపింగ్ మాల్ ప్రారంభం..



సాక్షి, సిటీబ్యూరో: వస్త్ర ప్రపంచంలో ప్రసిద్ధి చెందిన ప్యాట్నీసెంటర్ చందన బ్రదర్స్ ఆధ్వర్యంలో తుర్కయాంజల్ వేదికగా నూతనంగా ఏర్పాటు చేసిన షాపింగ్‌మాల్‌ను ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ప్రముఖ సినీతార అను ఇమాన్యుయేల్ శుక్రవారం ప్రారంభించారు. అధునాతన ఫ్యాషన్ హంగులతో వస్త్ర ప్రపంచంలో అంతర్జాతీయ షాపింగ్ అనుభూతిని కలపించేలా ఈ మాల్‌ను రూపొందించారు. ఈ సందర్భంగా సంస్థ అధినేత అల్లక సత్యనారాయణ మాట్లాడుతూ., అన్ని వర్గాలకు అనువైన విభిన్న రకాల వస్త్రాలు హోల్‌సెల్ ధరలకే లభిస్తాయన్నారు. ఈ మాల్ ఏర్పాటుతో దాదాపు 200 మందికి ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సినీతార అను ఇమాన్యుయేల్ అందమైన చీరలను ప్రదర్శిస్తూ సందడి చేశారు.

పరువు హత్య కేసులో నిందితులకు యావజ్జీవ శిక్ష

చైతన్యపురి: సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో కలకలం సృష్టించిన పరువు హత్య కేసులో నిందితులకు రికార్డు టైంలో శిక్ష ఖరారైనట్లు ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ తెలిపారు. సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం సాయంత్రం ఎల్‌బీనగర ఏసీపీ జానకిరెడ్డి, అప్పటి ఎల్‌బీనగర్ ఏసీపీ శ్రీధర్‌రెడ్డి తదితరులతో కలిసి డీసీపీ వివరాలు వెల్లడించారు. తన సోదరి అశ్రిన్ సుల్తానా మతం మార్చుకుని నాగరాజు అనే వ్యక్తిని వివాహం చేసుకుందని కక్ష కట్టిన సయ్యద్ మోబిన్ అహ్మద్ తన బావ మహ్మద్ మసూద్‌తో కలిసి గత సంవత్సరం మే నెల 4న సరూర్‌నగర్ పరిధిలో నాగరాజును రాడ్లు, కత్తులతో దాడి చేసి హత్య చేశారు. ప్రత్యక్ష సాక్షులు, టెక్నికల్‌గా సాక్ష్యాలను అప్పటి ఏసీపీ శ్రీధర్‌రెడ్డి సారథ్యంలో సేకరించి కోర్టుకు సమర్పించామన్నారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా కేసు విచారించాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు. న్యాయమూర్తి రికార్డు టైంలో నిందితులిద్దరికి యావజ్జీవ శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారన్నారు. నిందుతులకు శిక్షపడేలా చేసిన ఏసీపీ శ్రీధర్‌రెడ్డి, అప్పటి సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సీతారాం, ఎస్ఐ శ్రీనివాసులు, ఏఎస్ఐ ప్రభాకర్‌లను డీసీపీ అభినందించారు.

పక్కా ప్లాన్‌తోనే..

- ఎన్ఆర్ఐ హత్య కేసులో ఆరుగురు నిందితుల అరెస్టు
- పథకం ప్రకారమే హత్య...
- సీసీ కెమెరాలు, డీవీఆర్‌ల తొలగింపు
- రూ. నాలుగు లక్షల సుపారీ
- ప్రధాన నిందితుడు జీఆర్ కన్వెన్షన్ యజమానిపై రౌడీషీట్

రాంగోపాల్‌పేట్: సినీ నిర్మాత, ఎన్నారై అంజిరెడ్డి హత్య కేసులో ఆరుగురు నిందితులను గోపాలపురం పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పద్మారావునగర్‌కు చెందిన ఎన్ఆర్ఐ, సినీ నిర్మాత అంజిరెడ్డి విదేశాల్లో స్థిరపడేందుకు గాను పద్మారావునగర్‌లోని తన ఇంటిని విక్రయించాలని నిర్ణయించుకున్నాడు. వాట్సాప్ గ్రూపులో వచ్చిన సమాచారంతో ఈ విషయం తెలుసుకున్న ఎస్డీ రోడ్డులోని జీఆర్ కన్వెన్షన్ యజమాని రాజేష్ ఆ ఇంటిని కొట్టేయాలని పథకం పన్నాడు. ఇల్లు కొనుగోలు చేస్తానని అంజిరెడ్డికి దగ్గరై అతడిని నమ్మించాడు. ఇందులో భాగంగా రూ.3.90 కోట్లకు బేరం కుదుర్చుకున్న అతను రూ.5లక్షలు అడ్వాన్స్‌గా ఇచ్చాడు. త్వరలో మిగతా మొత్తాన్ని ఇస్తానని చెబుతూ కాలం వెల్లబుచ్చాడు. అంతేగాక అంజిరెడ్డికి అంబర్‌పేట్‌లో ఉన్న మరో స్థిరాస్తిని కూడా కొనుగోలు చేస్తానని నమ్మించాడు. సెప్టెంబర్ 22న అంజిరెడ్డి దంపతులు ఆస్ట్రేలియా వెళ్లాల్సి ఉంది. అయితే 29న రెండు ఆస్తుల లావాదేవీలు పూర్తి చేసికుందామని రాజేష్ చెప్పడంతో అంజిరెడ్డికి భార్య అమెరికా వెళ్లిపోగా ఆయన ఇక్కడే ఉండిపోయాడు.

పథకం ప్రకారమే...

ఇంటిని సొంతం చేసేందుకు అంజిరెడ్డిని హత్య చేయాలని నిర్ణయించుకున్న రాజేష్ అందులో భాగంగా తన వద్ద డ్రైవర్‌గా చేసే ప్రభు కుమార్, హౌస్ కీపింగ్ పనిచేసే సచ్చేంద్ర పాశ్వాన్, జయ మంగళ్ కుమార్, వివేక్‌కుమార్, రాజేష్ కుమార్‌లతో రూ.4లక్షలు ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నాడు. గత నెల 29న సాయంత్రం అంజిరెడ్డికి ఫోన్ చేసి డబ్బు ఇస్తానని నమ్మించి ఎస్డీరోడ్డులోని డీమార్ట్ బిల్డింగ్ బేస్‌మెంట్–3కి రప్పించారు. అప్పటికే రూ.2 కోట్లు చెల్లించినట్లు డాక్యుమెంట్లు సిద్ధంగా ఉంచుకున్న రాజేష్ ఆయనను సంతకం చేయాలని బెదిరించాడు. అందుకు అంజిరెడ్డి ఒప్పుకోకపోవడంతో లిఫ్టులోకి తీసుకెళ్లి దాడి చేయడమేగాక ముక్కు నోరు మూసి ఊపిరి ఆడకుండా చేయడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం నిందితులు మృతదేహాన్ని బేస్‌మెంట్‌లోనే పడేసి కారు ప్రమాదం జరిగిందని నమ్మించేందుకు కారును పిల్లర్లకు గుద్ది సీన్ క్రియేట్ చేశారు. అనంతరం మిగతా నిందితులందరూ అక్కడి నుంచి పారిపోగా రాజేష్ అంజిరెడ్డి కారు ప్రమాదంలో మృతి చెందాడని కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు.

సీసీ కెమెరాలు..డీవీఆర్‌ల తొలగింపు

హత్యకు ముందుకు పథకం ప్రకారం డీ మార్ట్ బిల్డింగ్ బేస్‌మెంట్‌లో ఉన్న సీసీ కెమెరాలు, డీవీఆర్‌లను తొలగించారు. వేలి ముద్రలు పడకుండా చేతులకు గ్లౌజులు వేసుకుని హత్య చేశారు. రాజేష్‌పై తుకారంగేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీట్ ఉండగా ఇప్పుడు చిలకలగూడకు మార్చారు. మేడిపల్లి తదితర పోలీస్ స్టేషన్ల పరిధిలోనూ అతడిపై కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా...

17న 'స్త్రీ శక్తి' పురస్కారం

సాక్షి, సిటీబ్యూరో: 'స్త్రీ శక్తి అవార్డ్స్ 2023' ప్రదానం ఈ నెల 17వ తేదీన గచ్చిబౌలిలో జరగనుందని సీబీఎస్ అవార్డ్స్ నిర్వాహకులు తెలిపారు. పంజగుట్టలోని మెర్క్యూర్ హోటల్‌లో జరిగిన పాత్రికేయ సదస్సులో వివరాలు వెల్లడించారు. 'స్త్రీ శక్తి, స్త్రీ మూర్తి, స్త్రీ రత్న' అని మూడు కేటగిరీలలో ఈ పురస్కారాలను అందివ్వనున్నట్లు టీసీఈఐ (తెలంగాణ చాంబర్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ) అధ్యక్షుడు బలరామ్ బాబు తెలిపారు.

క్రీడా సామగ్రి పంపిణీ



ఖైరతాబాద్: ఖైరతాబాద్ డివిజన్‌లోని ఓల్డ్‌సీఐబీ క్వార్టర్స్‌లో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో క్రీడల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు తెలంగాణ క్రీడా ప్రాంగణం కార్యక్రమంలో భాగంగా క్రీడా సామగ్రిని ఎమ్మెల్యే దానం నాగేందర్ అందజేశారు. కార్యక్రమంలో బ్రెట్‌వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



బంజారాహిల్స్: బంజారాహిల్స్ డివిజన్‌లో గత ఆగస్టులో కరెంటు స్తంభంపై పనిచేస్తూ విద్యుత్ ప్రమాదానికి గురై మృతిచెందిన ఆర్టిజన్ పెద్దబాబు కుటుంబానికి డివిజనల్ ఆల్ ఎంప్లాయీస్ తరఫున ఆర్థిక సహాయం అందించారు. ఈ మేరకు రూ.7.30 లక్షల రూపాయల సహాయాన్ని ఓ అండ్ ఎం స్టాఫ్, ఆర్టిజన్స్ ఆధ్వర్యంలో స్వయంగా వారి ఇంటికి వెళ్లి అందచేశారు. ఇందుకు డీఈ నరేందర్‌రెడ్డి, ఏడీ శ్రీనివాస్, సర్వేశ్వర్, మల్లిఖార్జున్, సంతోష్‌కుమార్, నాగరత్నం, అమిత్, సాయి శ్రీనివాస్‌లు సహకరించారని ఎంప్లాయీస్ సంఘం వారు వెల్లడించారు.

సైకిల్ షాప్ నిర్వాహకుడి కూతురు కానిస్టేబుల్‌గా ఎంపిక



ప్రకాష్‌తో కుమార్తె సుజాత

శ్రీనగర్‌కాలనీ: ఎల్లారెడ్డిగూడ ఆర్‌బీఐ క్వార్టర్స్ వద్ద నివసించే సామాజిక కార్యకర్త ప్రకాష్ కుమార్తె సుజాత సివిల్ కానిస్టేబుల్‌గా సెలెక్ట్ అయింది. స్థానికంగా అందరితో ఐక్యంగా ఉండి, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ నియంత్రణ, సామాజికసేవ కార్యక్రమాలు నిర్వహిస్తుంటాడు. కొద్ది రోజుల క్రితం యాక్సిడెంట్ అయి వెన్నెముక దెబ్బతిని అనారోగ్యానికి గురయ్యాడు. అయినా తన స్వశక్తితో చెరుకురసం బండిని, సైకిల్ షాప్‌ను నిర్వహిస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. పోలీస్ కానిస్టేబుల్‌గా తన కూతురు నియామకం కావడంతో తన సంతోషానికి అవధులు లేకుండా పోయాయి. ఎంతో కష్టపడి చదివి పోలీస్‌గా అవడం చాలా ఆనందంగా ఉందని ప్రకాష్ తెలిపాడు.

అప్పు చెల్లించమన్నందుకు మహిళకు బెదిరింపులు

వెంగళరావునగర్: తీసుకున్న అప్పు తిరిగి చెల్లించమని అడిగినందుకు మహిళను ఓ వ్యక్తి బెదిరింపులకు గురి చేస్తున్నాడంటూ మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల సమాచారం మేరకు... యూసుఫ్‌గూడ చెక్‌పోస్టు సమీపంలోని ఆర్ఆర్‌వీ అపార్ట్‌మెంట్స్‌లో రజిత, సురేందర్ దంపతులు గత కొన్నేళ్ళుగా నివాసం ఉంటున్నారు. రజిత భర్త మద్యానికి బానిక కావడంతో నాలుగేళ్ల కిందట అతనిని బెంగుళూరులోని వివేక్‌కు చెందిన ఆశ్రమంలో చేర్పించి వైద్యం చేయించింది. సురేందర్ కోలుకోవడానికి వివేక్ చాలా సాయం చేశాడు. తన కుమారుడు రితేష్‌ను కూడా బెంగుళూరులోని వివేక్ బూట్‌లోనే చేర్పించారు. తరచూ తన కుమార్తెతో పాటు ఆమె బెంగుళూరు వెళ్లి తన కుమారుడిని చూసి వస్తుండేవారు. ఈ క్రమంలో వివేక్ వారికి అనేక రకాలుగా సహాయ సహకారాలను అందించాడు. అంతేగాకుండా ఫొటోలను కూడా తీశాడు. ఆమె అతను తీసిన ఫొటోలను స్నేహపూర్వకంగానే అనుకుంది. ఈ పరిచయం వల్ల అతనికి రూ. 3.80 లక్షలు అప్పుగా ఇచ్చింది. అయితే ఆ నగదును సకాలంలో చెల్లించలేదు. నాలుగేళ్లయినా పూర్తిగా చెల్లించకపోవడంతో ఆమె గట్టిగా అడిగింది. దాంతో వివేక్ తాము గతంలో తీసిన ఫొటోలను తన బంధువులకు, మిత్రులకు పంపాడు. అంతేగాకుండా బెదిరించడం ప్రారంభించాడు. ప్రస్తుతం ఆమె అనారోగ్యంతో ఉండి అప్పును చెల్లించమని అడిగితే ఫోన్‌కాల్స్ చేసి బెదిరించడం, అనేకసార్లు ఫొటోలను స్నేహితులకు పంపడం లాంటివి చేస్తూ వేధిస్తున్నాడు. దాంతో ఆమె అతని వేధింపు భరించలేక మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి నుంచే ఓటు!

రానున్న ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఓటరు జాబితాలో పేరున్న వారంతా ఓటు వేసేలా చర్యలకు శ్రీకారం చుట్టారు. తాజాగా వయోవృద్ధులు, దివ్యాంగులు ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించనున్నారు. గతంలో కర్ణాటకలో ఈ విధానం ప్రవేశ పెట్టగా సత్ఫలితాలు ఇవ్వడంతో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లోనే అమలు చేయాలని నిర్ణయించారు.

- ప్రణాళికలు రూపొందిస్తున్న అధికారులు
- ఖైరతాబాద్‌లో 1508 మంది, జూబ్లీహిల్స్‌లో 1994 మందికి అవకాశం

బంజారాహిల్స్: ఖైరతాబాద్ నియోజకవర్గంలో వయోవృద్ధులు, దివ్యాంగుల ఓట్లు 1508 ఉన్నాయి. ఇందులో పురుషులు 880 మంది కాగా మహిళలు 628 మంది ఉన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో దివ్యాంగుల ఓట్లు 1994 ఉండగా ఇందులో పురుషులు 1153, మహిళలు 841 మంది ఉన్నారు.

ప్రత్యేక పోస్టల్ బ్యాలెట్లు...

ఎన్నికల విధులు నిర్వహించే ప్రభుత్వ సిబ్బంది, పోలీసులకు మాత్రమే ఇప్పటి వరకు పోస్టల్ బ్యాలెట్ ఉండేది. తాజాగా ఎన్నికల సంఘం ఆదేశాలతో వయోవృద్ధులు, మంచం దిగలేని దివ్యాంగులకు దీన్ని అమలు చేయనున్నారు. నామినేషన్ల ప్రక్రియ పూర్తయి పోటీ చేసే అభ్యర్థులు ఖరారైన తర్వాతే అధికారులు పోస్టల్ బ్యాలెట్లు సిద్ధం చేస్తారు. ఇంటి నుంచి ఓటు వేసే వారికి ప్రత్యేక రంగులో పోస్టల్ బ్యాలెట్‌ను తయారు చేయనున్నారు. దివ్యాంగులు, వయోవృద్ధులు ఎవరైనా ఉంటే ఆ ప్రాంత ఎన్నికల అధికారికి లిఖితపూర్వకంగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఎన్నికల అధికారులు ఆయా ఓటర్ల ఇంటికి వెళ్లి ఓటు వేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తారు. దీనిపై ఇంకా పూర్తి స్థాయిలో మార్గదర్శకాలు రాకపోవడంతో అధికారులు ప్రచారాన్ని ఇంకా ప్రారంభించలేదు.

ప్రతి కాలనీకి వెళ్లి....

స్వీప్ ద్వారా వయోవృద్ధులకు కొంత కాలంగా ఎన్నికల అధికారులు అవగాహన కలిగిస్తున్నారు. ఇప్పటికే ఈవీఎం వినియోగంపై ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసిన అవగాహన కలిగించారు. ప్రతి కాలనీకి ఈవీఎం యంత్రాలు పంపి అవగాహన కల్పిస్తున్నారు. ఇంకోవైపు కేంద్రాల్లో దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ర్యాంపుల ఏర్పాటుతో పాటు నడవలేని వారికి మూడు చక్రాల కుర్చీతో పాటు ప్రత్యేక సిబ్బందిని అందుబాటులో ఉంచనున్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు ఇప్పటికే పరిశీలించి అధికారులు నివేదికలు రూపొందించారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లోనూ దివ్యాంగులు తేలికగా లోపలికి వెళ్లేందుకు వీలుగా ర్యాంపులు ఉండాల్సిందేనని ఎన్నికల అధికారులు స్పష్టం చేయడంతో ఎక్కడెక్కడ వాటి అవసరం ఉందో ఆ వివరాలతో కూడిన నివేదికలను సిద్ధం చేశారు. త్వరలోనే ఆ కేంద్రాల్లో జీహెచ్ఎంసీ అధికారులు ర్యాంపులు నిర్మించనున్నారు.



చక్రాల కుర్చీలో ఓటు వేసేందుకు వచ్చిన ఓటరు (ఫైల్)

చిత్ర పరిశ్రమకు అండగా ఉంటా



భారీ గజమాలతో మంత్రి తలసానిని సన్మానిస్తున్న యూనియన్ నేతలు

- మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

వెంగళరావునగర్: చిత్ర పరిశ్రమకు ఎప్పుడు ఎలాంటి కష్టమొచ్చినా తాను అండగా ఉండి పరిష్కరిస్తానని రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. తెలుగు చిత్ర పరిశ్రమ ఆధ్వర్యంలో మంత్రి తలసాని జన్మదిన వేడుకలు యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో శుక్రవారం అట్టహాసంగా నిర్వహించారు. మంత్రి తలసాని మాట్లాడుతూ... తన పుట్టినరోజు వేడుకలను భారీ స్థాయిలో నిర్వహించిన తెలుగు చలనచిత్ర పరిశ్రమకు కృతజ్ఞతలు తెలియజేశారు. మంత్రి తలసాని జన్మదినం సందర్భంగా ఆయనకు భారీ గజమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయనను తెలంగాణ, ఏపీ నుంచి తరలివచ్చిన సినీ కార్మిక సంఘాల నేతలు శాలువాలు, బొకేలు, మెమొంటోలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో భాగంగా మంత్రి తలసానిపై రాయించిన ప్రత్యేక గీతాన్ని ఆయన కుమారుడు తలసాని సాయియాదవ్ విడుదల చేశారు. ప్రముఖ రూబిక్స్ క్యూ కళాకారుడు కళ్లకు గంతలు కట్టుకుని 'హ్యాపీ బర్త్‌డే తలసాని శ్రీనివాస్ యాదవ్ గారు' అంటూ రూబిక్స్‌తో లైవ్ చేయడం, త్రీడీ టెక్నాలజీతో రూబిక్స్ క్యూలను ఉపయోగించి తలసానితోపాటు ఆయన కుమారుడు, మనుమడి ముఖాలను ఒకే ఫ్రేమ్‌లో వచ్చేలా కళ్లకు గంతలు కట్టుకుని చేసిన ఫీట్‌కు స్టేడియం కరతాళ ధ్వనులతో మారుమోగింది. తొలుత ఆయన భారీ కేక్‌ను కట్ చేశారు. చలన చిత్ర వాణిజ్య మండలి అధ్యక్షుడు దిల్‌రాజు, నిర్మాతలు దామోదర ప్రసాద్, చినబాబు, నిర్మాతల మండలి కార్యదర్శి ప్రసన్నకుమార్, కళ్యాణ్, నటులు రఘుబాబు, పృథ్వీ, మాదాల రవి, చిత్రపురి కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్ దొర్రై, స్థానిక నేతలు చిన్న శ్రీశైలం యాదవ్, నవీన్ యాదవ్, సినీ జర్నలిస్ట్ సురేష్ కొండేటి, లక్ష్మీనారాయణ, 24 క్రాఫ్ట్‌లకు చెందిన నాయకులు, కార్మికులు వేలాదిగా పాల్గొన్నారు.

స్వామినాథన్ జీవితం యువతకు స్ఫూర్తి



సదస్సు ప్రారంభిస్తున్న దృశ్యం

పంజగుట్ట: భారత వ్యవసాయ రంగంలో అనేక విప్లవాత్మక విజయాలను తీసుకువచ్చిన ప్రొఫెసర్ ఎం.ఎస్.స్వామినాథన్‌కు భారతరత్న ఇవ్వాలని జనవిజ్ఞాన వేదిక కోరింది. జన విజ్ఞాన వేదిక హైదరాబాద్ నగర కమిటీ, కాలేజీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ మ్యాథమేటిక్స్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఎం.ఎస్.స్వామినాథన్ భారత వ్యవసాయ రంగానికి చేసిన సేవలను స్మరించుకుంటూ సెమినార్ నిర్వహించారు. సెమినార్‌కు ప్రధాన వక్తగా న్యూఢిల్లీలోని ఐసీఎఆర్ మాజీ ప్రిన్సిపాల్, సైంటిస్టు డాక్టర్ సోమ ఎస్.మర్ల హాజరై స్వామినాథన్ సాధించిన విజయాలు, వ్యవసాయ రంగంలో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులను వివరించారు. దేశంలో వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉన్న సమయంలో గోధుమ, వరి వంగడాలు అధిక ఉత్పత్తిని సాధించేలా వంగడాలు తయారు చేసి దేశప్రజలకు ఆహారకొరత లేకుండా చేశారని గుర్తుచేశారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కోయ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... స్వామినాథన్ లాంటి శాస్త్రవేత్తలు ఈ దేశానికి మరింతమంది అవసరమన్నారు. ప్రతి ఒక్కరికీ స్వామినాథన్ జీవితం స్ఫూర్తిని ఇస్తుందన్నారు. రవాణాశాఖ అధికారి పాండురంగ నాయక్, కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేంద్ర కుమార్, గణితశాస్త్ర విభాగాధిపతి నవీన్ చందర్ రాజు, వెంకటేశ్వర్లు, లింగస్వామి, విద్యాసాగర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వరద సమస్యల పరిష్కారానికి చర్యలు



ఓల్డ్‌సీఐబీ క్వార్టర్స్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే దానం

ఖైరతాబాద్: ఖైరతాబాద్ డివిజన్‌లోని ఓల్డ్ సీబీబీ క్వార్టర్స్‌లో దశాబ్దాలుగా వరద నీటి ఇక్కట్లతో ఇబ్బందులు పడుతున్న స్థానికుల సమస్యను శాశ్వత పరిష్కార దిశగా మొదటి విడతగా రూ. 3.50 కోట్ల వ్యయంతో బాక్స్ రెయిన్ వాటర్ పనులకు శుక్రవారం ఎమ్మెల్యే దానం నాగేందర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా దానం మాట్లాడుతూ... స్థానికులు ఇబ్బందులు పడుతున్న వర్షపు నీటి ఇక్కట్లకు శాశ్వత పరిష్కార దిశగా మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు శాశ్వత పరిష్కార దిశగా పనులను పూర్తిచేస్తున్నామని తెలిపారు. మొదటి విడతగా రూ.3.50 కోట్లతో పనులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ పనులు పూర్తయితే ఓల్డ్ సీబీబీ క్వార్టర్స్ ముంపు సమస్య నుంచి బయటపడుతుందన్నారు. హైదరాబాద్ మెట్రో వాటర్‌వర్క్స్ అండ్ సీవరేజీ బోర్డు జీఎం షరీఫ్, మేనేజర్ నదీం, బ్రెట్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ అనిల్‌కుమార్, ప్రెసిడెంట్ జ్ఞానేశ్వర్ యాదవ్, ఉపాధ్యక్షుడు కె.రాజు, మహేందర్‌బాబు, ప్రవీణ్‌కుమార్, మహేష్ యాదవ్, కిషోర్, గజ్జల ఆనంద్, సంజీవ్, సురేందర్, సునీల్ పాల్గొన్నారు.

'మందు'బాబులకు జైలు

బంజారాహిల్స్: మద్యం సేవించి వాహనాలు నడుపుతూ జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 15 మంది వాహనదారులను శుక్రవారం నాంపల్లిలోని 8వ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. అతిగా మద్యం సేవించి తరచూ పట్టుబడుతున్న డేనియల్ రాజుకు నాలుగు రోజుల జైలు, రూ. 3300 జరిమానా, టి. ప్రవీణ్‌కు నాలుగు రోజుల జైలు రూ. 3300 జరిమానా, వర ప్రసాద్ బాబుకు రెండు రోజుల జైలు రూ. 2100 జరిమానా విధించారు. మిగతా 12 మందికి రూ. 2100 చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ఇదిలా ఉండగా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతూ జూబ్లీహిల్స్ పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డ 21 మంది వాహనదారులను నాంపల్లిలోని పదో ప్రత్యేక మెట్రోపాలిటన్స్ కోర్టులో హాజరుపరిచారు. వీరందరికీ న్యాయమూర్తి జరిమానా విధించారు. జరిమానాల రూపంలో రూ. 24100 వసూలు చేసినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు.

బతుకమ్మ చీరల పంపిణీ



బాలాపుర బస్తీలో బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్



శ్రీనివాస్‌నగర్‌లో కార్పొరేటర్ విజయారెడ్డి

పంజగుట్ట: దేశంలో ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయని, ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ పథకం అందుతోందని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. శుక్రవారం బాలాపుర బస్తీలో బతుకమ్మ చీరల పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ సంతోషంగా పండగ జరుపుకోవాలన్నదే ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యమన్నారు. అందుకే మతాలకు అతీతంగా బతుకమ్మ, రంజాన్, క్రిస్టమస్ పర్వదినాలకు పేదలకు దుస్తులను పంపిణీ చేస్తున్నారని తెలిపారు.

శ్రీనివాస్‌నగర్‌లో...

ఖైరతాబాద్: శ్రీనివాస్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో మహిళలకు బతుకమ్మ చీరలను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, కార్పొరేటర్ విజయారెడ్డి అందజేశారు.

హైదరాబాద్ అంటే ప్రాణం: సినీనటి మన్నార చోప్రా



పంజగుట్ట: హైదరాబాద్ అంటే తనకు ఎంతో ప్రాణమని ప్రముఖ సినీనటి మన్నార చోప్రా అన్నారు. శుక్రవారం పంజగుట్టలోని జోయాలుక్కాస్‌లో ప్రత్యేకమైన 'బ్రిలియన్స్' జ్యువెలరీ షో ఆమె ప్రారంభించింది. ఈ సందర్భంగా షోరూం మొత్తం కలియతిరిగి ఆభరణాల గూర్చి అడిగి తెలుసుకుంది. పలు ఆభరణాలు ధరించి ప్రదర్శించింది. తనకు ఆభరణాలంటే ఎంతో మక్కువని జోయాలుక్కాస్‌లో ఎన్నో ప్రత్యేకమైన వజ్రాభరణాలు ఉన్నాయని హైదరాబాద్ వచ్చిన వారు తప్పక వీక్షించాలన్నారు. సంస్థ ప్రతినిధులు రాజేష్ కృష్ణ, గోపాలకృష్ణ, రాబిన్ తంబి, షాజుపాల్‌లు మాట్లాడతూ... ఈ బ్రిలియెన్స్ ఎగ్జిబిషన్ కమ్ సేల్ అక్టోబర్ 22 వరకు కొనసాగుతుందన్నారు. పండగ కలెక్షన్స్ వివాహాది కలెక్షన్స్ అన్ని అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

మెట్ల బావి వద్ద 'దాన్ ఉత్సవ్'

బంజారాహిల్స్: సోషల్ వెంచర్స్ పార్ట్‌నర్స్ (ఎస్‌వీపీ) ఇండియా, తెలంగాణ ప్రభుత్వ అధికారిక సీఎస్ఆర్ సెల్ తెలంగాణ సోషల్ ఇంపాక్ట్ గ్రూప్ భాగస్వామ్యంతో అతిపెద్ద గివింగ్ పండుగ దాన్ ఉత్సవ్-2023 సికింద్రాబాద్‌లోని బన్సీలాల్‌పేట మెట్లబావిలో నిర్వహించనున్నట్లు ఎస్‌వీపీ ఇండియా హైదరాబాద్ చాప్టర్ చైర్‌పర్సన రాం కొండిన్య తెలిపారు. జంట నగరాల్లో గివింగ్ స్ఫూర్తి విస్తరించిందన్నారు. బన్సీలాల్‌పేటలో ఈ కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ పరిసర ప్రాంతాల్లో సుమారు 20 వేల మంది ప్రజల జీవితాలను మెరుగుపర్చేందుకు వాటర్‌షెడ్‌ను శుభ్రపరిచామన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ అర్చనా సురేష్ కూడా పాల్గొన్నారు. ఇందులో లాభాపేక్ష లేని సంస్థలు పాల్గొంటాయని హాజరైన వారు బట్టలు, పుస్తకాలు ఈ-వ్యర్థాలను విరాళంగా అందించే అవకాశం ఉంటుందన్నారు. ఇందులో భాగంగా కూచిపూడి నృత్య ప్రదర్శన కూడా నిర్వహిస్తామని అన్నారు.

రేపటి నుంచి ఛత్రపతి శివాజీ మహారథయాత్ర

పంజగుట్ట: ఛత్రపతి శివాజీ స్ఫూర్తి కేంద్రం ఆధ్వర్యంలో శివాజీ ఛత్రపతిగా పట్టాభిషేకం పొంది 350 సంవత్సరాలు పూర్తవుతున్న నేపథ్యంలో ఈ నెల 8వ తేదీ నుంచి ఛత్రపతి శివాజీ మహారథయాత్ర నిర్వహించనున్నట్లు తెలుగు రాష్ట్రాల బ్రాహ్మణ సంఘాల ప్రతినిధి తురగ శ్రీరామ్ తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఛత్రపతి యువసేన అధ్యక్షుడు యోగేష్ ప్రభు స్వామి, రాష్ట్రీల సాధు సంరక్షణ సమితి ప్రతినిధి కల్వనంద స్వామి, ఛత్రపతి శివాజీ ఆహ్వాన కమిటీ కన్వీనర్ రమేష్ చంద్రారెడ్డిలు మహా రథయాత్ర కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... యాత్ర తెలంగాణలో మూడు దశలలో జరుగుతుందని ఈ నెల 8వ తేదీన జోగులాంబ ఆలంపూర్ శక్తిపీఠం నుంచి భాగ్యనగర్, రెండవ దశ బాసర నుంచి భాగ్యనగరం, మూడవదశ భద్రాచలం నుంచి భాగ్యనగరం వరకు కొనసాగుతుందని యాత్ర పొడవునా శివాజీ స్ఫూర్తిని నేటితరం యువతలో నింపేలా సందేశాలు ఉంటాయని తెలిపారు. యాత్రలో అనేక మంది స్వామీజీలు, హిందూ సంఘాల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

'సీఎం బ్రేక్‌ఫాస్ట్' పవిత్ర కార్యక్రమం

- ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాపౌట్‌లు తగ్గుతాయి
- ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్



బాలాపుర బస్తీలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దానం



అల్పాహారం తీసుకుంటున్న విద్యార్థులు

పంజగుట్ట: ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాపౌట్‌లు తగ్గించేందుకు సీఎం బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. శుక్రవారం ఎర్రమంజిల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీఎం బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేశారు.

- బ్రేక్‌ఫాస్ట్ పెట్టడం ఎలా ఉందని విద్యార్థులను, వారి తల్లిదండ్రులను అడగగా వారు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాల్లో చదివే విద్యార్థుల తల్లిదండ్రులు ఎక్కువ శాతం కూలీ చేసుకునే వారే ఉంటారని వారు ఉదయం పిల్లలకు బ్రేక్‌ఫాస్ట్ పెట్టే స్థోమత, భోజనం వండి పెట్టే సమయం లేక ఖాళీ కడుపుతో పంపిస్తుంటారని ఆకలితో పిల్లలు చదవలేక పోతారని ఎమ్మెల్యే విచారం వ్యక్తం చేశారు.
- సీఎం బ్రేక్‌ఫాస్ట్ ఒక పవిత్రమైన కార్యక్రమమని దానం ఆనందం వ్యక్తం చేశారు. దేశంలోని ఏ రాష్ట్రంలో లేనివిధంగా తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉదయం. బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్నం లంచ్ ఇస్తున్నామన్నారు.
- 'ఎర్రమంజిల్ పాఠశాల నిమ్స్ అభివృద్ధికి తీసుకుంటున్నారు. మా పాఠశాల పోతుంది' అనే అపోహ, ఆందోళనలు ఉన్నాయని ఇప్పటికే తాను ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్, మంత్రి ప్రశాంత్‌రెడ్డితో సంప్రదించానని ఎమ్మెల్యే దానం పేర్కొన్నారు. పక్కనే వేరే స్థలం చూసి పూర్తిగా కట్టిన తర్వాతనే పాఠశాలను తొలగిస్తారని ఆయన స్పష్టం చేశారు.
- కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ చంద్రకాంత్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి, డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శామ్యూల్‌రాజ్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ శాంతారాథోడ్, బీఆర్ఎస్ ఖైరతాబాద్ డివిజన్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్, పాఠశాల హెడ్‌మాస్టర్ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రీరాంనగర్‌లో...



విద్యార్థులతో కలిసి బ్రెక్ ఫాస్ట్ చేస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

రహమత్‌నగర్: సీఎం బ్రెక్‌ఫాస్ట్ కార్యక్రమం పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని జూబ్లీ హిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. శ్రీరాంనగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, జీహెచ్ఎంసీ సర్కిల్-19 డీఎంసీ చంద్రశేఖర్, డిప్యూటీ ఐఎస్ఓ రామలింగయ్య, ప్రాజెక్ట్ ఆఫీసర్ హిమబిందు, హెచ్ఎం రెహమాన్, బీఆర్ఎస్ నేతలు నజీర్, సంజీవ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

కాంగ్రెస్‌లో ఎవరైనా సీఎం కావొచ్చు

ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నకిరేకల్ (నల్లగొండ జిల్లా): సోనియాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీ స్కీంలతో తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో రాబోతుందని, అధికారం వచ్చాక తమ పార్టీలో ఎవరైనా ముఖ్యమంత్రి కావొచ్చని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. నల్లగొండ జిల్లా నకిరేకల్‌లో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆధ్వర్యంలో జరిగిన స్వాగత కార్యక్రమంలో కోమటిరెడ్డి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సీఎం కోమటిరెడ్డి అంటూ కార్యకర్తలు నినాదాలు చేయడంతో ఆయన పైవిధంగా మాట్లాడారు. బీఆర్ఎస్‌లో కేసీఆర్ తర్వాత కేటీఆరే సీఎం అంటున్నారని, కాంగ్రెస్‌లో తానైనా సీఎం కావొచ్చు లేదా రేవంత్‌రెడ్డి, మధుయాష్కీ కూడా సీఎం కావొచ్చని తెలిపారు. తమకు ఇప్పుడు సీఎం పదవి ముఖ్యం కాదని, తెలంగాణలో బీఆర్ఎస్‌ను ఓడించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పాలనలో దళితులు, మహిళలు వివక్షకు గురవుతున్నారన్నారు. సిరిసిల్ల, గజ్వేల్, సిద్దిపేటలో తప్ప మిగతా నియోజకవర్గాలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. సూర్యాపేటలో మంత్రి జగదీశ్‌రెడ్డిని ఓడించడంతోపాటుగా నకిరేకల్ గడ్డపై వేముల వీరేశం భారీ మెజారిటీతో గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వారి ఆదేశాలే తమిళిసై పాటిస్తున్నారు

ఆ ఎమ్మెల్సీల ప్రతిపాదన తిరస్కరించడం చరిత్రలో లేదు: గుత్తా



సాక్షి, హైదరాబాద్: గవర్నర్ పదవికి నామినేట్ చేసిన వారి ఆదేశాలనే తమిళిసై పాటిస్తున్నారని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. గవర్నర్ కోటాలో శాసనమండలికి రాష్ట్ర మంత్రివర్గం నామినేట్ చేసినవారి పేర్లు తిరస్కరించిన ఘటన ఉమ్మడి ఏపీ శాసనమండలి చరిత్రలో లేదన్నారు. తమిళిసై హయాంలోనే ఇలాంటి ఉదంతాలు చోటు చేసుకున్నాయని, ఇది రాజకీయం కాకుండా మరేమిటని ప్రశ్నించారు. మండలిఆవరణలో శుక్రవారం తనను కలిసిన మీడియా ప్రతినిధులతో గుత్తా మాట్లాడారు. నిజామాబాద్ బహిరంగసభలో ప్రధాని మోదీ ఉపయోగించిన భాష, బాడీ లాంగ్వేజ్ ఇబ్బందికరంగా ఉందన్నారు.

కాంగ్రెస్ నేతలు ఢిల్లీకి వయా బెంగళూరు

గతంలో ఢిల్లీకి వెళ్లే కాంగ్రెస్ నేతలు ఇప్పుడు బెంగళూరు మీదుగా వెళ్లాల్సి వస్తోందని గుత్తా వ్యాఖ్యానించారు. చంద్రబాబు అరెస్టు విషయంలో అవినీతి విషయం కోర్టులు చూసుకుంటాయని చెప్పారు. బాబు అరెస్టు బాధాకరం అని పేర్కొంటూ.. సీనియర్ నాయకులు అయినంత మాత్రాన అవినీతి కేసుల్లో వదిలిపెట్టాలనే నిబంధన ఏదీ లేదన్నారు. మూడోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని, కేసీఆర్ సీఎంగా 'హ్యాట్రిక్' సాధిస్తారని గుత్తా వెల్లడించారు.

ఓట్లు చీల్చి బీఆర్ఎస్‌ను గెలిపించడమే బీజేపీ పని

టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ బలంగా ఉన్న స్థానాల్లో ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీల్చడం ద్వారా బీఆర్ఎస్‌ను గెలిపించడమే ఈ ఎన్నికల్లో బీజేపీ చేసే పని అని టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉన్న చోట్ల బీఆర్ఎస్‌ను గెలిపించేందుకు ప్రధాని మోదీతో సహా తెలంగాణ బీజేపీ నేతలందరూ పాట్లు పడుతున్నారని వ్యాఖ్యానించారు. శుక్రవారం టీపీసీసీ అధికార ప్రతినిధులు ఎస్.వి.ఎస్.చారి, సుధీర్‌రెడ్డిలతో కలిసి కిరణ్‌కుమార్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనన్న విషయం ఇటీవల మోదీ చేసిన వ్యాఖ్యలతో రుజువైందని పేర్కొన్నారు. రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎంల మధ్య ట్రయాంగిల్ లవ్‌స్టోరీ నడుస్తోందని చామల ఆరోపించారు.

కసిరెడ్డిపై ఫిర్యాదుకు సిద్ధమవుతున్న బీఆర్ఎస్

ఎమ్మెల్సీపై అనర్హత వేటు వేయించాలని యోచన

సాక్షి, హైదరాబాద్: కల్వకుర్తి అసెంబ్లీ టికెట్ దక్కలేదనే కారణంతో పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరిన శాసనమండలి సభ్యుడు కసిరెడ్డి నారాయణరెడ్డిపై అనర్హత వేటు వేయాలని కోరేందుకు బీఆర్ఎస్ సన్నద్ధమవుతోంది. వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఎమ్మెల్సీ కసిరెడ్డి పార్టీ మారినందున ఆయనపై చర్యలు తీసుకోవాలని ఒకటి, రెండు రోజుల్లో ప్రభుత్వ చీఫ్ విప్ ద్వారా మండలి చైర్మన్‌కు ఫిర్యాదు చేసే అవకాశమున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. అయితే కాంగ్రెస్ టికెట్‌ను ఆశిస్తూ పార్టీ మారిన ఎమ్మెల్సీ కసిరెడ్డి కూడా తన పదవికి రాజీనామా చేసే యోచనలో ఉన్నట్లు తెలిసింది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల జాబితా ప్రకటన తర్వాత ఎమ్మెల్సీ పదవికి రాజీనామాపై కసిరెడ్డి నిర్ణయం తీసుకునే అవకాశముంది.

బీఆర్ఎస్ అంటే.. భ్రష్టాచార్ రిష్వత్ సమితి

కేసీఆర్ పాలన రజాకార్లను తలపిస్తోంది

- వచ్చే ఎన్నికల్లో కుటుంబపాలన అంతం చేయాల్సిందే
- కశ్మీర్ టు తమిళనాడు తెలంగాణ దాకా ప్రాంతీయపార్టీలు.. కుటుంబ పార్టీలుగా ప్రజల ఆకాంక్షలను విస్మరించాయి
- రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా



రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో జ్యోతిని వెలిగిస్తున్న నడ్డా. చిత్రంలో డీకే అరుణ, వివేక్, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, బండి సంజయ్, కిషన్‌రెడ్డి, లక్ష్మణ్, ఈటల రాజేందర్

సాక్షి, హైదరాబాద్: 'బీఆర్ఎస్ అంటే భ్రష్టాచార్ (అవినీతి) రిష్వత్ (లంచగొండి) సమితి.. కేసీఆర్ పాలన రజాకార్లను తలపిస్తోంది..వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీఆర్ఎస్ కుటుంబపాలన అంతం కావడం ఖాయం. మోదీ ప్రభుత్వం తెచ్చిన ఎన్నో పథకాలు ఇక్కడ అమలు కాకుండా బీఆర్ఎస్ అడ్డుకుంటోంది. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలు కేసీఆర్ నెరవేర్చలేదు' అని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జగత్‌ప్రకాష్ నడ్డా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పేదలకు సింగిల్ బెడ్రూం గతి లేదు.. కానీ బీఆర్ఎస్ నేతలు డబుల్ బెడ్రూం అంటున్నారని ఎద్దేవా చేశారు. 'తెలంగాణలో బీజేపీ గెలవాలి. దీంతోపాటు మళ్లీ కేంద్రంలో అధికారంలోకి తీసుకురావాలి' అన్నారు. శుక్రవారం ఘట్‌కేసర్ సమీపంలోని ఓ కాలేజీలో జరిగిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో నడ్డా మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌తో సర్వశక్తులూ ఒడ్డి పోరాడి కేసీఆర్ కుటుంబపాలనను అంతం చేయాల్సిందేనని పిలుపునిచ్చారు.

9 ఏళ్లలో ఎంతో చేశాం...

మోదీ నాయకత్వంలో దేశం అగ్రగామిగా నిలిచిందని నడ్డా చెప్పారు. 'తెలంగాణ వికాసం కోసం కేంద్రం 9 ఏళ్లలో రూ.9 లక్షల కోట్లు కేటాయించింది. తెలంగాణలో 2 కోట్లమంది పేదలకు కేంద్రం రేషన్ ఇస్తోంది. ఎన్నో ఏళ్లు పాలించిన కాంగ్రెస్ తెలంగాణను ఎందుకు అభివృద్ధి చేయలేదు. ప్రధాని ఆవాస్ యోజన కింద దేశవ్యాప్తంగా 4 కోట్ల ఇళ్లు కేంద్రం నిర్మించింది. మరి తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం ఎన్ని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించింది' అని ప్రశ్నించారు. తెలంగాణకు మోదీ ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధి, పథకాలను ప్రజలకు వివరించాల్సిన అవసరం కార్యకర్తలపై ఉందని నడ్డా చెప్పారు.

ప్రతీ ఇంట్లో కమలం వికసించేలా కృషి చేయాలి..

'ప్రతీ ఇంట్లో కమలం వికసించేలా కృషి చేయాలని నడ్డా కోరారు. కాంగ్రెస్ గతంలో ప్రాంతీయ ఆకాంక్షలను విస్మరించింది. ఆ పార్టీ కూడా సోనియాగాంధీ ఆ తర్వాత రాహుల్‌గాంధీ వారసుల కుటుంబపార్టీగా మారింది. దీంతో కశ్మీర్, పంజాబ్ మొదలుకొని తమిళనాడు, తెలంగాణ దాకా ప్రాంతీయపార్టీలు ఏర్పడ్డాక కుటుంబ పార్టీలుగా రూపాంతరం చెంది ప్రజల ఆకాంక్షలను విస్మరించాయి. కేసీఆర్, కేటీఆర్, కూతురు, అల్లుడు, వారే ఉంటారు. కేసీఆర్‌కు ఒక సందేశం ఇస్తున్నా..వచ్చే ఎన్నికల్లో అన్నీ ముగిసిపోతాయని చెప్పారు.

60 రోజుల్లోనే ఎన్నికలు

ప్రతీ ఇంటికి వెళ్లండి..ప్రతీ ఒక్కరిని కలవండి..ప్రతీ గుండెను తట్టండి



రాష్ట్ర కౌన్సిల్ విస్తృత సమావేశంలో కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ప్రారంభ ఉపన్యాసం

సాక్షి, హైదరాబాద్: అరవై రోజుల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి.. పార్టీగా పోరాడేందుకు మనకు 50 రోజులే సమయం ఉందని కేంద్రమంత్రి, బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఘట్‌కేసర్ సమీపంలోని ఓ కాలేజీలో జరిగిన రాష్ట్ర కౌన్సిల్ విస్తృత సమావేశంలో ఆయన ప్రారంభ ఉపన్యాసం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతీ ఇంటికి వెళ్లండి.. ప్రతీ ఒక్కరిని కలవండి.. ప్రతీ గుండెను తట్టండి అని కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. 'కష్టపడి పనిచేద్దాం.18 నుంచి 30 ఏళ్లలోపు వారిని ఆకర్షిద్దాం.. కేసీఆర్ సర్కార్‌పై తీవ్ర వ్యతిరేకత ఉంది. మోదీ పాలనపై విశ్వాసం కలిగిద్దాం. ఆయన నాయకత్వంలో గోల్కొండ కోటపై.. తెలంగాణ అసెంబ్లీపై కాషాయజెండా రెపరెపలాడించడం ఖాయం. కేసీఆర్ అవినీతి, కుటుంబపాలనను సమాధి చేద్దాం' అంటూ కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు ఓటడిగే అర్హత లేదు

'తెలంగాణ సాధనలో ఎంతో మంది చనిపోవడానికి కాంగ్రెస్ సర్కార్ కారణం. తెలంగాణలో ఓటు అడిగే అర్హత ఆ పార్టీకి లేదు. బీజేపీ లేకుంటే.. సుష్మాస్వరాజ్ మద్దతివ్వకుంటే పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు పాస్ అయ్యేదా.? బిల్లు ప్రవేశపెట్టినప్పుడు కేసీఆర్ ఓటింగ్‌లో పాల్గొన్నాడా? అలాంటి వ్యక్తికి తెలంగాణను ఏలే హక్కు లేదు' అని కిషన్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో కొన్ని కుక్కలు ట్విట్టర్‌లో మొరుగుతున్నాయి. తండ్రిని అడ్డం పెట్టుకొని అధికారంలోకి వచ్చిన నాయకుడి స్థాయి ఎంత ? చదివింది అమెరికాలో.. థర్డ్ గ్రేడ్ లత్కోర్ మాటలు మాట్లాడుతున్నారు' అని కేటీఆర్‌ను ఉద్దేశించి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే దానికి వంతపాడడం మజ్లిస్‌కు అలవాటని కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థులు సూట్ కేసులతో దారుసలాం వెళ్లి అసదుద్దీన్‌కు వంగివంగి దండాలు పెట్టి.. తమ దగ్గర ఎంఐఎం అభ్యర్థిని పోటీలో పెట్టొద్దని బతిమాలుతున్నారన్నారు. నల్లగొండ, ముథోల్, భైంసా, నిర్మల్, ఆదిలాబాద్ తదితర చోట్ల మజ్లిస్ మతరాజకీయాలు రగిలించేందుకు కుట్ర చేస్తోందని ఆరోపించారు.

రాష్ట్ర కౌన్సిల్‌లో ఎవరేమన్నారంటే..

సాక్షి, హైదరాబాద్: బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశ వివరాలను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, ఎస్సీమోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ మీడియాకు చెప్పారు. తొమ్మిదేళ్లలో మోదీ ప్రభుత్వం తెలంగాణకు అందించిన సంక్షేమ కార్యక్రమాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రతినిధులకు తెలియజేశారు. అక్టోబరు 10న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలంగాణలో రెండు బహిరంగ సభల్లో పాల్గొంటారని, ఆ సభల్లో మోదీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను వివరిస్తారన్నారు. ఈ సమావేశాలకు 1200 మంది సమావేశాలకు హాజరయ్యారు.

- వచ్చే ఎన్నికల్లో విజయం సాధించేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్ దిశానిర్దేశం చేశారు.
- ఎన్నికల ప్రచార కార్యక్రమాలపై రాష్ట్ర ఇంచార్జ్ తరుణ్‌చుగ్ మాట్లాడారు.
- ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాత్మక విధానాలపై తెలంగాణ ఎన్నికల ఇంచార్జ్ ప్రకాశ్ జవదేకర్ మాట్లాడారు.
- విశ్వకర్మ యోజన కింద చేపడుతున్న వాటిపై బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ వివరించారు.

'పసుపుకుంకుమ'కు ప్రతిపాదన

- కల్యాణలక్ష్మి/షాదీముబారక్ కొనసాగిస్తూనే దీనిని అమలు చేస్తాం
- రూ.లక్ష సాయంతోపాటు వధువుకు తులం బంగారంతో తాళి, మెట్టెలు
- మేనిఫెస్టో కమిటీ చైర్మన్, మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు



సాక్షిప్రతినిధి, కరీంనగర్: కాంగ్రెస్ పార్టీ మరో జనాకర్షక పథకానికి రూపకల్పన చేసింది. కల్యాణ లక్ష్మి / షాదీముబారక్ పథకం కొనసాగిస్తూనే.. పసుపు కుంకుమ పేరిట వధువుకు తులం బంగారం, వెండి మెట్టెలు బహూకరించే యోచనలో ఉన్నట్టు ప్రకటించింది. శుక్రవారం కరీంనగర్ లోని డీసీసీ కార్యాలయంలో మేనిఫెస్టో కమిటీ భేటీ అయ్యింది. చైర్మన్, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ తదితరులు పలు విషయాలపై చర్చించారు. సమావేశంలో ఇప్పుడున్న షాదీముబారక్ ద్వారా రూ.లక్ష సాయం చేస్తూనే అదనంగా పసుపుకుంకుమ ద్వారా ఆడబిడ్డలందరికీ తులం బంగారంతో తాళిబొట్టు, వెండిమెట్టెలు కానుకగా ఇవ్వాలని జీవన్‌రెడ్డి ప్రతిపాదించారు. దీనికి సభ్యులంతా ఆమోదం తెలిపారు. అయితే, ఇది కేవలం తమ ప్రతిపాదనే అని, దీనిని గాంధీభవన్‌కు నివేదిస్తామని, వారుకూడా సానుకూలత తెలియజేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

సంక్షేమమే కాంగ్రెస్ ప్రధాన ధ్యేయం

రైతు, మహిళా సంక్షేమమే కాంగ్రెస్ ప్రధాన ధ్యేయమని, సోనియాగాంధీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు ప్రతీపౌరునికి అందేలా అమలు చేస్తామని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు అన్నారు. శుక్రవారం డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎకరాకు రూ.5వేలు రైతుబంధు రూపంలో జమచేసి, వరి పండించే ప్రతీ రైతునుంచి రూ.12 నుంచి రూ.14 వేలు తరుగు పేరిట దోపిడీ చేస్తోందని ఆరోపించారు. వచ్చేవారంలో మేనిఫెస్టో రూపొందిస్తామని చెప్పారు.

పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేస్తా

- కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి
- కాంగ్రెస్ అధ్యక్షుడిని కలసిన కమ్మ ఐక్యవేదిక సభ్యులు



సాక్షి, న్యూఢిల్లీ : వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నా నని కాంగ్రెస్ సీనియర్ నేత కె.జానారెడ్డి స్పష్టం చేశారు. వచ్చే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో తన కుటుంబం నుంచి పోటీ చేస్తున్నారని ఆయన తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో భేటీ అనంతరం మాజీ ఎంపీ రేణుకా చౌదరి నేతృత్వంలోని తెలంగాణ కమ్మ ఐక్యవేదిక సభ్యులతో కలసి జానారెడ్డి మీడియాతో మాట్లాడారు. అంతకుముందు రేణుకా చౌదరితో కలసి కమ్మ ఐక్యవేదికకు చెందిన పలువురు సభ్యులు మల్లికార్జున ఖర్గేను, కేసీ వేణుగోపాల్‌లను కలసి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కమ్మ సామాజికవర్గానికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. తర్వాత జానారెడ్డి మీడియాతో మాట్లాడారు.

ప్రజా చైతన్యంతో బీజేపీ, బీఆర్ఎస్ ఓటమి

తెలంగాణ ప్రజల పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జస్టిస్ చంద్రకుమార్



మలక్‌పేట (హైదరాబాద్): ప్రజల సొమ్మును కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతున్న బీజేపీ,, అవినీతి బీఆర్ఎస్ ఓటమి కోసం ప్రజలను చైతన్యపరుస్తామని తెలంగాణ ప్రజల పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జస్టిస్ బి.చంద్రకుమార్ చెప్పారు. మలక్‌పేట నల్లగొండ క్రాస్‌రోడ్ జమున టవర్స్‌లో ఏర్పాటు చేసిన పార్టీ రాష్ట్ర కార్యాలయాన్ని శుక్రవారం ప్రారంభించారు. అనంతరం పార్టీ నేతలు ప్రొఫెసర్ వెంకటరాజయ్య, అబ్దుల్ హాక్ కమర్, ఆయనాల కృష్ణారావు, సోగరా బేగంతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజల కోసం, సమాన న్యాయం కోసం తెలంగాణ ప్రజల పార్టీని 2018లో ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఉచిత వైద్యం, విద్య, లక్ష్యంగా ముందుకు సాగుతామని వివరించారు. రాబోయే ఎన్నికల్లో రెండు, మూడు చోట్ల పార్టీ అభ్యర్థులను పోటీకి దింపుతామని తెలిపారు.

బీజేపీకి బీఆర్ఎస్ రక్షణ నిధి!

- అందుకే ఆ పార్టీ అవినీతికి బీజేపీ రక్షణ కల్పిస్తోంది
- అసెంబ్లీ ఎన్నికల్లో విడిగా, పార్లమెంట్ ఎన్నికల్లో కలిసి పోటీ చేసేలా వారిమధ్య అవగాహన
- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆరోపణ
- ఖర్గే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన కసిరెడ్డి నారాయణరెడ్డి



శుక్రవారం ఢిల్లీలో ఖర్గే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన కసిరెడ్డి నారాయణరెడ్డి. చిత్రంలో ఠాక్రే, జూపల్లి, రేవంత్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో బీజేపీ స్టీరింగ్ అదానీ చేతిలో ఉంటే తెలంగాణలో బీఆర్ఎస్ స్టీరింగ్ ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ చేతిలో ఉందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి విమర్శించారు. బీజేపీకి బీఆర్ఎస్ ప్రొటెక్షన్ ఫండ్ (రక్షణ నిధి) ఇస్తున్నందున బీఆర్ఎస్ అవినీతికి బీజేపీ రక్షణ కల్పిస్తోందని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండూ కలిసే ఉన్నాయని ప్రజలకు అర్థం అయిందని అన్నారు. బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి శుక్రవారం ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిల సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రేవంత్‌రెడ్డి, కసిరెడ్డి మాట్లాడారు.

అవగాహనలో భాగంగానే మోదీ పర్యటనలు

అసెంబ్లీ ఎన్నికల్లో విడివిడిగా పోటీ చేసి, పార్లమెంట్ ఎన్నికల్లో కలిసి పోటీ చేసేలా బీఆర్ఎస్, బీజేపీ మధ్య అవగాహన కుదిరిందని రేవంత్ ఆరోపించారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్‌ను నిలువరించేందుకు ఏ విధంగా అయితే తమ ఓట్లన్నీ బీఆర్ఎస్‌కు బదిలీ అయ్యేలా బీజేపీ పథకం రచించిందో.. అదే విధంగా ఈసారి కూడా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారని అన్నారు. అందులో భాగంగానే ప్రధాని నరేంద్ర మోదీ ఇన్నిసార్లు తెలంగాణలో పర్యటిస్తున్నారని చెప్పారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ 9, బీజేపీ 7, ఎంఐఎం 1 స్థానంలో కలిసి పోటీ చేయనున్నాయని చెప్పారు.

బిల్లా, రంగాలు తెలంగాణను దోచుకున్నారు

గత కొద్దిరోజులుగా తెలంగాణలో బిల్లా, రంగాలు తిరుగుతున్నారని, తెలంగాణ ఉద్యమ సమయంలో ఒక రకమైన దోపిడీ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మరో రకమైన దోపిడీ చేశారని రేవంత్ ఆరోపించారు. అధికారాన్ని దుర్వినియోగపరుస్తూ కాళేశ్వరంలో వేల కోట్ల రూపాయలు, ధరణి రూపంలో వేల ఎకరాల భూములను బిల్లా, రంగాలు సంపాదించారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు ఏం చేసిందో తండ్రి కేసీఆర్‌ను అడగాలని మంత్రి కేటీఆర్‌కు సూచించారు. 2004లో సోనియాగాంధీ బిచ్చమేస్తే ఎమ్మెల్యే కాకుండానే హరీశ్‌రావు మంత్రి అయిన విషయం మరిచిపోయారా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు మరుగుజ్జులు అయితే కేసీఆర్ ఏమైనా బాహుబలా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబట్లో తెడ్డులా బీజేపీ ఉందని, వారికి అభ్యర్థులు లేరు.. మేనిఫెస్టో లేదని రేవంత్ విమర్శించారు. ఏఐసీసీ నేత వంశీచంద్ రెడ్డి తాను పోటీ చేసే స్థానాన్ని కసిరెడ్డికి ఇచ్చినందుకు అభినందిస్తున్నానని అన్నారు. కాగా కల్వకుర్తి నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడిందని కసిరెడ్డి చెప్పారు. ప్రాజెక్టుకు కల్వకుర్తి పేరు పెట్టారు తప్ప నీళ్లు మాత్రం పారలేదని విమర్శించారు. రాష్ట్రంలో అధికార పార్టీ ఎమ్మెల్యేలపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని పేర్కొన్నారు.

బీజేపీ డకౌట్.. కాంగ్రెస్ రనౌట్

కేసీఆర్ సిక్సర్ ఖాయం

- రేవంత్.. పదేళ్ల పాలనపై చర్చకు మేం రెడీ
- కోరుట్ల ప్రజా ఆశీర్వాదసభలో మంత్రి హరీశ్‌రావు



కోరుట్ల సభలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

సాక్షి, కామారెడ్డి / డిచ్‌పల్లి / కోరుట్ల / తంగళ్లపల్లి: ఎన్ని జిమ్మిక్కులు చేసినా సరే..వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ డకౌట్, కాంగ్రెస్ రనౌట్ కావడం ఖాయమని రాష్ట్ర వైద్య,ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. శుక్రవారం జగిత్యాల, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో మంత్రి హరీశ్‌రావు పర్యటించారు. కోరుట్ల ప్రజా ఆశీర్వాదసభలో మంత్రి మాట్లాడుతూ 'పదేళ్ల కాంగ్రెస్ పాలనకు, పదేళ్ల బీఆర్ఎస్ పాలనకు చర్చ పెడదామని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ అన్నాడు కదా.. మేంరెడీ.. ఎవరి పాలనలో ఏం జరిగిందో అందరికీ తెలుసు. మీకు..మాకు నక్కకు నాగలోకానికి ఉన్న తేడా ఉందని' హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పదేళ్ల పాలనలో కరెంటు కోతలు, సాగునీటి వెతలు, ఎరువుల కోసం క్యూలు, తాగునీటికి తండ్లాటలు ప్రజలు మర్చిపోలేదన్నారు. తమ పాలనలో ఎస్సారెస్పీ నీరు కాకుంటే కాళేశ్వరం నీటితో ఏటా రెండు పంటలు, ఇంటింటికి తాగునీరు, ఇరవై నాలుగు గంటలు కరెంటు, రైతుబంధు ఇచ్చిమరీ ఆదుకుంటున్నామని చెప్పారు. ఈ సమావేశంలో కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, కోరుట్ల బీఆర్ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ ఎగిరేది గులాబీ జెండానే

'బీజేపీకి జాకీలు పెట్టి లేపినా లేచే పరిస్థితి లేదు. కాంగ్రెస్ గెలవదు. కేసీఆరే మళ్లీ సీఎం అవడం ఖాయం. పొరుగున బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో పరిస్థితులు చూసి పోల్చుకొని ఓట్లు వేయండి' అని మంత్రి టి.హరీశ్ రావు అన్నారు. బిచ్కుందలో హరీశ్‌రావు మాట్లాడుతూ పొరుగున ఉన్న మహారాష్ట్రలో బీజేపీ అధికారంలో ఉన్నా నాందేడ్ ఆస్పత్రిలో మందులు, సూదులు లేక 40 మంది పిల్లలు చనిపోయారన్నారు. ఇంకో పక్కన ఉన్న కర్ణాటకలో అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో ఓట్ల కొనుగోలు కోసం తెలంగాణ ట్యాక్స్ వసూలు చేస్తోందని ఆరోపించారు. మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యేలు హన్మంత్ సింధే, బాజిరెడ్డి గోవర్దన్, గణేశ్‌గుప్తా పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓటేస్తే కైలాసం ఆటలో పెద్దపాము మింగినట్టే

కాంగ్రెస్‌కు ఓటు వేస్తే కైలాసం ఆటలో పెద్ద పాము మింగినట్లేనని.. ప్రజల బతుకులు ఆగమవుతాయని మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఇల్లంతకుంట సభలో హరీశ్‌రావు మాట్లాడుతూ ఒకప్పుడు ఇల్లంకుంటలో పత్తి మాత్రమే పండేదని.. ఇక్కడ పనిలేక వేరే ప్రాంతానికి ఆటోలలో కూలీలు వెళ్లిన రోజులు ఉన్నాయని.. నేడు ఇక్కడే పనిచేసేందుకు కూలీలు దొరకని పరిస్థితి వచ్చిందన్నారు. పదేళ్లలో ఎట్లున్న తెలంగాణ.. ఎట్లయిందో ప్రజలు గుర్తించాలని కోరారు. మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ వచ్చేది ఇచ్చేదీ కేసీఆరే

గ్రేటర్ వరంగల్ పర్యటనలో కేటీఆర్

- రాజకీయ పర్యాటకుల్ని అస్సలు నమ్మొద్దు
- ఎన్నికలు రాగానే సంక్రాంతికి గంగిరెద్దులోళ్లు వచ్చినట్లు ప్రతిపక్షాలు వస్తాయి
- బీజేపీ, కాంగ్రెస్ నేతలకు వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పండి
- ఆ రెండు పార్టీల వల్లే తెలంగాణ ఏర్పాటులో ఆలస్యం
- రూ.900 కోట్ల విలువైన అభివృద్ధి పథకాలకు ప్రారంభోత్సవాలు



వరంగల్ సభలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

సాక్షి ప్రతినిధి, వరంగల్: ఎన్నికల టైం కాబట్టి పొలిటికల్ టూరిస్టులు వస్తున్నారని, కేవలం ఎన్నికలప్పుడు వచ్చే ఆ పొలిటికల్ టూరిస్టుల మాటల నమ్మి ఆగం కావద్దని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికలు రాగానే సంక్రాంతికి గంగిరెద్దులోళ్లు వచ్చినట్లు ప్రతిపక్షాలు వస్తాయని, పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్టు.. కేసీఆర్ పథకాలను కాపీకొట్టి, నాలుగు ఓట్లు డబ్బాలో వేయించుకోవాలని ప్రయత్నం చేసేవారిని అస్సలు నమ్మవద్దని కోరారు. స్కీములు అమలవుతున్న తెలంగాణలో 'స్కాములు'చేసేందుకు వస్తున్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులకు వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాకముందు, వచ్చాక ఎలా ఉందో గమనించాలని, కులమత భేదాలు లేకుండా అడగకున్నా ఇప్పటివరకు ప్రజలకు ఇచ్చింది కేసీఆరేనని, మళ్లీ వచ్చేది, ఇచ్చేది కూడా కేసీఆరేనని స్పష్టం చేశారు. కేటీఆర్ శుక్రవారం గ్రేటర్ వరంగల్ నగరంలో సుడిగాలి పర్యటన చేశారు. హనుమకొండ, వరంగల్, కాజీపేట ట్రైసిటీలో సుమారు రూ.900 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మడికొండలో క్వాడ్రంట్ సాఫ్ట్‌వేర్ కంపెనీని ప్రారంభించారు. ఈ సందర్భంగా హనుమకొండ 'కుడా'మైదానంలో ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయభాస్కర్ అధ్యక్షతన, ఖిలా వరంగల్ గ్రౌండ్‌లో ఎమ్మెల్యే నరేందర్ అధ్యక్షతన జరిగిన ప్రగతి నివేదన బహిరంగ సభల్లో ప్రసంగించారు.

వంచించాలని చూస్తే పుట్టగతులుండవ్..

తెలంగాణ ప్రజలను ఇంకా మాయమాటలతో వంచించాలని చూస్తే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు పుట్టగతులుండవని కేటీఆర్ హెచ్చరించారు. 60 ఏళ్ల అధికారంలో ఉన్నప్పుడు ఏమీ చేయలేని కాంగ్రెస్ వాళ్లు ఇప్పుడు ఏదో చేస్తామంటే ఎలా నమ్ముతామని, అధికారం ఉన్నచోట అభివృద్ధిని విస్మరించిన బీజేపీ ఇక్కడేమి చేస్తుందని ప్రశ్నించారు. అధికారం కోసం ప్రతిపక్షాలు చెప్పే మాటలు నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. 'చరిత్రలో వాస్తవాలు దాచినా దాగవు. 1956లో హైదరాబాద్ సంస్థానం ఒక రాష్ట్రంగా ఉంటే.. బలవంతంగా తీసుకుపోయి ఆంధ్రాలో కలిపింది కాంగ్రెస్సే. 1968లో తెలంగాణ ఉద్యమంలో భాగంగా ఖమ్మం, వరంగల్‌లో అందరూ కలిసి కదం తొక్కితే ఆ రోజు కర్కశకంగా 370 మంది పిల్లల్ని పిట్టల్లా కాల్చి చంపింది. 30 ఏళ్ల తర్వాత 2001లో గులాబీ జెండా ఎగిరితే అదిరిపోయి కాంగ్రెస్ తెలంగాణ నినాదాన్ని అందుకుంది. తెలంగాణ ఇస్తామని నమ్మబలికి 2004లో పొత్తు పెట్టుకుని 2014 వరకు పదేళ్లు చావగొట్టింది. వేలమంది చావులను కళ్ల చూసిన తర్వాత.. మీ అందరి పోరాటంతో ప్రజాశక్తి ముందు తలవంచక తప్పని పరిస్థితి వస్తే అనివార్యంగా కాంగ్రెస్, బీజేపీ కలిసొచ్చాయి. విధిలేని పరిస్థితుల్లోనే తెలంగాణ జపం చేశాయి..'అని కేటీఆర్ చెప్పారు.

ఉద్యమానికి ఊపిరిలూదింది ఓరుగల్లే..

'తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ఉద్యమానికి ఊపిరిలూదింది ఓరుగల్లు గడ్డే. మీ అందరికీ రుణపడి ఉంటాం. వరంగల్‌లో 24 అంతస్తుల్లో అతిపెద్ద ఆస్పత్రి నిర్మిస్తున్నాం. దసరా నాటికి అది పూర్తవుతుంది. కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత అన్ని జిల్లాల్లో బ్రహ్మాండంగా మెడికల్ కాలేజీలు వచ్చాయి. ప్రభుత్వ ఖర్చుతో మన పిల్లలు డాక్టర్లు అయ్యే పరిస్థితి ఏర్పడింది. త్వరలోనే సీఎం శుభవార్త చెబుతారు. ఆసరా పెన్షన్లు ఎంతో పెంచబోతున్నామో స్వయంగా కేసీఆరే ప్రకటిస్తారు. కేసీఆర్ మత రాజకీయం చెయ్యరు. ఆయన అన్ని మతాలను సమానంగా చూసే నాయకుడు..'అని మంత్రి అన్నారు.

భవిష్యత్ అంతా ద్వితీయ శ్రేణి నగరాలదే..

'దేశంలో భవిష్యత్ అంతా ద్వితీయశ్రేణి నగరాలదే. రాబోయే పదేళ్లలో హైదరాబాద్‌కు వరంగల్‌కు తేడా ఉండదు. మడికొండ ఐటీ పార్కులో నూతనంగా నిర్మించిన క్వాడ్రంట్ సాఫ్ట్‌వేర్ కంపెనీ ద్వారా 500 మందికి ఉపాధి లభిస్తుంది. స్థానికంగా యువతకు ఉపాధి కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం వరంగల్, ఖమ్మం, నల్లగొండ వంటి నగరాలు, పట్టణాలకు పరిశ్రమలు తీసుకువస్తోంది. వరంగల్‌లోనే కాదు ఏపీలోని భీమవరం, నెల్లూరుకూ ఐటీ సంస్థలు రావాలి. అక్కడా ఐటీ సంస్థలు పెట్టాలని ఎన్నారైలను కోరుతున్నా. కావాలంటే జగనన్నకు చెప్పి నేను మీకు జాగా ఇప్పిస్తా. బెంగళూరు ఐటీ రంగంలో 40 శాతం తెలుగువాళ్లే. అక్కడి నుంచి వచ్చేందుకు తెలుగు ఐటీ ఉద్యోగులు సిద్ధంగా ఉన్నారు. ఉన్నచోటే మన యువతకు ఉపాధి దక్కేలా చూద్దాం..'అని కేటీఆర్ అన్నారు. వినయన్న మాస్ లీడర్ అంటూ అభినందించారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎంపీ పసునూరు దయాకర్, ఎమ్మెల్యేలు ఆరూరి రమేష్, నన్నపనేని నరేందర్, చల్లా ధర్మారెడ్డి, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, కడియం శ్రీహరి, వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి రియల్టీ
శనివారం
7-10-2023



కొనుగోలు ప్రాధమ్యాలివే..

సాక్షి, హైదరాబాద్: గృహ కొనుగోలుదారుల అభిరుచులు మారుతున్నాయి. గతంలో ధర ప్రాధాన్యంగా గృహ కొనుగోలు నిర్ణయం తీసుకునే కస్టమర్లు.. ఆ తర్వాత వసతులను పరిగణనలోకి తీసుకున్నారు. కానీ, కరోనా తర్వాతి నుంచి ఆరోగ్యంపై శ్రద్ధ పెరగడంతో ఇంటి ఎంపికలోనూ ఇదే ధోరణి అవలంబిస్తున్నారు. ధర, సౌకర్యాలే కాదు ఇంటికి చేరువలో ఎలాంటి మౌలిక వసతులు ఉన్నాయి? ఆఫీసులు, వినోద కేంద్రాలు ఎంత దూరంలో ఉన్నాయనే అంశాలను సైతం పరిగణనలోకి తీసుకొని గృహాలను ఎంపిక చేస్తున్నారు.


- ఇల్లు విశాలంగా ఉండటమే కాదు కమ్యూనిటీలో సకల సౌకర్యాలు ఉండాలనేది నేటి గృహ కొనుగోలుదారుల మాట. పిల్లల కోసం క్రీడా సదుపాయాలు, పెద్దలకు క్లబ్ హౌస్, జిమ్, స్విమ్మింగ్ పూల్ వంటి సదుపాయాలు ఉండాలని భావిస్తున్నారు. ఎక్కువ ఖాళీ స్థలం వదిలి, పచ్చదనం ఇష్టపడుతున్నారు.
- చిన్న కుటుంబాల నేపథ్యంలో పిల్లల ఆలనాపాలనా చూసే డే కేర్ సౌకర్యాలు ఉండాలని గృహ కొనుగోలుదారులు చూస్తున్నా రు. భార్యాభర్తలిద్దరూ కార్యాలయాలకు వెళితే పిల్లలను చూసుకోవడం కష్టం అవుతుంది. వర్క్ ఫ్రం హోమ్ ఉన్నా పిల్లలపై శ్రద్ధ పెట్టలేని పరిస్థితి. కాబట్టి కమ్యూనిటీలో డే కేర్ సదుపాయాలు ఉండాలని కోరుకుంటున్నారు.
- ఇల్లు కొనేటప్పుడు ఆఫీసుకు ఎంత దూరంలో ఉందనేది కస్టమర్ల ప్రాధమ్యాలలో ఒకటి. నగరంలో ట్రాఫిక్‌లోనే అధిక సమయం వృథా అవుతుంది కాబట్టి దూరం, సమయం అనేది ప్రధానంగా మారాయి. ప్రజా రవాణా సౌకర్యాలు ఎలా ఉన్నాయనేది పరిశీలించాకే నిర్ణయం తీసుకుంటున్నారు.
- వీకెండ్ వస్తే కుటుంబంతో కలిసి ఆహ్లాదంగా గడిపేందుకు షాపింగ్ మాల్స్, థియేటర్లు ఎంత దూరంలో ఉన్నాయనేవి కూడా కొనుగోలు ఎంపికలో భాగమైపోయాయి.

జీఎస్టీ ఎవరు కట్టాలి?

- ల్యాండ్ ఓనర్, బిల్డర్ల మధ్య సందిగ్ధం
- కొత్తవైనా, రీ-డెవలప్‌మెంట్ అయినా 5 శాతం జీఎస్టీ
- చెల్లించాల్సిన బాధ్యత బిల్డర్‌దే

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లో గృహాలకు డిమాండ్ పెరుగుతుంది. మెరుగైన మౌలిక వసతులు, పారిశ్రామిక ప్రగతి కారణంగా కొత్త ప్రాంతాలలో అభివృద్ధి పరుగులు పెడుతుంది. మరోవైపు ప్రధాన నగరంలో స్థలం కొరత కారణంగా గృహ నిర్మాణానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పాత ఇళ్లను కూల్చివేసి వాటి స్థానంలో కొత్తవి నిర్మించడం మినహా నిర్మాణదారులకు ప్రత్యామ్నాయం లేదు. ఖైరతాబాద్, అబిడ్స్, బేగంపేట, సనత్‌నగర్, ఈఎస్ఐ, బంజారాహిల్స్ వంటి ప్రాంతాలలో ఇలాంటి రీ-డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్‌లు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇండిపెండెంట్ హౌస్‌లు, నాలుగైదు అంతస్తుల అపార్ట్‌మెంట్లను కూల్చేసి ఆ స్థలంలో హైరైజ్ భవనాలను నిర్మిస్తున్నారు. ఇందుకోసం భూ యజమానులు, ఫ్లాట్ ఓనర్లతో బిల్డర్లు డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ చేసుకుంటారు. ఖాళీ స్థలాలను అభివృద్ధికి తీసుకుంటే 50 నుంచి 40 శాతం, ప్రాంతాన్ని బట్టి 60 శాతం ఫ్లాట్లను భూ యజమానికి ఇస్తామని ఒప్పందం చేసుకుంటారు. మిగిలిన వాటినే డెవలపర్ అమ్ముకుంటాడు.

- కూల్చి కట్టినా, ఖాళీ ప్రదేశంలో కొత్త భవనాలు కట్టినా పూర్తయిన ఇళ్లకు వస్తు సేవల పన్ను (జీఎస్టీ) చెల్లించాల్సి ఉంటుంది. భూ యజమాని వాటా కింద వచ్చిన జీఎస్టీ ఎవరు చెల్లించాలనే అంశంపై ల్యాండ్ ఓనర్లకు, బిల్డర్లకు మధ్య వాగ్వాదం నెలకొంటుంది. డెవలపరే చెల్లించాలని భూ యజమాని, ల్యాండ్ ఓనరే కట్టాలని బిల్డర్ల మధ్య సందిగ్ధం నెలకొంది. భవనం కట్టడంతో స్థలం విలువ పెరిగిందని, దీంతో 5 శాతం జీఎస్టీ చెల్లించాలని ప్రభుత్వం బిల్డర్‌కు నోటీసులు పంపిస్తుంది. వాస్తవానికి కొత్తవైనా, పాతవైనా భవనానికి జీఎస్టీ చెల్లించాల్సిన బాధ్యత బిల్డర్‌దే. కాకపోతే భూ యజమాని, కస్టమర్ల నుంచి బిల్డర్ జీఎస్టీ వసూలు చేసి కట్టాల్సింది డెవలపరే.



2.18 లక్షల కోట్లు!



- స్థిరాస్తి రంగంలోకి ఎఫ్ఐఐ వెల్లువ
- 70% యూఎస్, కెనడాల నుంచే
- గత ఆరేళ్లతో పోలిస్తే 3 రెట్లు అధికం
- కొలియర్స్ నివేదిక వెల్లడి

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ పెట్టుబడిదారులకు స్థిరాస్తి రంగం హాట్‌కేక్‌లా మారింది. దీంతో దేశీయ స్థిరాస్తి రంగంలోకి విదేశీ పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయి. పెట్టుబడి లావాదేవీలలో పారదర్శకత, విధానపరమైన సంస్కరణలు, వ్యాపారాలకు ప్రోత్సాహం, పారిశ్రామిక రంగంలో సాంకేతికత వంటివి ఇన్వెస్టర్ల ఆకర్షణకు ప్రధాన కారణాలని కొలియర్స్ నివేదిక వెల్లడించింది.

- 2017-22 మధ్య కాలంలో దేశీయ స్థిరాస్తి రంగంలోకి 32.9 బిలియన్ డాలర్ల సంస్థాగత పెట్టుబడులు వచ్చాయి. అదే 2011-16 మధ్య కాలంలో అయితే 25.8 బిలియన్ డాలర్లు వచ్చాయి. అయితే ఈ ఇన్వెస్ట్‌మెంట్స్‌లో విదేశీ సంస్థాగత పెట్టుబడుల (ఎఫ్ఐఐ) వాటా 2017-22 మధ్య కాలంలో రూ.2.18 లక్షల కోట్లు (26.6 బిలియన్ డాలర్లు), కాగా.. 2011-16లో కేవలం 8.2 బిలియన్ డాలర్లు మాత్రమే. గత ఆరేళ్ల కాలంతో పోలిస్తే 2017-22లో విదేశీ సంస్థాగత పెట్టుబడులు మూడు రెట్లు అధికంగా వచ్చాయని కొలియర్స్ ఇండియా నివేదిక వెల్లడించింది.
- ఈ విదేశీ సంస్థాగత పెట్టుబడులలో 70 శాతం అమెరికా, కెనడా దేశాల నుంచే వచ్చాయి. యూఎస్ నుంచి 11.1 బిలియన్ డాలర్లు, కెనడా నుంచి 7.5 బిలియన్ డాలర్లు, సింగపూర్ నుంచి 6 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయి. మన దేశంలో ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల కల్పన తదితర కారణాలతో అంతర్జాతీయ సంస్థలు ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

అట్టహాసంగా నరెడ్కో ప్రాపర్టీ షో


జ్యోతి ప్రజ్వలనం చేస్తున్న ఎమ్మెల్సీ టీ భానుప్రసాద్ రావు నరెడ్కో తెలంగాణ ప్రతినిధులు

సాక్షి, హైదరాబాద్: నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (నరెడ్కో) తెలంగాణ 13వ ప్రాపర్టీ షో హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమైంది. ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్సీ టీ భానుప్రసాద్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ విప్లవాత్మక విధానాలతో ఐటీ రంగంతో పాటు ఫార్మా, ఏవియేషన్, ఆటోమొబైల్ వంటి అన్ని రంగాలలో జోరుగా పెట్టుబడులు వస్తున్నాయని, దీంతో ఆయా రంగాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. బహుళ జాతి కంపెనీలకు హైదరాబాద్ పెట్టుబడుల కేంద్రంగా మారిందని చెప్పారు. ఐటీ ఉద్యోగ అవకాశాలు పెరిగాయని, దీంతో గృహ విభాగంలో డిమాండ్ ఏర్పడిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలతో హైదరాబాద్‌తోపాటు ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాలలో కూడా స్థిరాస్తి రంగం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. జిల్లాలో పట్టణీకరణ పెరగడంతో చాలా మంది కొనుగోలుదారులు ఓపెన్ ప్లాట్లు, అపార్ట్‌మెంట్లను కొనుగోలు చేస్తున్నారని తెలిపారు.

- నరెడ్కో తెలంగాణ ప్రెసిడెంట్ బీ సునీల్ చంద్రారెడ్డి మాట్లాడుతూ.. మెరుగైన మౌలిక వసతులు, కనెక్టివిటీతో ప్రధాన నగరంతో పాటు శివారు ప్రాంతాలలో రియల్ ఎస్టేట్ పరుగులు పెడుతుందని చెప్పారు. స్థిరాస్తిలో పెట్టుబడులకు ఇదే సరైన సమయమన్నారు.
- జనరల్ సెక్రటరీ విజయసాయి మేక మాట్లాడుతూ.. నరెడ్కో తెలంగాణ కేవలం స్థిరాస్తి రంగానికి మాత్రమే పరిమితం కాలేదని, ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలలోనూ భాగస్వామ్యం అవుతున్నామని చెప్పారు. రెరా సర్టిఫికెట్ పొందిన ప్రాజెక్ట్‌లు, లావాదేవీలలో పారదర్శకత ఉండే ప్రాజెక్ట్‌లను మాత్రమే ప్రాపర్టీలో ఉన్నాయని, కొనుగోలుదారులు ధైర్యంగా నిర్ణయం తీసుకోవచ్చని సూచించారు.

నేడు, రేపు కూడా..

మూడు రోజుల ఈ ప్రాపర్టీ షో శని, ఆదివారం కూడా ఉంటుంది. ప్రవేశం ఉచితం. ఈ ప్రదర్శనలో వందకు పైగా డెవలపర్లు, ఆర్థిక సంస్థలు ఈ ప్రదర్శనలో తమ స్టాళ్లను ఏర్పాటు చేశాయి. సుమారు నగరంలో నలుమూలలో నిర్మాణంలో ఉన్న, పూర్తయిన 300లకు పైగా ప్రాజెక్ట్‌లు ప్రదర్శనలో ఉన్నాయి. ఓపెన్ ప్లాట్లు, అపార్ట్‌మెంట్లు, విల్లాలు, ఫామ్ ల్యాండ్స్ ఇలా అన్ని రకాల ప్రాపర్టీలు అందుబాటులో ఉన్నాయి. ఎస్‌బీఐ, ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, కొటక్ హోమ్ లోన్స్ వంటి బ్యాంకులు, ఆర్థిక సంస్థలు కూడా ప్రదర్శనలో స్టాళ్లను ఏర్పాటు చేశాయి.

సాక్షి స్పోర్ట్స్
శనివారం
7-10-2023



ఆసియా క్రీడల చెస్: పతకాల రేసులో భారత మహిళల, పురుషుల జట్లు

వ్యక్తిగత విభాగాల్లో పతకాలు సాధించలేకపోయిన భారత చెస్ క్రీడాకారులు టీమ్ విభాగంలో పతకాల రేసులో నిలిచారు. ఆసియా క్రీడల చెస్ టీమ్ ఈవెంట్‌లో ఎనిమిదో రౌండ్ పూర్తయ్యాక అర్జున్, ప్రజ్ఞానంద, విదిత్, గుకేశ్, హరికృష్ణలతో కూడిన భారత పురుషుల జట్టు...హంపి, హారిక, వైశాలి, వంతిక, సవితాశ్రీలతో కూడిన భారత మహిళల జట్టు 13 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్నాయి. ఎనిమిదో రౌండ్‌లో భారత మహిళల జట్టు 4-0తో హాంకాంగ్‌పై... భారత పురుషుల జట్టు 3.5-0.5తో దక్షిణ కొరియాపై గెలిచింది. హాంకాంగ్‌తో జరిగిన మ్యాచ్‌లో హారిక, వైశాలి, వంతిక, సవితాశ్రీ తమ ప్రత్యర్థులపై గెలిచారు. పురుషుల జట్టు తరఫున అర్జున్, గుకేశ్, ప్రజ్ఞానంద నెగ్గగా... హరికృష్ణ తన గేమ్‌ను 'డ్రా' చేసుకున్నాడు. నేడు జరిగే చివరిదైన తొమ్మిదో రౌండ్‌లో ఫిలిప్పీన్స్‌తో భారత పురుషుల జట్టు...కొరియాతో భారత మహిళల జట్టు తలపడతాయి. ఈ రౌండ్‌లో భారత జట్లు గెలిస్తే పతకాలను ఖాయం చేసుకుంటారు.



హాకీలో పసిడి వెలుగులు

- స్వర్ణ పతకం గెలిచిన భారత పురుషుల జట్టు
- ఫైనల్లో జపాన్‌పై 5-1 గోల్స్‌తో ఘనవిజయం
- ఆసియా క్రీడల చాంపియన్ హోదాలో పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత
- నేడు పతకాల్లో 'సెంచరీ' మైలురాయి దాటనున్న భారత బృందం



ఏ లక్ష్యంతోనైతే చైనా గడ్డపై భారత పురుషుల హాకీ జట్టు అడుగుపెట్టిందో దానిని దిగ్విజయంగా అందుకుంది. ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకం సాధించి వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్ క్రీడలకు నేరుగా అర్హత పొందాలన్న లక్ష్యాన్ని టీమిండియా సాధించింది. డిఫెండింగ్ చాంపియన్ జపాన్ జట్టుతో జరిగిన ఫైనల్లో హర్మన్‌ప్రీత్ సింగ్ నాయకత్వంలోని భారత హాకీ జట్టు ఆద్యంతం ఆధిపత్యం చలాయించి ఏకపక్ష విజయాన్ని నమోదు చేసింది. పోటీల 13వ రోజు భారత్ ఖాతాలో మొత్తం తొమ్మిది పతకాలు చేరాయి. ఆర్చరీలో రజతం, కాంస్యం... రెజ్లింగ్‌లో మూడు కాంస్యాలు... బ్రిడ్జ్, సెపక్‌తక్రా, బ్యాడ్మింటన్‌లో ఒక్కో కాంస్య పతకం లభించాయి. ప్రస్తుతం భారత్ 95 పతకాలతో నాలుగో స్థానంలో ఉంది. నేడు క్రికెట్, ఆర్చరీ, కబడ్డీ, మహిళల హాకీ, చెస్, రోలర్ స్కేటింగ్, రెజ్లింగ్, బ్యాడ్మింటన్ క్రీడాంశాల్లో భారత క్రీడాకారులు పతకాల బరిలో ఉన్నారు. క్రికెట్, ఆర్చరీ, కబడ్డీ, బ్యాడ్మింటన్ ద్వారా భారత్‌కు కచ్చితంగా ఏడు పతకాలు రానున్నాయి. ఈ నేపథ్యంలో ఆసియా క్రీడల చరిత్రలో భారత్ తొలిసారి నేడు అధికారికంగా 100 పతకాల మైలురాయిని దాటనుంది.

హాంగ్జౌ: పక్కా ప్రణాళికతో, పూర్తిస్థాయిలో సన్నద్ధమై ఆసియా క్రీడల్లో అడుగుపెట్టిన భారత పురుషుల హాకీ జట్టు తమ లక్ష్యాన్ని సాధించింది. లీగ్ దశ నుంచి ప్రత్యర్థి జట్లపై పూర్తి ఆధిపత్యం కనబరిచిన టీమిండియా తుది పోరులోనూ ఈ దూకుడు కొనసాగించింది. దాంతో ఆసియా క్రీడల్లో తొమ్మిదేళ్ల తర్వాత మళ్లీ పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది. డిఫెండింగ్ చాంపియన్ జపాన్ జట్టుతో శుక్రవారం జరిగిన ఫైనల్లో హర్మన్‌ప్రీత్ సింగ్ సారథ్యంలోని భారత జట్టు 5-1 గోల్స్ తేడాతో ఘనవిజయం సాధించింది. తద్వారా ఆసియా క్రీడల విజేత హోదాలో టీమిండియా వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్ క్రీడలకు నేరుగా అర్హత పొందింది. జపాన్‌తో జరిగిన తుది పోరులో భారత్ తరఫున కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ (32వ, 59వ ని.లో) రెండు గోల్స్ చేయగా... అమిత్ రోహిదాస్ (36వ ని.లో), మన్‌ప్రీత్ సింగ్ (25వ ని.లో), అభిషేక్ (48వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. జపాన్ జట్టుకు సెరెన్ తనాకా (51వ ని.లో) ఏకైక గోల్ అందించాడు. ఓవరాల్‌గా ఆసియా క్రీడల్లో భారత్ నాలుగోసారి స్వర్ణ పతకం సాధించింది. 1966 బ్యాంకాక్, 1998 బ్యాంకాక్, 2014 ఇంచియోన్ ఆసియా క్రీడల్లోనూ భారత్ బంగారు పతకాలు సొంతం చేసుకుంది. కాంస్య పతక మ్యాచ్‌లో దక్షిణ కొరియా 2-1తో చైనా జట్టుపై గెలిచింది. హర్మన్‌ప్రీత్ 13 గోల్స్‌తో టోర్నీ టాప్ స్కోరర్‌గా నిలిచాడు. జపాన్ జట్టును ఏమాత్రం తక్కువ చేయకుండా ఆడిన భారత్ అవకాశం వచ్చినపుడల్లా ప్రత్యర్థి గోల్‌పోస్ట్ వైపు దూసుకెళ్లింది. ఈ క్రమంలో కొన్నిసార్లు గోల్ చేసే అవకాశాలను చేజార్చుకుంది. తొలి 25 నిమిషాల వరకు భారత్‌ను నిలువరించిన జపాన్ ఆ తర్వాత తడబడింది. అభిషేక్ 'డి' ఏరియా వద్ద నుంచి కొట్టిన రివర్స్ షాట్‌ను జపాన్ గోల్‌కీపర్ నిలువరించాడు. తిరిగి వచ్చిన బంతిని అక్కడే ఉన్న మన్‌ప్రీత్ లక్ష్యానికి చేర్చడంతో భారత్ ఖాతా తెరిచింది. ఆ తర్వాత భారత్ జోరు పెంచగా... జపాన్ డీలా పడింది.

'క్రికెట్' ఫైనల్లో భారత్

తొలిసారి ఆసియా క్రీడల్లో ఆడుతున్న భారత క్రికెట్ జట్టు స్వర్ణ పతకానికి విజయం దూరంలో నిలిచింది. టి20 ఫార్మాట్‌లో జరుగుతున్న ఈ క్రీడల్లో టీమిండియా ఫైనల్ చేరింది. సెమీఫైనల్లో భారత్ తొమ్మిది వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌ను ఓడించింది. నేడు జరిగే ఫైనల్లో అఫ్గానిస్తాన్‌తో భారత్ ఆడుతుంది. రెండో సెమీఫైనల్లో అఫ్గానిస్తాన్ నాలుగు వికెట్ల తేడాతో పాకిస్తాన్‌ను ఓడించింది. బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ 97 పరుగుల లక్ష్యాన్ని 9.2 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి అందుకుంది. భారత్ తరఫున హైదరాబాద్ క్రికెటర్ తిలక్ వర్మ (26 బంతుల్లో 55 నాటౌట్; 2 ఫోర్లు, 6 సిక్స్‌లు), రుతురాజ్ గైక్వాడ్ (26 బంతుల్లో 40 నాటౌట్; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్ ఆడారు. అంతకుముందు బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 96 పరుగులు చేసింది. భారత బౌలర్లలో సాయికిశోర్ 3 వికెట్లు, వాషింగ్టన్ సుందర్ 2 వికెట్లు తీశారు.



రజత పతకాలతో ధీరజ్, అతాను దాస్, తుషార్

రికర్వ్‌లో తొలిసారి రజతం

ఆసియా క్రీడల ఆర్చరీ రికర్వ్ విభాగంలో భారత్ 13 ఏళ్ల పతక నిరీక్షణకు హాంగ్జౌలో తెర పడింది. చివరిసారి 2010 గ్వాంగ్‌జౌ ఏషియాడ్‌లో రికర్వ్ ఈవెంట్ టీమ్ ఈవెంట్‌లో భారత్‌కు కాంస్య పతకాలు లభించాయి. ఆ తర్వాతి రెండు ఆసియా క్రీడల్లో ఈ విభాగంలో భారత్‌కు నిరాశే ఎదురైంది. తాజా ఏషియాడ్‌లో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ బొమ్మదేవర ధీరజ్, అతాను దాస్, తుషార్‌లతో కూడిన జట్టు రికర్వ్ టీమ్ విభాగంలో భారత్‌కు తొలిసారి రజత పతకం అందించింది. ఫైనల్లో భారత్ 1-5తో దక్షిణ కొరియా చేతిలో ఓడిపోయింది. అంతకుముందు భారత్ క్వార్టర్ ఫైనల్లో 5-4తో మంగోలియాపై, సెమీఫైనల్లో 5-3తో బంగ్లాదేశ్‌పై గెలిచి ఫైనల్ చేరింది. మరోవైపు సిమ్రన్‌జీత్ కౌర్, అంకిత, భజన్ కౌర్‌లతో కూడిన భారత మహిళల రికర్వ్ జట్టు కాంస్యం గెలిచింది. కాంస్య పతక మ్యాచ్‌లో భారత్ 6-2తో వియత్నాంపై నెగ్గింది. అంతకుముందు క్వార్టర్ ఫైనల్లో భారత్ 6-2తో జపాన్‌పై గెలిచి, సెమీఫైనల్లో 2-6తో దక్షిణ కొరియా చేతిలో ఓడిపోయింది. నేడు కాంపౌండ్ మహిళల వ్యక్తిగత విభాగంలో స్వర్ణం కోసం జ్యోతి సురేఖ, కాంస్యం కోసం అదితి... పురుషుల వ్యక్తిగత విభాగంలో అభిషేక్, ఓజస్ ప్రవీణ్ స్వర్ణ, రజత పతకాల కోసం పోటీపడతారు.



కాంస్యాలతో సిమ్రన్‌జీత్, అంకిత, భజన్ కౌర్

పతకాల పట్టిక (టాప్-10)

దేశం	స్వ	ర	కాం	మొ
చైనా	187	104	63	354
జపాన్	47	57	65	169
దక్షిణ కొరియా	36	49	84	169
భారత్	22	34	39	95
ఉజ్బెకిస్తాన్	20	18	26	64
చైనీస్ తైపీ	17	16	25	58
ఉత్తర కొరియా	11	18	10	39
థాయ్‌లాండ్	10	14	30	54
బహ్రెయిన్	10	3	5	18
కజకిస్తాన్	9	18	41	68

నోట్: స్వ-స్వర్ణం, ర-రజతం, కాం-కాంస్యం, మొ-మొత్తం.



అర్ధ సెంచరీ చేశాక తాను వేసుకున్న తల్లిదండ్రుల టాటూను చూపుతున్న తిలక్ వర్మ

సాత్విక్-చిరాగ్ జోడీ కొత్త చరిత్ర

- ఆసియా క్రీడల్లో ఫైనల్ చేరిన తొలి భారత డబుల్స్ జోడీగా రికార్డు
- సెమీస్‌లో మాజీ ప్రపంచ చాంపియన్ జంటపై గెలుపు



ఈ ఏడాది తమ అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తూ భారత బ్యాడ్మింటన్ పురుషుల డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి కొత్త చరిత్ర సృష్టించింది. ఆసియా క్రీడల చరిత్రలో ఫైనల్ చేరిన తొలి భారతీయ జోడీగా రికార్డు నెలకొల్పింది. హాంగ్జౌలో శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో సాత్విక్-చిరాగ్ జోడీ 21-17, 21-12తో మాజీ ప్రపంచ చాంపియన్ ఆరోన్ చియా-సో వుయ్ యిక్ (మలేసియా)పై గెలిచింది. 46 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సాత్విక్-చిరాగ్ కళ్లు చెదిరే స్మాష్‌లతో, చక్కటి డిఫెన్స్‌తో ప్రత్యర్థి జోడీ ఆట కట్టించారు. నేడు జరిగే ఫైనల్లో చోయ్ సోల్ జియు-కిమ్ వన్ హో (దక్షిణ కొరియా) జంటతో సాత్విక్-చిరాగ్ ద్వయం తలపడుతుంది. తాజా ప్రదర్శనతో సాత్విక్-చిరాగ్ శెట్టి జోడీ వచ్చే మంగళవారం విడుదల చేసే ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) ర్యాంకింగ్స్‌లో తొలిసారి నంబర్‌వన్ ర్యాంక్‌కు చేరుకునే అవకాశముంది. మరోవైపు పురుషుల సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ ప్రణయ్ కాంస్య పతకాన్ని దక్కించుకున్నాడు. పూర్తి ఫిట్‌నెస్‌తో లేకుండానే సెమీఫైనల్ ఆడిన ప్రణయ్ 16-21, 9-21తో ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ చాంపియన్ లీ షి ఫెంగ్ (చైనా) చేతిలో ఓడిపోయాడు.



ప్రణయ్

పసిడి 'కూత'కు గెలుపు దూరంలో...

ఫైనల్లో భారత పురుషుల, మహిళల కబడ్డీ జట్లు



గత జకార్తా ఆసియా క్రీడల్లో తొలిసారి స్వర్ణ పతకాన్ని చేజార్చుకున్న భారత పురుషుల, మహిళల కబడ్డీ జట్లు చైనా గడ్డపై తిరిగి పసిడి పతకాలను అందుకునేందుకు విజయం దూరంలో నిలిచాయి. శుక్రవారం జరిగిన కబడ్డీ సెమీఫైనల్స్‌లో భారత పురుషుల జట్టు 61-14తో పాకిస్తాన్ జట్టును చిత్తు చేయగా... భారత మహిళల జట్టు 61-17తో నేపాల్ జట్టుపై నెగ్గింది. నేడు జరిగే ఫైనల్స్‌లో చైనీస్ తైపీతో భారత మహిళల జట్టు... ఇరాన్‌తో భారత పురుషుల జట్టు 'ఢీ'కొంటాయి.

పతకాల రేసులో గ్రీష్మ, సంహిత

ఆసియా క్రీడల రోలర్ స్కేటింగ్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణులు దొంతర గ్రీష్మ, ఆకుల సాయి సంహిత పతకాల రేసులో ఉన్నారు. శుక్రవారం లేడీస్ ఆర్టిస్టిక్ సింగిల్ ఫ్రీ స్కేటింగ్ షార్ట్ ఫైనల్ తొలి రౌండ్ ముగిశాక గ్రీష్మ 20.94 పాయింట్లతో నాలుగో స్థానంలో... సాయి సంహిత 16.95 పాయింట్లతో ఆరో స్థానంలో ఉన్నారు. నేడు కూడా రాణించి టాప్-3లోకి వస్తే వీరికి పతకాలు ఖరారవుతాయి.

భారత్ 'కంచు' పట్టు

కాంస్యాలు నెగ్గిన భారత రెజ్లర్లు అమన్, సోనమ్, కిరణ్

ఆసియా క్రీడల రెజ్లింగ్‌లో భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. స్టార్ రెజ్లర్ బజరంగ్ పూనియాకు అనూహ్య ఓటమి ఎదురుకాగా... అమన్ (57 కేజీలు), మహిళల విభాగంలో సోనమ్ మలిక్ (62 కేజీలు), కిరణ్ (76 కేజీలు) కాంస్య పతకాలు గెలిచారు. కాంస్య పతక బౌట్‌లలో అమన్ 11-0తో లియు మింగు (చైనా)పై, సోనమ్ 7-5తో జియా లాంగ్ (చైనా)పై, కిరణ్ 6-3తో అరియున్‌జర్గాల్ (మంగోలియా)పై నెగ్గారు.

బజరంగ్ విఫలం


సెలెక్షన్ ట్రయల్స్‌లో పాల్గొనకుండా నేరుగా ఆసియా క్రీడల్లో ఆడే అవకాశం దక్కించుకున్న భారత స్టార్ రెజ్లర్ బజరంగ్ పూనియా నిరాశపరిచాడు. చైనా నుంచి అతను రిక్తహస్తాలతో స్వదేశానికి రానున్నాడు. పురుషుల ఫ్రీస్టయిల్ 65 కేజీల విభాగంలో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన బజరంగ్ పూనియా కాంస్య పతక బౌట్‌లో 4 నిమిషాల 31 సెకన్లలో ఓడిపోయాడు. జపాన్ ప్లేయర్ కైకి యామగుచి 10-0తో బజరంగ్‌ను చిత్తుగా ఓడించాడు. రెజ్లింగ్ నిబంధనల ప్రకారం ప్రత్యర్థిపై 10 పాయింట్ల ఆధిక్యం సంపాదించిన వెంటనే రిఫరీ బౌట్‌ను నిలిపివేసి 'టెక్నికల్ సుపీరియారిటీ' పద్ధతిలో విజేతగా ప్రకటిస్తారు. భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ సింగ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణల కేసులో బజరంగ్ తన సహచర రెజ్లర్లతో కలిసి దాదాపు రెండునెలలపాటు నిరసన చేపట్టిన సంగతి తెలిసిందే. దాంతో కొంతకాలంపాటు ఆటకు దూరంగా ఉన్న అతను ఆసియా క్రీడల్లో పూర్తిస్థాయి ప్రదర్శన ఇవ్వడంలో విఫలమయ్యాడు. 2014 ఏషియాడ్‌లో బజరంగ్ 61 కేజీల్లో రజతం, 2018 ఏషియాడ్‌లో 65 కేజీల్లో స్వర్ణం నెగ్గాడు.



అమన్



సోనమ్



బజరంగ్



కిరణ్

మహిళల సెపక్‌తక్రాలో తొలిసారి భారత్‌కు పతకం



ఆసియా క్రీడల సెపక్‌తక్రా ఈవెంట్‌లో భారత మహిళల జట్టు తొలిసారి పతకంతో తిరిగి వస్తోంది. మహిళల రెగూ టీమ్ ఈవెంట్‌లో ఐకపమ్ మైపాక్ దేవి, ఒయినమ్ చవోబా దేవి, ఖుష్బూ, ఎలాంగ్‌బమ్ ప్రియాదేవి, ఇలాంగ్‌బమ్ లెరెంతోంబి దేవిలతో కూడిన భారత జట్టు కాంస్య పతకం కైవసం చేసుకుంది. థాయ్‌లాండ్‌తో జరిగిన సెమీఫైనల్లో భారత్ 10-21, 13-21తో ఓడిపోయింది.

బ్రిడ్జ్‌లో రజతంతో సరి...



గత ఆసియా క్రీడల్లో బ్రిడ్జ్ క్రీడాంశంలో ఒక స్వర్ణం, రెండు కాంస్య పతకాలు గెలిచిన భారత బృందం ఈసారి రజత పతకంతో సరిపెట్టుకుంది. హాంగ్జౌలో శుక్రవారం జరిగిన పురుషుల టీమ్ ఈవెంట్ ఫైనల్లో భారత్ 152-238.1 పాయింట్ల తేడాతో హాంకాంగ్ చేతిలో ఓడిపోయింది. సందీప్ తక్రాల్, జగ్గీ శివ్‌దసాని, రాజు తొలాని, అజయ్ ప్రభాకర్ రజత పతకం గెలిచిన భారత జట్టులో సభ్యులుగా ఉన్నారు.

'డచ్' పని పట్టిన పాక్

ప్రపంచకప్‌లో పాకిస్తాన్‌కు శుభారంభం లభించింది. మెరుపు బ్యాటింగ్ ప్రదర్శనలు, అసాధారణ బౌలింగ్ లేకపోయినా సమష్టి తత్వంతో ఆ జట్టు తొలి అడుగును విజయవంతంగా వేసింది. అసోసియేటెడ్ టీమ్ నెదర్లాండ్స్‌పై అన్ని రకాలుగా ఆధిపత్యం ప్రదర్శించి తొలి విజయాన్ని తమ ఖాతాలో వేసుకుంది. తమ ఆటతో మ్యాచ్‌లో అక్కడక్కడ పైచేయి సాధించినట్లు కనిపించినా... చివరకు నెదర్లాండ్స్ సులువుగానే తలవంచింది. 'ఆరెంజ్' జట్టు సంచలన విజయానికి ఈ ఆట సరిపోలేదు.

- తొలి మ్యాచ్‌లో పాకిస్తాన్ విజయం
- 81 పరుగులతో నెదర్లాండ్స్ చిత్తు
- రాణించిన షకీల్, రిజ్వాన్



రిజ్వాన్

సాక్షి, హైదరాబాద్: రెండు వామప్ మ్యాచ్‌లతో ఉప్పల్ స్టేడియంపై అంచనాకు వచ్చిన పాకిస్తాన్ ఈ వారం రోజుల అనుభవాన్ని అసలు మ్యాచ్‌లో సమర్థంగా వాడుకుంది. శుక్రవారం జరిగిన వన్డే వరల్డ్ కప్ పోరులో పాక్ 81 పరుగుల తేడాతో నెదర్లాండ్స్‌పై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాక్ 49 ఓవర్లలో 286 పరుగులకు ఆలౌటైంది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సౌద్ షకీల్ (52 బంతుల్లో 68; 9 ఫోర్లు, 1 సిక్స్), మొహమ్మద్ రిజ్వాన్ (75 బంతుల్లో 68; 8 ఫోర్లు) అర్ధసెంచరీలు సాధించారు. అనంతరం నెదర్లాండ్స్ 41 ఓవర్లలో 205 పరుగులకే ఆలౌటైంది. బాస్ డి లీడ్ (68 బంతుల్లో 67; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), విక్రమ్‌జిత్ సింగ్ (67 బంతుల్లో 52; 4 ఫోర్లు, 1 సిక్స్) రాణించినా జట్టుకు ఓటమి తప్పలేదు.

సెంచరీ భాగస్వామ్యం...

కనీసం 300 పరుగులు నమోదు చేస్తాం. టాస్ సమయంలో పాక్ కెప్టెన్ బాబర్ ఆజమ్ చేసిన వ్యాఖ్య ఇది. అయితే దానికి చేరువగా వెళ్లడంలో పాక్ సఫలమైంది. ఆరంభ ఓవర్లలో ప్రదర్శన చూస్తే అది కష్టంగానే అనిపించినా రెండు కీలక భాగస్వామ్యాలు జట్టును ఆదుకున్నాయి. తొలి పవర్‌ప్లేలో 9.1 ఓవర్లు ముగిసేసరికి పాక్ 3 కీలక వికెట్లు చేజార్చుకుంది. ఓపెనర్లు ఫఖర్ (12), ఇమామ్ (15)లతో పాటు కెప్టెన్ బాబర్ ఆజమ్ (5) కూడా తొందరగా వెనుదిరిగారు. ఈ దశలో రిజ్వాన్, షకీల్ కలిసి జట్టును ఆదుకున్నారు. ఆరంభంలో నిలదొక్కుకునేందుకు కొంత సమయం తీసుకున్న వీరిద్దరు ఆ తర్వాత చక్కటి షాట్లతో దూకుడు పెంచారు. ఈ క్రమంలో షకీల్ 32 బంతుల్లో, రిజ్వాన్ 58 బంతుల్లో అర్ధ సెంచరీలు పూర్తి చేసుకున్నారు. వీరిద్దరి శతక భాగస్వామ్యం తర్వాత తక్కువ వ్యవధిలో పాక్ 3 వికెట్లు చేజార్చుకుంది. అయితే నవాజ్ (43 బంతుల్లో 39; 4 ఫోర్లు), షాదాబ్ (34 బంతుల్లో 32; 2 ఫోర్లు, 1 సిక్స్) మళ్లీ పరిస్థితిని చక్కదిద్దారు. వీరిద్దరు ఏడో వికెట్‌కు 70 బంతుల్లో 64 పరుగులు జత చేశారు. చివరి 2 వికెట్లకు కలిపి మరో 34 పరుగులు రావడం కూడా పాక్‌ను మెరుగైన స్థితికి చేర్చింది.



విక్రమ్‌జిత్ సింగ్



బాస్ డి లీడ్

ఆ ఇద్దరు మినహా...

ఛేదనలో నెదర్లాండ్స్‌కు విక్రమ్‌జిత్ చక్కటి షాట్లతో శుభారంభం అందించాడు. అయితే తక్కువ వ్యవధిలో జట్టు డౌడ్ (5), అకెర్‌మన్ (17) వికెట్లు కోల్పోయింది. దాంతో విక్రమ్‌జిత్‌కు డి లీడ్ జత కలిశాడు. వీరిద్దరి భాగస్వామ్యం ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించింది. ఈ జోడీ మూడో వికెట్‌కు 76 బంతుల్లో 70 పరుగులు జత చేసింది. అయితే 65 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్న వెంటనే విక్రమ్ భారీ షాట్‌కు ప్రయత్నించి వెనుదిరిగాడు. తేజ నిడమనూరు (5) విఫలం కాగా, డచ్ ఆ వెంటనే మరో 2 చేజార్చుకుంది. అయితే డి లీడ్ క్రీజ్‌లో ఉన్నంత వరకు టీమ్‌కు కాస్త ఆశలు ఉన్నాయి. 50 బంతుల్లోనే అతను హాఫ్ సెంచరీని అందుకున్నాడు. నవాజ్ చక్కటి బంతిని లీడ్ బౌల్డ్ కావడంతో 'డచ్' జట్టు ఓటమి లాంఛనమే అయింది.

స్కోరు వివరాలు

పాకిస్తాన్ ఇన్నింగ్స్: ఫఖర్ (సి అండ్ బి) వాన్ బీక్ 12; ఇమామ్ (సి) దత్ (బి) మీకెరెన్ 15; బాబర్ (సి) సాఖిబ్ (బి) అకెర్‌మన్ 5; రిజ్వాన్ (బి) డి లీడ్ 68; షకీల్ (సి) సాఖిబ్ (బి) దత్ 68; ఇఫ్తికార్ (సి) ఎడ్వర్డ్స్ (బి) డి లీడ్ 9; నవాజ్ (రనౌట్) 39; షాదాబ్ ఖాన్ (బి) డి లీడ్ 32; హసన్ అలీ (ఎల్బీ) (బి) డి లీడ్ 0; షాహిన్ అఫ్రిది (నాటౌట్) 13; రవూఫ్ (స్టంప్డ్) ఎడ్వర్డ్స్ (బి) అకెర్‌మన్ 16; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (49 ఓవర్లలో ఆలౌట్) 286. వికెట్ల పతనం:** 1-15, 2-34, 3-38, 4-158, 5-182, 6-188, 7-252, 8-252, 9-267, 10-286. **బౌలింగ్:** ఆర్యన్ దత్ 10-0-48-1, వాన్ బీక్ 6-0-30-1, అకెర్‌మన్ 8-1-39-2, మీకెరెన్ 6-0-40-1, డి లీడ్ 9-0-62-4, మెర్వ్ 6-0- 36- 0, విక్రమ్‌జిత్ 2-0-16-0, సాఖిబ్ 2-0- 15-0.

నెదర్లాండ్స్ ఇన్నింగ్స్: విక్రమ్‌జిత్ (సి) ఫఖర్ (బి) షాదాబ్ 52; మ్యాక్స్ డౌడ్ (సి) షాహిన్ (బి) హసన్ 5; అకెర్‌మన్ (బి) ఇఫ్తికార్ 17; డి లీడ్ (బి) నవాజ్ 67; తేజ (సి) ఫఖర్ (బి) రవూఫ్ 5; ఎడ్వర్డ్స్ (ఎల్బీ) (బి) రవూఫ్ 0; సాఖిబ్ (ఎల్బీ) (బి) షాహిన్ 10; వాన్‌డర్ మెర్వ్ (రనౌట్) 4; వాన్ బీక్ (నాటౌట్) 28; దత్ (బి) హసన్ 1; మీకెరెన్ (బి) రవూఫ్ 7; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (41 ఓవర్లలో ఆలౌట్) 205. వికెట్ల పతనం:** 1-28, 2-50, 3-120, 4-133, 5-133, 6-158, 7-164, 8-176, 9-184, 10-205. **బౌలింగ్:** షాహిన్ అఫ్రిది 7-0-37-1, హసన్ అలీ 7-1-33-2, రవూఫ్ 9-0-43-3, ఇఫ్తికార్ అహ్మద్ 3-0-16-1, మొహమ్మద్ నవాజ్ 7-0-31-1, షాదాబ్ ఖాన్ 8-0-45-1.



షకీల్

ప్రపంచకప్‌లో నేడు

అఫ్గానిస్తాన్ X బంగ్లాదేశ్
వేదిక: ధర్మశాల
ఉదయం గం. 10:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

శ్రీలంక X దక్షిణాఫ్రికా
వేదిక: న్యూఢిల్లీ
మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

సాక్షి బిజినెస్
శనివారం
7-10-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	364	65,996
నిఫ్టీ ▲	108	19,654

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)			
నాస్‌డాక్	13,413	▲	192
డోజోన్స్	33,421	▲	301
ఎఫ్‌టీఎస్ఈ 100	7,495	▲	43
డాక్స్	15,300	▲	160
షాంఘై (గత గురువారం ముగింపు)	3,110	▲	3
నికాయ్	30,995	▼	81

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)		
56,539	▼	16
బంగారం (99.5 స్వచ్ఛత)		
56,313	▼	16
వెండి (కిలో)		
67,095	▼	109

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.47	84.14
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	98.86	103.18
€	యూరో	ఎస్‌బీఐ	86.29	89.38
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.20	56.92
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.07	54.37
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.97	61.91
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.24	22.87
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.77	23.56
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.28	12.35

రిలయన్స్ రిటైల్‌లో తాజా పెట్టుబడి

- అబుదాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ రెడీ
- 0.59% వాటాకు రూ. 4,967 కోట్లు



ముంబై: డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ అనుబంధ విభాగం రిలయన్స్ రిటైల్ వెంచర్స్(ఆర్ఆర్‌వీఎల్)లో అబుదబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ(ఏడీఐఏ) రూ. 4,967 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. తద్వారా ఆర్ఆర్‌వీఎల్‌లో 0.59 శాతం వాటాను పొందనుంది. రూ. 8.38 లక్షల కోట్ల విలువలో ఏడీఐఏ ఇన్వెస్ట్ చేస్తున్నట్లు రిలయన్స్ రిటైల్ ఒక ప్రకటనలో పేర్కొంది. దీంతో విలువరీత్యా దేశంలోని టాప్-4 కంపెనీలలో చేరనుంది. సొంత అనుబంధ సంస్థ ద్వారా ఏడీఐఏ పెట్టుబడులకు తెరతీస్తున్నట్లు ఆర్ఆర్‌వీఎల్ వెల్లడించింది. సంస్థలో ఇన్వెస్టర్‌గా మద్దతు కొనసాగిస్తున్నందుకు ఏడీఐఏతో బంధం మరింత పటిష్టంకానున్నట్లు రిలయన్స్ రిటైల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఇషా ముకేశ్ అంబానీ పేర్కొన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థతోపాటు.. తమ బిజినెస్ మూలాలు, వ్యూహాలు, నిర్వహణపట్ల ఏడీఐఏకున్న విశ్వాసానికి పెట్టుబడులు నిదర్శనమని వ్యాఖ్యానించారు. అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న మార్కెట్లో పటిష్ట వృద్ధిని సాధిస్తున్న కంపెనీ రిలయన్స్ రిటైల్ అంటూ ఏడీఏఐ పీఈ విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హమద్ షావాన్ అల్ధాహెరీ పేర్కొన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

7-10-2023	
విశాఖ	534-00
చిత్తూరు	533-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	526-00
విజయవాడ	526-00
రిటైల్ ధర (డజను)	72.00
6-10-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	500-00
వరంగల్	502-00
రిటైల్ ధర	5.60

ధరల కట్టడే ధ్యేయం..




- 4% ద్రవ్యోల్బణమే ఆర్‌బీఐ లక్ష్యం
- 6.5 శాతం రెపో కొనసాగింపునకు పాలసీ కమిటీ ఏకగ్రీవ ఓటు
- ఈ తరహా నిర్ణయం వరుసగా నాల్గవసారి
- వ్యవస్థలో అదనపు ద్రవ్య లభ్యత తగ్గింపునకు చర్యలు
- 6.5 శాతం జీడీపీ వార్షిక వృద్ధి అంచనా
- ద్రవ్యోల్బణం సగటు 5.4 శాతంగా ఉంటుందని భరోసా

ముంబై: ధరల కట్టడికే అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు గవర్నర్ శక్తికాంతదాస్ నేతృత్వంలోని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆరుగురు సభ్యుల ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) స్పష్టం చేసింది. బ్యాంకులకు ఆర్‌బీఐ తానిచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీరేటు- రెపోను యథాతథంగా 6.5 శాతంగా కొనసాగించాలని ఏకగ్రీవ నిర్ణయం తీసుకుంది. ఈ తరహా 'యథాతథ రెపో రేటు కొనసాగింపు' నిర్ణయం తీసుకోవడం వరుసగా ఇది నాల్గవసారి. రిటైల్ ద్రవ్యోల్బణం 4%గా కొనసాగించడమే ప్రధాన లక్ష్యమని ఉద్ఘాటించిన ఎంపీసీ, ఈ దిశలో వ్యవస్థలో అదనపు ద్రవ్య లభ్యతను (లిక్విడిటీ) వెనక్కు తీసుకునే విధానాన్ని కొనసాగిస్తామని పేర్కొంది. ఇందులో భాగంగా బాండ్ విక్రయాల ను చేపడుతున్నట్లు తెలిపింది. 'సరళతర ద్రవ్య విధానాన్ని వెనక్కుతీసుకునే' ధోరణికే కట్టుబడి ఉన్నట్లు పాలసీ కమిటీ స్పష్టం చేసింది. మూడు రోజులపాటు జరిగిన కమిటీ సమావేశాల నిర్ణయాలను గవర్నర్ శక్తికాంతదాస్ మీడియాకు తెలిపారు. 'ఆర్‌బీఐ ద్రవ్యోల్బణం లక్ష్యం 4%. 2 నుంచి 6% కాదు' అని ఉద్ఘాటించారు. ప్లస్ 2, మైనస్ 2తో 4% వద్ద ద్రవ్యోల్బణం ఉండాలని ఆర్‌బీఐకి కేంద్రం నిర్దేశిస్తున్న సంగతి తెలిసిందే.

పాలసీ ముఖ్యాంశాలు...

- 2023-24లో జీడీపీ 6.5 శాతం.
- రిటైల్ ద్రవ్యోల్బణం 5.4 శాతం.
- అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంకుల బుల్లెట్ రీపేమెంట్ స్కీమ్ కింద పసిడి రుణాల పరి మితి రూ. 2 లక్షల నుంచి రూ. 4లక్షలకు పెంపు.



కఠిన ద్రవ్య విధానం కొనసాగింపు..

ఆర్‌బీఐ 2022 మే నుంచి 250 బేసిస్ పాయింట్లు రెపో రేటును పెంచింది. అయితే ఇటు డిపాజిట్ల విషయంలో అటు రుణాల విషయంలో బ్యాంకులు కస్టమర్లకు ఈ రేట్లను పూర్తిగా బదలాయించలేదు. ఈ పరిస్థితుల్లో 'సరళతర ద్రవ్య విధానాన్ని వెనక్కుతీసుకునే' ధోరణినే కొనసాగించాలని ఆర్‌బీఐ భావిస్తోంది. అంటే ఇప్పటి వరకూ తీసుకున్న నిర్ణయాలు వ్యవస్థలో ఇంకా ప్రతిఫలించాల్సి ఉంది.

– శక్తికాంత దాస్, ఆర్‌బీఐ గవర్నర్

రూ. 2,000 నోట్లు ఇప్పటికీ మార్చుకోవచ్చు..



రూ.2,000 నోట్లను అక్టోబర్ 8 నుంచి కూడా మార్చుకునే అవకాశాలన్నీ ఆర్‌బీఐ కల్పించింది. గవర్నర్ ఈ విషయంపై మాట్లాడుతూ రూ. 3.43 లక్షల కోట్ల రూ. 2,000 డినామినేషన్ నోట్లు ఇప్పటి వరకూ బ్యాంకింగ్ వ్యవస్థలోకి తిరిగి వచ్చాయన్నారు. ఇంకా రూ.12,000 కోట్లకుపైగా విలువైన నోట్లు చెలామణీలో ఉన్నాయన్నారు. అక్టోబర్ 8 నుండి 19 ఆర్‌బీఐ కార్యాలయాల్లో వీటిని మార్చుకోవచ్చన్నారు. నోట్లను డిపాజిట్ చేయడానికి లేదా మార్చుకోవడానికి మొదట సెప్టెంబర్ 30 వరకు గడువిచ్చిన ఆర్‌బీఐ, ఈ తేదీని అక్టోబర్ 7 వరకూ పొడిగించింది. రాష్ట్ర రాజధానుల్లో ఆర్‌బీఐ కార్యాలయాలు ఉన్నందున, ఎక్కడివారైనా, 2,000 నోట్లను మార్చు కోవడానికి పోస్టల్ శాఖ సేవలను పొందవచ్చని దాస్ సూచించారు.



అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితిలోనూ దేశ ఆర్థికాభివృద్ధి పటిష్టతే లక్ష్యంగా ఉంది.
– దినేష్ ఖారా, ఎస్‌బీఐ చీఫ్



ద్రవ్యోల్బణం గరిష్ట స్థాయికి చేరుకున్నట్లు కనిపిస్తోంది. సమీపకాలంలో ధరలు తగ్గవచ్చు.
– సుబ్రకాంత్ పాండా, ఫిక్కీ ప్రెసిడెంట్



వృద్ధికి మద్దతునిస్తూ, ద్రవ్యోల్బణం కట్టడే ఆర్‌బీఐ ధ్యేయంగా కనబడుతోంది
– ప్రసేన్‌జిత్ బసు, చీఫ్ ఎకనమిస్ట్, ఐసీఐసీఐ సెక్యూరిటీస్



మార్కెట్‌లో 'ఆర్‌బీఐ' హుషారు

- రియల్టీ,ఆటో షేర్ల పరుగులు
- సెన్సెక్స్ లాభం 364 పాయింట్లు
- 19,650 పైకి నిఫ్టీ

ముంబై: అంచనాలకు తగ్గట్లే ఆర్‌బీఐ వరుసగా నాలుగోసారీ కీలక వడ్డీరేట్లను యథాతథంగా కొనసాగించడంతో శుక్రవారం స్టాక్ మార్కెట్ ర్యాలీ చేసింది. రేట్ల సంబంధిత ఫైనాన్స్, రియల్టీ, ఆటో షేర్లు రాణించడంతో సెన్సెక్స్ 364 పాయింట్లు పెరిగి 65,996 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 108 పాయింట్లు బలపడి 19,654 వద్ద నిలిచింది. ఆసియా, యూరప్ మార్కెట్ల రికవరీ ఇన్వెస్టర్లకు ఉత్సాహాన్నిచ్చింది. క్రూడాయిల్ ధరలు మరింత దిగిరావచ్చనే అశలూ సెంటిమెంట్‌ను బలపరిచాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం లాభాలతో మొదలయ్యాయి. ఆర్‌బీఐ ద్రవ్య పాలసీ ప్రకటన వెల్లడి తర్వాత మరింత దూసుకెళ్లాయి. ఒక దశలో సెన్సెక్స్ 464 పాయింట్లు బలపడి 66,096 వద్ద, నిఫ్టీ 130 పాయింట్లు దూసుకెళ్లి 19,676 వద్ద ఇంట్రాడే గరిష్టాలను తాకాయి.

వాలియంట్ లేబొరేటరీస్ అప్పర్ సర్క్యూట్



వాలియంట్ లేబొరేటరీస్ షేరు లిస్టింగ్ రోజే అప్పర్ సర్క్యూట్ తాకింది. బీఎస్ఈలో ఇష్యూ ధర(రూ.140)తో పోలిస్తే 15% ప్రీమియంతో రూ.161 వద్ద మొదలైంది. ఒక దశలో గరిష్ట ట్రేడింగ్ పరిమితి 21% ర్యాలీ చేసి రూ.169 వద్ద అప్పర్ సర్క్యూట్ తాకింది. ఎక్స్ఛేంజీలో 1.99 లక్షల షేర్లు చేతులు మారాయి. కంపెనీ మార్కెట్ విలువ రూ.735 కోట్లుగా నమోదైంది.

మళ్లీ టీసీఎస్ షేర్ల బైబ్యాక్!

టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) మరోసారి షేర్ల బైబ్యాక్ ప్రతిపాదనను తీసుకువస్తోంది. ఈ నెల 11వ తేదీ బోర్డు సమావేశంలో సొంత ఈక్విటీ షేర్ల కొనుగోలు అంశాన్ని పరిశీలించనున్నట్లు వెల్లడించింది. కంపెనీ ఇంతక్రితం 2022 మార్చిలో షేర్ల బైబ్యాక్‌ను ప్రకటించింది. ఎన్ఎస్ఈలో శుక్రవారం షేరు 1% బలపడి రూ. 3,621 వద్ద ముగిసింది.

నిధుల సమీకరణలో పీట్రాన్

కొత్త ఉత్పత్తుల ఆవిష్కరణ



సీఈవో అమీన్ ఖ్వాజా

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: లిస్టెడ్ సంస్థ పాల్‌రెడ్ టెక్నాలజీస్‌లో భాగమైన పీట్రాన్ తాజాగా రూ. 30 కోట్ల నిధుల సమీకరణ యత్నాల్లో ఉంది. ప్రస్తుత ఇన్వెస్టర్ల నుంచి వచ్చే ఆరు నెలల్లో ఈ మొత్తాన్ని సమకూర్చుకోనున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు, సీఈవో అమీన్ ఖ్వాజా తెలిపారు. దీన్ని మార్కెటింగ్, ఆర్అండ్‌డీ, తయారీ కార్యకలాపాలకు వినియోగించనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటిదాకా రూ. 47 కోట్లు సమీకరించినట్లు విలేకరుల సమావేశంలో చెప్పారు. గత ఆర్థిక సంవత్సరం తమ టర్నోవర్ రూ. 147 కోట్లు ఉండగా ఈసారి రూ. 220 కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రిఫ్లెక్ట్ ప్రో స్మార్ట్‌వాచ్, జెన్‌బడ్స్ వన్ ఇయర్ బడ్స్‌ను పీట్రాన్ ఆవిష్కరించింది. ఇయర్‌బడ్స్ ప్రత్యేక ధర రూ. 999గా ఉంటుందన్నారు.

రూ. 449కి బేస్‌బడ్స్..

పండుగ సీజన్ సందర్భంగా అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ నిర్వహిస్తున్న సేల్‌లో తమ ఉత్పత్తులపై భారీ ఆఫర్లు ఇస్తున్నట్లు ఖ్వాజా చెప్పారు. ఇందులో భాగంగా రూ. 799 విలువ చేసే పీట్రాన్ బేస్‌బడ్స్ డ్యుయోను రూ. 449కే అందిస్తున్నట్లు పేర్కొన్నారు. వైర్‌లెస్ ఇయర్‌బడ్స్, నెక్‌బ్యాండ్స్, హెడ్‌ఫోన్స్, స్మార్ట్‌వాచీలు, చార్జర్లు మొదలైన ప్రీమియం ఉత్పత్తులను అందుబాటు ధరలో రూ. 449 నుంచి రూ. 1,199 శ్రేణిలో అందిస్తున్నట్లు వివరించారు.

8 నుంచి జియో మార్ట్ ఉత్సవ్



ముంబై: రిలయన్స్ జియో మార్ట్ పండుగ సీజన్ సందర్భంగా 'జియో ఉత్సవ్' పేరుతో సేల్ ఆఫర్ ప్రకటించింది. ప్రముఖ క్రికెటర్ ధోని ప్రచారకర్తగా వ్యవహరించే ఈ సేల్ వేడుకలు అక్టోబర్ 8 నుంచి ప్రారంభం అవుతాయి. ఎలక్ట్రానిక్స్ ఉపకరణాలు, కిచెన్ ఉత్పత్తులు, ఫ్యాషన్-లైఫ్‌స్టైల్, బ్యూటీ, ఎఫ్ఎంసీజీ, కిరాణా, వినిమయ ఉత్పత్తులపై 50% నుంచి 80% వరకు ఆఫర్ ఇస్తుంది. ఈ విభాగాల్లో ప్రతి 24 గంటలకు ఫ్లాష్ డీల్స్ అందిస్తుంది. స్మార్ట్‌ఫోన్లు, యాక్సెసరీలపై 80% మినహాయింపు ఇస్తోంది. రెండు రోజుల్లో ఉచిత ఇన్‌స్టాలేషన్, ఏడాది వరకు నో కాస్ట్ ఈఎంఐలు, ఉచిత డెలివరీనీ అందిస్తుంది. స్మార్ట్‌ఫోన్లపై రూ.15వేల వరకు ఎక్స్ఛేంజ్ ప్రయోజనాలు పొందవచ్చు.

సినిమా

ఇండియన్ సైన్ లాంగ్వేజ్‌లో టైగర్



• రవితేజ

రవితేజ హీరోగా నటించిన తాజా చిత్రం 'టైగర్ నాగేశ్వరరావు'. వంశీ దర్శకత్వంలో అభిషేక్ అగర్వాల్ నిర్మించిన ఈ చిత్రంలో నూపుర్ సనన్, గాయత్రీ భరద్వాజ్ హీరోయిన్లు. ఈ చిత్రం ఈ నెల 20న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీలో విడుదలవుతోంది. ఈ చిత్రాన్ని ఇండియన్ సైన్ లాంగ్వేజ్‌లో (భారతీయ సంకేత భాష) కూడా విడుదల చేస్తున్నట్లు అభిషేక్ అగర్వాల్ ప్రకటించారు. ''భారత దేశంలోనే సైన్ భాషలో విడుదలైన తొలి ట్రైలర్ మా 'టైగర్ నాగేశ్వరరావు' చిత్రానిదే. ఎక్కువ మంది ప్రేక్షకులకు చేరువ చేయాలని సైన్ లాంగ్వేజ్‌లో కూడా మా చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్, కెమెరా: ఆర్ మది.

రిపీట్టే...

ఒక సినిమాలో హీరో-హీరోయిన్ మధ్య కెమిస్ట్రీ వర్కవుట్ అయితే మళ్లీ ఆ జంటను చూడాలని ప్రేక్షకులు కోరుకుంటారు. అయితే ఆ జంటకి మ్యాచ్ అయ్యే కథ దొరకాలి.. ఆ కథకు ఈ ఇద్దరినే హీరో-హీరోయిన్‌గా తీసుకోవాలనే ఆలోచన డైరెక్టర్‌కి రావాలి. ఇలా కొన్ని జంటలకు కథ కుదిరింది.ఆ కాంబినేషన్ రిపీట్ చేస్తే బాగుండనే ఆలోచన డైరెక్టర్‌కి వచ్చింది. 'రిపీట్టే..' అంటూ మళ్లీ స్క్రీన్ షేర్ చేసుకుంటున్న ఆ జంటలు చేస్తున్న చిత్రాల గురించి...



• కియారా అద్వానీ, రామ్‌చరణ్



• సాయిపల్లవి, నాగచైతన్య



• విజయ్ దేవరకొండ, రష్మికా మందన్నా



• నితిన్, రష్మిక



• కల్యాణ్ రామ్, సంయుక్తా మీనన్

• 'వినయ విధేయ రామ' చిత్రంతో ఆకట్టుకున్న హీరో రామ్‌చరణ్-హీరోయిన్ కియారా అద్వానీ 'గేమ్ చేంజర్' కోసం రెండోసారి జోడీ కట్టారు. ఈ చిత్రానికి శంకర్ దర్శకుడు. 'భరత్ అనే నేను' (2018) సినిమాతో కియారా టాలీవుడ్‌కి ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత బోయపాటి శ్రీను దర్శకత్వం వహించిన 'వినయ విధేయ రామ' (2019) లో రామ్ చరణ్‌కి జోడీగా నటించారామె. ఈ ఇద్దరి మధ్య మంచి కెమిస్ట్రీ కుదిరింది. ఇక ఈ ఇద్దరూ జత కట్టిన తాజా చిత్రం 'గేమ్ చేంజర్'ని 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. పొలిటికల్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం రూపొందుతోంది.

• 'లవ్‌స్టోరి' (2021)తో ప్రేక్షకులకు అందమైన ప్రేమకథని చూపించారు హీరో నాగ చైతన్య-హీరోయిన్ సాయిపల్లవి. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో నాగ చైతన్య, సాయిపల్లవి జోడీకి మంచి మార్కులు పడ్డాయి. ఈ జంట రెండేళ్లకు రెండోసారి జోడీగా నటిస్తున్నారు. 'ప్రేమమ్' (2016), 'సవ్యసాచి' (2018) చిత్రాల తర్వాత హీరో నాగచైతన్య-డైరెక్టర్ చందు మొండేటి కాంబినేషన్‌లో మూడో సినిమా రూపొందుతోంది. అల్లు అరవింద్ సమర్పణలో 'బన్నీ' వాసు నిర్మిస్తున్న ఈ సినిమా త్వరలో సెట్స్‌పైకి వెళ్లనుంది. ఈ సినిమాలో నాగచైతన్యకి జోడీగా సాయి పల్లవి నటించనున్నారు. చైతు-సాయి పల్లవి తొలిసారి జత కట్టిన 'లవ్‌స్టోరి' లానే తాజా చిత్రం కూడా ప్రేమ ప్రధానాంశంగా సాగుతుంది.

• 'భీష్మ' వంటి హిట్ సినిమా తర్వాత నితిన్-రష్మికా మందన్నా రెండోసారి నటించనున్న సంగతి తెలిసిందే. వెంకీ కుడుముల దర్శకత్వం వహించిన 'భీష్మ' (2020) చిత్రంలో నితిన్- రష్మిక తొలిసారి కలిసి నటించారు. ఈ చిత్రం మంచి విజయం సాధించింది. ప్రత్యేకించి నితిన్-రష్మిక డ్యాన్స్‌లు ప్రేక్షకులను అలరించాయి. ఇక వెంకీ కుడుముల దర్శకత్వం వహించిన 'ఛలో' చిత్రం ద్వారానే రష్మిక తెలుగు తెరకు పరిచయం అయిన సంగతి గుర్తుండే ఉంటుంది. ఆ విధంగా నితిన్-రష్మిక-వెంకీ కుడుముల.. ఈ ముగ్గురి కాంబినేషన్‌లో తాజాగా రెండో సినిమా రూపొందుతోందని చెప్పొచ్చు. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ ఈ సినిమాని నిర్మిస్తున్నారు. అయితే ఈ చిత్రం నుంచి రష్మికా మందన్న తప్పుకున్నట్లు వార్తలొస్తున్నాయి. 'పుష్ప'తో పాన్ ఇండియా రేంజ్‌లో గుర్తింపు తెచ్చుకున్న రష్మిక ప్రస్తుతం తెలుగు, హిందీ చిత్రాలతో బిజీగా ఉన్నారు. ఈ కారణంగా డేట్స్ సర్దుబాటు కాకపోవడంతో ఈ మూవీ నుంచి తప్పుకున్నారట. ఆమె స్థానంలో శ్రీలీల అవకాశం అందుకున్నారని టాక్. ఈ వార్తపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

• 'గీత గోవిందం'(2018), 'డియర్ కామ్రేడ్' (2019) వంటి చిత్రాల తర్వాత విజయ్ దేవరకొండ-రష్మికా మందన్నా ముచ్చటగా మూడోసారి కలిసి నటించనున్నారని టాక్. విజయ్ దేవరకొండ హీరోగా 'జెర్సీ' ఫేమ్ గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో 'వీడీ 12' (వర్కింగ్ టైటిల్) చిత్రం తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో తొలుత హీరోయిన్‌గా శ్రీ లీలను ఫిక్స్ చేశారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్‌పై రూపొందుతున్న ఈ సినిమా పూజా కార్యక్రమాల్లో కూడా ఆమె పాల్గొన్నారు. అయితే వరుస సినిమాలతో డేట్స్ అడ్జస్ట్ చేయలేక 'వీడీ 12' ప్రాజెక్ట్ నుండి శ్రీ లీల తప్పుకున్నట్లు టాక్. దీంతో చిత్ర యూనిట్ రష్మికా మందన్నాని సంప్రదించగా... ఈ బ్యూటీ పచ్చజెండా ఊపారని తెలుస్తోంది. ఇదే నిజం అయితే విజయ్-రష్మిక కలిసి నటించనున్న మూడో చిత్రం ఇదే అవుతుంది. అయితే నితిన్ సినిమా నుంచి రష్మిక తప్పుకోవడంతో ఆ ప్లేస్‌ని శ్రీ లీల భర్తీ చేశారని, విజయ్ దేవరకొండ సినిమా నుంచి శ్రీ లీల తప్పుకుంటే ఈ ప్రాజెక్ట్‌లోకి రష్మిక ఎంట్రీ ఇచ్చారనే వార్తలపై అధికారిక ప్రకటనలు రావాల్సి ఉంది.

• 'బింబిసార' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత హీరో కల్యాణ్ రామ్-హీరోయిన్ సంయుక్తా మీనన్ 'డెవిల్' సినిమా కోసం రెండోసారి జోడీ కట్టారు. వశిష్ఠ దర్శకత్వంలో కల్యాణ్ రామ్-సంయుక్తా మీనన్ జంటగా నటించిన తొలి చిత్రం 'బింబిసార' (2022). ఈ చిత్రవిజయంతో హిట్ పెయిర్ అనిపించుకున్న కల్యాణ్ రామ్-సంయుక్తా మీనన్ తాజాగా 'డెవిల్'లో నటిస్తున్నారు. దేవాన్ష్ నామా సమర్పణలో పీరియాడిక్ స్పై థ్రిల్లర్‌గా అభిషేక్ నామా స్వీయ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ సినిమా నవంబర్ 24న రిలీజ్ కానుంది.

ఇలా రిపీట్ అవుతున్న జంటలు ఇంకొన్ని ఉన్నాయి.

ప్రతి తండ్రినీ కదిలించే పాట

నాని, మృణాల్ ఠాకూర్ జంటగా నటిస్తున్న చిత్రం 'హాయ్ నాన్న'. శౌర్యువ్ దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రంలో నాని కూతురు పాత్రలో బేబీ కియారా ఖన్నా నటిస్తున్నారు. మోహన్ చెరుకూరి, డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల నిర్మాతలు. హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'గాజు బొమ్మ...' అంటూ సాగే రెండో పాటని హీరో మహేశ్‌బాబు విడుదల చేసి, 'నన్ను కదిలించినట్లే ప్రతి తండ్రిని హత్తుకునే పాట 'గాజు బొమ్మ...'' అన్నారు. ''తండ్రీకూతుళ్ల అందమైన, భావోద్వేగ ప్రయాణాన్ని చూపిస్తుందీ చిత్రం. 'గాజు బొమ్మ..' పాటని హేషమ్ స్వరపరచడంతో పాటు పాడారు. అనంత శ్రీరామ్ చక్కని సాహిత్యం అందించారు. డిసెంబర్ 21న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తాం'' అన్నారు మేకర్స్.



• బేబీ కియారా, నాని

సరదా చికెన్



• రవి, విషికా

రవి మహాదాస్యం, విషికా లక్ష్మణ్ జంటగా రాజశేఖర్ సుద్మూన్ దర్శకత్వం వహించిన చిత్రం 'సగిలేటి కథ'. హీరో నవదీప్ సి-స్పేస్ సమర్పణలో షేడ్ ఎంటర్‌టైన్మెంట్, అశోక్ ఆర్ట్స్ బ్యానర్‌లో దేవీప్రసాద్ బలివాడ, అశోక్ మిట్టపల్లి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 13న విడుదల కానుంది. జశ్వంత్ పసుపులేటి సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'చికెన్..' అంటూ సాగే సరదా పాటని దర్శకులు వెంకటేశ్ మహా, సందీప్ రాజ్ విడుదల చేసి, సినిమా విజయం సాధించాలన్నారు. నవదీప్ మాట్లాడుతూ- ''ఈ సినిమాలో రోషం రాజు పాత్రంటే నాకు ఇష్టం. ఇందులోని వినోదం ప్రేక్షకులను నవ్విస్తుంది'' అన్నారు. ''రాయలసీమ పల్లెటూరి నేపథ్యంలో ఈ చిత్రకథ సాగుతుంది. మా సినిమా కూడా 'బలగం' స్థాయిలో హిట్ అవుతుందని నమ్ముతున్నాను'' అన్నారు రాజశేఖర్ సుద్మూన్.

ప్రతి మహిళా చూడాలి



• ఎస్తేర్

ఎస్తేర్ లీడ్ రోల్‌లో నటిస్తున్న లేడీ ఓరియంటెడ్ ఫిల్మ్ 'లేతాకులు'. చంటి గాణమని దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో శృతీ శరణ్, అవయుక్త, వంశీ పాండ్య కీలక పాత్రధారులు. ఎమ్ఆర్ చౌదరి వడ్లపట్ల సమర్పణలో వెంకటేశ్ చిక్కాల నిర్మిస్తున్నారు. తొలి సీన్‌కి నిర్మాత మోహన వడ్లపట్ల కెమెరా స్విచ్చాన్ చేయగా, బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్ క్లాప్ ఇచ్చారు. డైరెక్టర్ సముద్ర గౌరవ దర్శకత్వం వహించగా, రచయిత 'తమ్ముడు' సత్యం స్క్రిప్ట్‌ని అందించారు. ''స్త్రీలకు మా సినిమా నచ్చుతుంది'' అన్నారు వెంకటేశ్ చిక్కాల, ఎమ్ఆర్ చౌదరి వడ్లపట్ల. ''నూతిలో కప్పలు' తర్వాత నేను చేస్తున్న సినిమా 'లేతాకులు'' అన్నారు చంటి గాణమని. ''ప్రతి మహిళ చూడాల్సిన చిత్రమిది'' అన్నారు ఎస్తేర్.

బబుల్ గమ్



• రోషన్ కనకాల, మానస

నటుడు రాజీవ్ కనకాల, యాంకర్ సుమ తనయుడు రోషన్ కనకాల హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'బబుల్‌గమ్'. 'క్షణం, కృష్ణ అండ్ హిజ్ లీల' చిత్రాల ఫేమ్ రవికాంత్ పేరెపు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం ద్వారా మానసా చౌదరి హీరోయిన్‌గా ఎంట్రీ ఇస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీతో కలిసి మహేశ్వరి మూవీస్ నిర్మిస్తున్న 'బబుల్‌గమ్' ఫస్ట్ లుక్‌ను ప్రముఖ దర్శకుడు రాజమౌళి రిలీజ్ చేసి, ''రోషన్ తనకంటూ ఓ ప్రత్యేక ముద్ర వేయాలి. రాజీవ్, సుమ గర్వపడేలా చేయాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ''చక్కని ప్రేమకథా చిత్రమిది'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: శ్రీచరణ్ పాకాల, కెమెరా: సురేష్ రగుతు.



• తలసాని శ్రీనివాస్ యాదవ్‌ని సన్మానిస్తున్న నిర్మాతలు

ఏ కష్టం వచ్చినా ముందుంటాను

– మంత్రి తలసాని

''నా పుట్టినరోజు వేడుకలను ఇంత భారీగా నిర్వహిస్తారని ఊహించలేదు. ఇందుకు తెలుగు చలన చిత్ర పరిశ్రమకు కృతజ్ఞతలు. నన్ను ఆశీర్వదించటానికి ఇన్ని వేల మంది రావడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నా'' అన్నారు తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్. శుక్రవారం (అక్టోబర్ 6) ఆయన పుట్టినరోజు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో తెలుగు చలనచిత్ర పరిశ్రమ ఆధ్వర్యంలో బర్త్ డే వేడుకలు జరిగాయి. ఈ వేడుకలో తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ- ''చిత్ర పరిశ్రమకు ఏ కష్టం వచ్చినా ముందుంటాను. ముఖ్యమంత్రి కేసీఆర్‌గారు కూడా ఇండస్ట్రీ సమస్యల పరిష్కారం పట్ల సానుకూలంగా ఉంటారు'' అన్నారు. తన తండ్రిపై రాయించిన ఓ పాటను తలసాని శ్రీనివాస్ యాదవ్ తనయుడు సాయి యాదవ్ రిలీజ్ చేశారు. సి. కల్యాణ్, దామోదర ప్రసాద్, 'దిల్' రాజు, ఎస్. రాధాకృష్ణ పాల్గొన్నారు.

ప్రతి పథకం వెనుక మానవీయత

- విద్యార్థులకు ఉపాహారంతో ఆరోగ్యం, చదువు మెరుగుపడతాయి: హరీశ్‌రావు
- పేద పిల్లల ఆకలిని తీర్చాలనే కొత్త పథకం అమల్లోకి తెచ్చినట్టు వెల్లడి
- రంగారెడ్డి జిల్లా రావిర్యాలలో మంత్రి సబితతో కలసి ఉపాహారం పథకం ప్రారంభించిన హరీశ్



నిరుపేద విద్యార్థికి డబుల్ బెడ్రూం ఇంటిని మంజూరు చేసిన మంత్రి సబిత

సాక్షి, రంగారెడ్డి జిల్లా/ సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి పథకం వెనుక ఏదో ఒక మానవీయ కోణం దాగి ఉందని.. ఈ క్రమంలో పేద పిల్లల ఆకలిని తీర్చేందుకే 'ముఖ్యమంత్రి ఉపాహారం పథకం'ను ప్రారంభిస్తున్నామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు చెప్పారు. శుక్రవారం ఆయన విద్యాశాఖ శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో కలసి రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం రావిర్యాల గ్రామంలో ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. ''కూలీనాలీ చేసుకునే నిరుపేదలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపుతున్నారు. చాలామంది పిల్లలు కేవలం టీ తాగో, ఖాళీ కడుపుతోనో బడికి వస్తున్నారు. ఆకలి బాధతో ఉన్న పిల్లలకు టీచర్లు చెప్పే పాఠాలు చెవికెక్కని పరిస్థితి ఉంటోంది. ఈ క్రమంలో ప్రభుత్వ బడుల్లో చదువుతున్న పేదపిల్లల ఆకలి తీర్చాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఉపాహారం పథకాన్ని తీసుకొచ్చింది. దీనితో వారి ఆరోగ్యం, హాజరుశాతం మెరుగుపడతాయి. తరగతి గదిలో టీచర్ చెప్పిన ప్రతి మాట, చదివిన ప్రతి అక్షరం మెదడుకు ఎక్కుతుంది..''అని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఈ పథకాలతోపాటు ఉచితంగా నాణ్యమైన విద్య, పుస్తకాలు, డ్రెస్సులు అందిస్తూ.. తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీలు రంజిత్‌రెడ్డి, బీబీ పాటిల్, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, పైళ్ల శేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, విద్యా శాఖ కమిషనర్ వాకాటి కరుణ, డైరెక్టర్ దేవసేన తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించే లక్ష్యంతోనే..: మంత్రి కేటీఆర్

కంటోన్మెంట్ (హైదరాబాద్): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలన్న లక్ష్యంతో 'ముఖ్యమంత్రి ఉపాహారం' పథకాన్ని ప్రారంభించామని మంత్రి కేటీఆర్ అన్నారు. శుక్రవారం ఆయన హైదరాబాద్‌లోని మారేడ్‌పల్లి ప్రభుత్వ బాలికల పాఠశా లలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణవ్యాప్తంగా 27 వేల ప్రభుత్వ పాఠశాలల్లో 23 లక్షల మంది నిరుపేద విద్యార్థులకు దీనితో ప్రయోజనం ఉంటుందని కేటీఆర్ చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థలు, విద్యాశాఖ సమన్వయంతో ఈ పథకం కొనసాగుతుందన్నారు. విద్యార్థులకు అందించే పౌష్టికాహారం నాణ్యతలో రాజీ పడకుండా, లోపాలు జరగకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రోజువారీ అందించే ఉపాహారం మెనూను మంత్రి చదివి వినిపించారు. అందులో శుక్రవారం అందించే ఉగ్గానీ గురించి వాకబు చేశారు. 'ఇది మన టిఫిన్ కాదా?'అని కేటీఆర్ అధికారులను ప్రశ్నించగా.. రాయలసీమ ప్రాంతంలో ఎక్కువగా వాడుతారని వారు వివరించారు.

పేద విద్యార్థి కుటుంబానికి డబుల్ బెడ్రూం ఇల్లు

రావిర్యాలలో ఉపాహారం పథకాన్ని ప్రారంభించిన తర్వాత ఆ ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న విష్ణు జగదీశ్ అనే విద్యార్థి మంత్రి సబితా ఇంద్రారెడ్డి వద్దకు వచ్చాడు. తన తల్లిదండ్రులు నిరుపేదలని, పూట గడవడం కోసం హోటల్లో పనిచేస్తున్నారని వివరించాడు. సొంతిల్లు లేక చాలీచాలని అద్దె ఇంట్లో ఉంటున్నామని, ఇరుకు గదుల్లో సరిగా చదువుకోలేక పోతున్నానని వాపోయాడు. తమకు ఇంటిని మంజూరు చేస్తే.. శ్రద్ధగా చదువుకొని ఉన్నత స్థానానికి చేరుకుంటానన్నాడు. విద్యార్థి మాటలతో మంత్రి సబిత చలించిపోయారు. అతడిని అక్కున చేర్చుకుని, తాను అండగా ఉంటానని భరోసా కల్పించారు. అప్పటికప్పుడు విష్ణు జగదీశ్ కుటుంబానికి డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. అక్కడే ఉన్న రెవెన్యూ అధికారులను ఇందుకు సంబంధించిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాగా చదువుకుని పైకి రావాలని విద్యార్థిని ఆశీర్వదించారు.

టిఫినీలు చేసి.. చదివేసి

ముఖ్యమంత్రి ఉపాహార పథకంపై హర్షాతిరేకాలు

సాక్షి, హైదరాబాద్: విద్యార్థులకు అవసరమైన పౌష్టికాహారం అందించడం, బడిపై పిల్లల్లో ఆసక్తి పెంచడం లక్ష్యంగా శుక్రవారం నుంచి ప్రారంభమైన 'ముఖ్యమంత్రి ఉపాహార పథకం'పై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థులు, తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయ వర్గాల్లోనూ ఆనందం వ్యక్తమవుతోంది. ఇప్పటికే మధ్యాహ్న భోజన పథకం అమల్లో ఉండగా.. పేద విద్యార్థులు ఆరోగ్యంగా ఎదిగేందుకు ఈ ఉపాహార పథకం మ రింత దోహదపడుతుందని ఉపాధ్యాయులు అంటున్నారు. బడి మానేసే పిల్లల సంఖ్య గణనీయంగా తగ్గుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఉదయాన్నే పిల్లలకు కావాల్సిన ఆహారం విషయమై తామిక ఎలాంటి హడావుడి పడాల్సిన అవసరం ఉండదని తల్లిదండ్రులు అంటున్నారు. రోజుకో రకం అల్పాహారం అందిస్తుండటంతో విద్యార్థుల్లో ఆసక్తి పెరుగుతుందని, క్రమం తప్పకుండా బడికి రావడం వల్ల చదువుల్లోనూ రాణించేందుకు అవకాశం ఏర్పడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఆరోగ్యం, ప్రమాణాల పెంపే లక్ష్యంగా..

ముఖ్యమంత్రి ఉపాహారం పథకం రాష్ట్రవ్యాప్తంగా 119 నియోజవర్గాల్లో శుక్రవారం లాంఛనంగా ప్రారంభమైంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ స్కూళ్లలో 1–10 తరగతులు చదివే విద్యార్థులు 23,05,801 మంది ఉన్నారు. వీళ్లంతా పేద, మధ్య తరగతికి చెందిన వారే. రోజువారీ కూలీకి వెళ్ళే వాళ్ళూ ఎక్కువ మందే ఉన్నారు. గ్రామాలతో పాటు పట్టణ ప్రాంతాల్లో సైతం తల్లిదండ్రులు ఇద్దరూ ఉదయాన్నే హడావుడిగా తమ పనులకు వెళ్ళడం వల్ల స్కూలుకెళ్లే పిల్లలను పట్టించుకోవడం కష్టంగానే ఉంటోంది. చాలామంది పిల్లలు ఉదయం పూట ఆహారం తీసుకోకుండానే స్కూలుకు వెళ్ళాల్సి వస్తోంది. మధ్యాహ్నం భోజనం అందిస్తున్నా ఈలోగా తరగతి గదిలో నీరసపడిపోతున్న ఘటనలూ ఉంటున్నాయి. మరోవైపు సరైన పౌష్టికాహార లోపం కారణంగా అనేక అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు. రాష్ట్ర విద్యా, ఆరోగ్యశాఖలు జరిపిన సర్వేలో ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థుల్లో ఎక్కువ మందిని పౌష్టికాహార లోపం వెంటాడుతోందని తేలింది. దీనివల్ల రక్తహీనత, దృష్టి లోపం ఏర్పడుతున్నట్టు గుర్తించారు. ఈ పరిస్థితుల్లోనే నాణ్యమైన పౌష్టికాహారంతో కూడిన ఉపాహారం అందించే పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. తెలంగాణలో పదో తరగతికి చేరే నాటికే బడి మానేస్తున్న వారి శాతం 13.9గా ఉంటోంది. పేదరికం, సరైన ఆహారం అందే పరిస్థితి లేకపోవడం, ఆర్థిక పరిస్థితులు దీనికి కారణంగా విద్యాశాఖ అంచనా వేస్తోంది. ఉపాహారం అందుబాటులోకి తేవడం వల్ల విద్యార్థుల హాజరు శాతం గణనీయంగా పెరుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సీఎం సార్.. బ్రేక్‌ఫాస్ట్ సూపర్



ఈ రోజు మా స్కూల్లో ఇచ్చిన ఇడ్లీ, పూరీ, కిచిడీ, చట్నీ, సాంబార్ చాలా బాగున్నాయి. ఆరు రోజుల పాటు రకరకాల బ్రేక్ ఫాస్ట్ ఇస్తారట. మా కోసం మంచి పథకం తీసుకొచ్చిన సీఎం సార్‌కు కృతజ్ఞతలు. – హైమావతి, ఏడో తరగతి, రావిర్యాల ప్రభుత్వ పాఠశాల (రంగారెడ్డి జిల్లా)

ఇంట్లో సమస్య తీరిపోతుంది



ఉదయం పిల్లలు తినీతినకుండానే హడావుడిగా బడికి వెళ్తారు. ఇప్పుడు ప్రభుత్వం ఉపాహారం అందిస్తుండటంతో ఆ సమస్య తీరిపోతుంది. ఇంట్లో తినకుండా మారం చేసేవాళ్లు కూడా అక్కడే బుద్ధిగా తింటారు. మధ్యాహ్న భోజన పథకం మాదిరిగానే ఈ పథకాన్ని కూడా నిరంతరం కొనసాగించాలి. – గుడిమల్ల రాజేష్, విద్యార్థి తండ్రి, భూపాలపల్లి

ఈ పథకం ఎంతో ఉపయోగకరం

మారేడుపల్లిలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పిల్లల తల్లిదండ్రులు అధిక శాతం పని చేసుకుంటూ జీవించేవారే. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం ద్వారా విద్యార్థినులు అందరికీ నాణ్యమైన పౌష్టికాహారం అందుతుంది. ఇకపై ఎవరూ బ్రేక్‌ఫాస్ట్ చేయకుండా క్లాసులకు హాజరయ్యే పరిస్థితి ఉండదు.



– మోహనాచార్యులు, ప్రధానోపాధ్యాయులు, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, మారేడుపల్లి

గ్రూప్‌–4 తుది 'కీ' విడుదల

సాక్షి, హైదరాబాద్: గ్రూప్‌–4 కొలువుల భర్తీలో భాగంగా తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) జూలై 1న నిర్వహించిన అర్హత పరీక్ష తుది 'కీ'ని వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు కమిషన్ కార్యదర్శి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు సంబంధించిన ప్రాథమిక 'కీ'ని ఆగస్టు 28న వెబ్‌సైట్‌లో అభ్యర్థులకు అందుబాటులోకి తీసుకువచ్చిన అధికారులు.. సెప్టెంబర్ 4వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించారు. అభ్యర్థుల నుంచి వచ్చిన అభ్యంతరాలను నిపుణుల కమిటీ ముందుంచి పరిశీలించారు. నిపుణుల కమిటీ సూచనలకు అనుగుణంగా తుది 'కీ'ని రూపొందించి శుక్రవారం అభ్యర్థులకు అందుబాటులోకి తెచ్చారు. కమిషన్ జారీ చేసిన తుది 'కీ'లో ఎలాంటి మార్పులుండవని టీఎస్‌పీఎస్సీ స్పష్టం చేసింది.

182 మంది బీసీ స్టడీ సర్కిల్ అభ్యర్థులకు కానిస్టేబుల్ ఉద్యోగాలు

బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర బీసీ స్టడీ సర్కిల్ పరిధిలో శిక్షణ తీసుకున్న వారిలో 182 మంది అభ్యర్థులకు కానిస్టేబుల్ ఉద్యోగాలు దక్కడం ఆనందంగా ఉందని బీసీ సంక్షేమ శాఖమంత్రి గంగుల కమలాకర్ వెల్లడించారు. బీసీ స్టడీ సర్కిల్ ద్వారా నాణ్యమైన శిక్షణ ఇచ్చినందునే పెద్ద సంఖ్యలో అభ్యర్థులు ఉద్యోగాలు దక్కించుకున్నారన్నారు. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అందిస్తున్న ప్రోత్సాహం, కల్పిస్తున్న వనరుల వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని వెల్లడించారు.

'కేనెస్' పెట్టుబడి రూ.2,800 కోట్లు

- కొంగరకలాన్‌లో సెమీకండక్టర్ల తయారీ యూనిట్
- రెండువేల మందికి ప్రత్యక్ష ఉద్యోగాలకు అవకాశం
- మంత్రి కేటీఆర్‌తో 'కేనెస్ టెక్నాలజీ' ప్రతినిధుల భేటీ



కేనెస్ ఎండీ రమేశ్ కన్నన్‌కు జ్ఞాపిక అందిస్తున్న కేటీఆర్. చిత్రంలో చైర్‌పర్సన్ సవిత రమేశ్

సాక్షి, హైదరాబాద్: సెమీ కండక్టర్ల రంగంలో పేరొందిన 'కేనెస్ టెక్నాలజీ'రాష్ట్రంలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. రూ.2,800 కోట్ల పెట్టుబడితో రంగారెడ్డి జిల్లాలోని కొంగర కలాన్‌లో ఎలక్ట్రానిక్స్ తయారీ పరిశ్రమ ఫాక్స్‌కాన్‌కు పొరుగునే కేనెస్ టెక్నాలజీ నూతన తయారీ యూనిట్ ఏర్పాటు చేయనుంది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కేటీ రామారావుతో కేనెస్ మేనేజింగ్ డైరెక్టర్ రమేశ్ కన్నన్, చైర్‌పర్సన్ సవితా రమేశ్ శుక్రవారం ఇక్కడ భేటీ అయ్యారు. కొంగరకలాన్ యూనిట్‌లో ఔట్ సోర్స్‌డ్ సెమీ కండక్టర్ అసెంబ్లీ టెస్ట్(ఓఎస్ఏటీ)తోపాటు సంక్లిష్ట సెమీ కండక్టర్ల తయారీ వసతులు అందుబాటులోకి వస్తాయని వివరించారు. కేనెస్ టెక్నాలజీ తన అనుబంధ కేనెస్ సెమీకాన్ సంస్థ ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమ వినియోగదారులకు విద్యుత్ ఉపకరణాలకు అవసరమైన పరికరాలను అందుబాటులోకి తెస్తోంది. ఐఐటీ ముంబై సహకారంతో కేనెస్ సెమీకాన్ అత్యాధునిక వసతులతో కూడిన పరిశోధన అభివృద్ధి కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేస్తుంది. రాష్ట్రంలో సెమీ కండక్టర్ల వాతావరణాన్ని బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పట్టుదలతో ఉందని మంత్రి కేటీఆర్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. సమావేశంలో ఐటీ పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, టీఎస్ఐఐసీ చైర్మన్ ఈవీ నర్సింహారెడ్డి, ఎలక్ట్రానిక్స్ విభాగం డైరెక్టర్ సుజయ్ కారంపూరి, కేనెస్ సెమీకాన్ సీఈవో రఘు ఫణిక్కర్ పాల్గొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.